SAMAYAM
epaper.samayamdaily.net APTEL/2006/18267
# సమయం
మన గొంతుకకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక
సంపుటి: 19 | సంచిక: 06 | ఎడిటర్ : విక్రం కుమార్ | ఆదివారం 5 అక్టోబర్ 2025 | ప్రచురణ : హైదరాబాద్ | పేజీలు: 12 | వెల:రూ.5 |

సమయం
విలేకరులు కావలెను
ఫోన్ నెం : 99483 13985/ 89789 80131

## నక్సల్స్‌తో చర్చల ప్రసక్తే లేదు

నక్సల్స్‌తో కేంద్రం చర్చలు జరిపే ప్రసక్తే లేదని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మరో సారి స్పష్టం చేశారు. వారంతా లొంగిపోవాలని విజ్ఞప్తి చేశారు. బస్తర్ ప్రాంతంలో శాంతికి విఘాతం కలిగించే ఎలాంటి చర్యలకైనా మావోయిస్టులు పాల్పడితే భద్రతా బలగాలు గట్టి జవాబిస్తాయని హెచ్చరించారు. వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ నాటికి 'రెడ్ టెర్రర్'కు ముగింపు పలికేందుకు కేంద్రం కృతనిశ్చయంతో ఉందని చెప్పారు. ఆయుధాలు వదిలేస్తే స్వాగతిస్తామని అమిత్‌షా అన్నారు.



04

- వారు ఆయుధాలు వదిలి లొంగిపోవాల్సిందే
- ప్రభుత్వ పునరావాస ప్యాకేజీ అందుకుంటే మంచిది
- అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే చూస్తూ ఊరుకోం
- వచ్చే మార్చి నాటికి రెడ్ టెర్రర్‌కు ముగింపు పలుకుతాం
- జగదల్‌పూర్ పర్యటనలో కేంద్రహోంమంత్రి అమిత్ షా

## ఆత్మనిర్భర భారత్‌కు ఐటీఐలు కీలకం

- శ్రమేవ జయతే, శ్రమేవ పూజ్యతే' సాకారం
- కౌశల్ దీక్షాంత్ సమరోహ్‌లో ప్రధాని మోడీ
- బీహార్‌లో ప్రారంభించిన సీఎం నితీశ్

04

ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు (ఐటీఐ) ఆత్మనిర్భర్ భారత్‌కు కీలకమైన వర్క్‌షాప్‌లు అని ప్రధాని మోదీ ప్రశంసించారు. ఐటీఐలు పారిశ్రామిక విద్యా సంస్థలు మాత్రమే కాదు, ఆత్మనిర్భర్ భారత్‌కు వర్క్‌షాప్‌లు అని చెప్పారు. యువత సాధికారతకు మెగా ప్రోగ్రామ్‌గా ఈ ఈవెంట్‌ను ప్రధాని వర్ణించారు. 'శ్రమేవ జయతే, శ్రమేవ పూజ్యతే' అని ఉటంకిస్తూ, స్కిల్డ్ వ్యక్తులను గౌరవించాలని సూచించారు.






# పరదాలు కట్టుకుని రాలేదు..
# దర్జాగా ఆటోలో వచ్చాం



## జగన్ దెబ్బకు దిగొచ్చిన చంద్రబాబు

### ఆటో డ్రైవర్లకు పథకంపై నాని ఎద్దేవా

**అమరావతి :** సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్‌పై మాజీ మంత్రి పేర్ని నాని ఫైర్ అయ్యారు.. తాజాగా ఆయన మీడియాతో మాట్లాడారు. చంద్రబాబు, పవన్, లోకేష్ ముగ్గురూ కలిసి మూడు ఖాకీ చొక్కాలేశారన్నారు. ఆటో డ్రైవర్ సేవలో పేరుతో డ్రైవర్లకు డబ్బులేశామని చెబుతున్నారన్నారు. ఎన్నికల్లో రాష్ట్రమంతా మహిళలకు బస్సు మిగతా 5 లో

**ఆటో డ్రైవర్ల కోసం ఉబర్ తరహా యాప్ డ్రైవర్ల సంక్షేమం బోర్డు ఏర్పాటు చేస్తాం**

- ప్రభుత్వం చేసే మంచి పనిని డ్రైవర్లే ప్రజల్లోకి తీసుకెళ్లాలి
- చెడుపై మంచి సాధించిన విజయమే పండుగల స్ఫూర్తి
- దుష్టులు మళ్లీ రాకూడదు.. అభివృద్ధి వైకుంఠపాళి కాకూడదు
- 'ఆటో డ్రైవర్ సేవలో' కార్యక్రమంలో సీఎం చంద్రబాబు
- 2.90 లక్షల డ్రైవర్ల ఖాతాల్లో రూ.436 కోట్ల జమ
- 14 కిలోమీటర్ల దూరం ఆటోలో ప్రయాణించిన సీఎం

**విజయవాడ:** ఆటో డ్రైవర్ల కోసం ఉబర్ తరహా యాప్ తెస్తామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ప్రకటించారు. ఆటో డ్రైవర్ సేవలో పథకాన్ని సీఎం చంద్రబాబు శనివారం ప్రారంభించి లబ్దిదారులకు చెక్కులు అందించారు. ఆటో, క్యాబ్ డ్రైవర్లకు రూ. 15 వేలు వారి బ్యాంక్ ఖాతాల్లో నేరుగా జమ చేశారు. రాష్ట్రంలోని 2,90,669 మిగతా 5 లో

## బీసీ రిజర్వేషన్లపై సుప్రీంలో సవాల్




4

- ఎన్నికల్లో 50శాతం మించి రిజర్వేషన్లు
- సుప్రీంలో వంగా గోపాల్ రెడ్డి పిటిషన్
- సోమవారం విచారించనున్న కోర్టు

## స్పీకర్ చాంబర్‌లో ఎమ్మెల్యేల విచారణ

- విచారణకు హాజరైన గూడెం, బండ్ల
- స్పీకర్ ముందు వాదనలు వినిపించిన ఎమ్మెల్యేలు

02



## కొండాపూర్‌లో హైడ్రా కూల్చివేతలు

3600 కోట్ల భూమి స్వాధీనం

.. వివరాలు 2లో

## రేపటి నుంచి హౌసింగ్ బోర్డు భూముల విక్రయాలు

- చింతల్, కేపీహెచ్‌బీ, రావిర్యాల భూములు, ప్లాట్లను బహిరంగ, ఈ-వేలం

02





## అమెరికాలో దుండగుడి కాల్పులు

2

- హైదరాబాద్ విద్యార్థి మృతి
- సీఎం రేవంత్ దిగ్భ్రాంతి.. హరీష్ రావు పరామర్శ



## మాజీ మంత్రికి వీడ్కోలు

- అధికారిక లాంఛనాలతో దామోదర్‌రెడ్డి అంత్యక్రియలు
- పార్థివదేహానికి మంత్రి వెంకట్ రెడ్డి నివాళులు
- అంతిమయాత్రలో పలువురు ప్రముఖులు హాజరు

2



## ఆర్టీసీ షాక్

- సిటీ బస్సుల్లో ఛార్జీల పెంపు
- సోమవారం నుంచి అమల్లోకి ఛార్జీలు

03




టీజీఎస్ఆర్టీసీ ప్రయాణికులకు షాక్ ఇచ్చింది. సిటీ బస్సుల్లో ఛార్జీలు పెంచుతున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో నడిచే అన్ని బస్సుల్లో ఛార్జీలు పెంచుతున్నట్లు పేర్కొంది.



# అమెరికాలో కాల్పులు

## హైదరాబాద్ విద్యార్థి చంద్రశేఖర్ మృతి

## సీఎం రేవంత్ దిగ్భ్రాంతి.. హరీష్ రావు పరామర్శ

**హైదరాబాద్, అక్టోబర్ 4 :** అమెరికాలో దారుణం చోటుచేసుకుంది. టెక్సాస్ రాష్ట్రం డల్లాస్‌లో జరిగిన కాల్పుల్లో తెలుగు వ్యక్తి ప్రాణాలు కోల్పోయాడు. గురువారం రాత్రి ఈ సంఘటన చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల మేరకు.. హైదరాబాద్, మీర్‌పేట్ టీచర్స్ కాలనీకి చెందిన 35 ఏళ్ల పోలె చంద్రశేఖర్ కొన్నేళ్ల క్రితం అమెరికా వెళ్లాడు. డల్లాస్‌లోని ఓ గ్యాస్ ఫిల్లింగ్ స్టేషన్‌లో పని చేస్తూ జీవనం సాగిస్తున్నాడు. గురువారం రాత్రి అతడు డ్యూటీలో ఉండగా ఊహించని దారుణం జరిగింది. ఓ వ్యక్తి అకస్మాత్తుగా చంద్రశేఖర్‌పై కాల్పులకు తెగబడ్డాడు. బుల్లెట్ గాయాల కారణంగా చంద్రశేఖర్ చనిపోయాడు. నల్లజాతీయుడు వచ్చి విచక్షణారహితంగా కాల్పులు జరిపినట్లు తెలుస్తోంది. సమాచారం అందుకున్న పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు. చంద్రశేఖర్ మృతితో ఎల్బీనగర్ పరిధిలోని బీఎన్‌రెడ్డినగర్‌లో విషాదఛాయలు అలుముకున్నాయి. కుటుంబసభ్యులు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. ఈ ఘటన తెలుసుకున్న బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఎల్బీనగర్ పరిధిలోని బీఎన్‌రెడ్డినగర్‌కు చెందిన పోలే చంద్రశేఖర్ 2023లో బీడీఎస్ పూర్తి చేసి ఉన్నత చదువుల కోసం అమెరికా వెళ్లాడు. చంద్రశేఖర్ మృతిపై సీఎం రేవంత్‌రెడ్డి దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. అతడి మరణం ఆవేదన కలిగించిందన్నారు. మృతుడి కుటుంబానికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. చంద్రశేఖర్ భౌతికకాయాన్ని స్వస్థలానికి తీసుకొచ్చేందుకు అన్నివిధాలా సహకారం అందిస్తామని చెప్పారు.

## లండన్‌లో గుండెపోటుతో యువకుడు మృతి

**జగిత్యాల, అక్టోబర్ 4:** జగిత్యాల జిల్లా మేడిపల్లి మండలం దమ్మన్నపేటకు చెందిన ఏనుగు మహేందర్‌రెడ్డి(26) లండన్‌లో గుండెపోటుతో మృతి చెందారు. ఆయన రెండు సంవత్సరాల క్రితం పీజీ చేసేందుకు లండన్ వెళ్లి ఇటీవలే పూర్తి చేశారు. వర్క్ వీసా కూడా వచ్చింది. మహేందర్ తండ్రి రమేశ్ రెడ్డి కాంగ్రెస్ పార్టీ మేడిపల్లి మండల అధ్యక్షుడిగా ఉన్నారు. యువకుడి మృతి పట్ల ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, పలువురు ప్రజా ప్రతినిధులు సంతాపం తెలిపారు.

# త్వరలో స్థానిక ఎన్నికలు

## రాష్ట్ర ఎన్నికల సంఘం నిర్ణయం

**హైదరాబాద్, అక్టోబర్4 :** రాష్ట్రంలో స్థానిక ఎన్నికల నిర్వహణకు రాష్ట్ర ఎన్నికల సంఘం షెడ్యూల్ విడుదల చేసిన విషయం తెలిసిందే. మొత్తం ఐదు దశల్లో ఈ ఎన్నికలను నిర్వహించనున్నారు. తొలి రెండు దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ.. మిగతా మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు జరగనున్నాయి. ఈ నేపథ్యంలోనే రాష్ట్ర ఎన్నికల సంఘం కీలక నిర్ణయం తీసుకుంది. జడ్పీటీసీ, ఎంపీటీసీ ఎన్నికల దృష్ట్యా కాల్ సెంటర్‌ను ఏర్పాటు చేశారు. ప్రజలు ఎన్నికల సమాచారం, ఫిర్యాదులు, సంబంధిత అంశాలపై వివరాల కోసం 9240021456 నెంబర్‌కు ఫోన్ చేసి సంప్రదించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం అధికారులు వెల్లడించారు. కాగా, రాష్ట్రంలో 31 జిల్లాల్లోని 565 మండలాల్లో రాష్ట్ర ఎన్నికల సంఘం ఎన్నికలు నిర్వహించనుంది. 5,749 ఎంపీటీసీ, 565 జడ్పీటీసీ స్థానాలు, 12,733 గ్రామ పంచాయతీలు, 1,12,288 వార్డులకు ఎన్నికలు జరుగుతాయి. ఎంపీటీసీ, జడ్పీటీసీలకు అక్టోబర్ 23న తొలివిడత, 27న రెండో విడత ఎన్నికల పోలింగ్ నిర్వహించనున్నారు. గ్రామ పంచాయతీలకు తొలి విడత అక్టోబర్ 31న, రెండో విడత నవంబర్ 4న, మూడో విడత నవంబర్ 8న నిర్వహిస్తారు. పోలింగ్ పూర్తయిన తర్వాత అదే రోజు గ్రామ పంచాయతీల ఓట్ల లెక్కింపు చేపట్టి విజేతలను ప్రకటిస్తారు. నవంబర్ 11న ఎంపీటీసీ, జడ్పీటీసీ ఓట్ల లెక్కింపు జరుగుతుందని రాష్ట్ర ఎన్నికల స్పష్టం చేసింది.

# మాజీ మంత్రికి వీడ్కోలు



**తుంగతుర్తి, అక్టోబర్ 4 :** కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత, మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి అంత్యక్రియలు అధికారిక లాంఛనాలతో శనివారం నిర్వహించారు. తుంగతుర్తి నియోజకవర్గంలోని తన వ్యవసాయ క్షేత్రంలో దామోదర్ రెడ్డి అంత్యక్రియలు జరిపించారు. సూర్యాపేట నుంచి తుంగతుర్తికి దామోదర్ రెడ్డి పార్థీవదేహన్ని శుక్రవారం రాత్రి తరలించారు. ప్రజల సందర్శనార్థం శనివారం ఉదయం వరకు అక్కడే ఉంచారు. దామోదర్ రెడ్డి అంత్యక్రియల్లో మంత్రులు ఉత్తమ్ కుమార్ రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు. పీసీసీ చీఫ్ బీ మహేశ్ కుమార్ గౌడ్, మాజీ మంత్రి జీ జగదీశ్ రెడ్డి, ఎమ్మెల్యేలు ఎన్. పద్మావతి ఉత్తమ్ కుమార్ రెడ్డి, బాలునాయక్,మాజీ ఎమ్మెల్యేలు భిక్షమయ్య గౌడ్, గాదరి కిశోర్ సహా ఉమ్మడి నల్గొండ జిల్లాకు చెందిన ప్రజా ప్రతినిధులు, మాజీ ప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు దామోదర్ రెడ్డిని కన్నీటి వీడ్కోలు పలికారు. పార్టీకి, ప్రజలకు అంకితభావంతో సేవలందించిన దామోదర్ రెడ్డి గారిమరణం కాంగ్రెస్ పార్టీకి తీరని లోటని మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి అన్నారు. ప్రజల కోసం ఆయన తాపత్రయ పడిన తీరు,విలువలతో కూడిన రాజకీయం చేసిన ఆయన వ్యక్తిత్వం నేటి తరానికి ఆదర్శం అన్నారు. 5సార్లు ఈ ప్రాంత ఎమ్మెల్యేగా ప్రజల మనసు గెలుచుకున్న గొప్ప నాయకున్ని కోల్పోయామని,ఆయనతో ఉన్న అనుబంధాన్ని ఈ సందర్భంగా మంత్రి గుర్తు చేసుకున్నారు. వారి పవిత్ర ఆత్మకు శాంతి చేకూరాలని భగవంతుణ్ణి ప్రార్థిస్తున్నానని తెలిపారు.

# రేపటి నుంచి హౌసింగ్ బోర్డు భూముల విక్రయాలు

## చింతల్, కేపీహెచ్‌బీ, రావిర్యాల భూములు, ప్లాట్లను బహిరంగ, ఈ-వేలం



**హైదరాబాద్, అక్టోబర్ 4 :** గ్రేటర్ హైదరాబాద్ పరిధితో సహా పలు పట్టణ ప్రాంతాల్లో ఉన్న భూములను, ఖాళీ ప్లాట్లను రేపటి నుంచి (అక్టోబరు 6, సోమవారం) వివిధ రకాల వేలం పాటల ద్వారా విక్రయించడానికి తెలంగాణ హౌసింగ్ బోర్డు సిద్ధమైంది. సోమవారం నగరంలోని చింతల్, నిజాంపేట, బాచుపల్లి ప్రాంతంలో ఉన్న 22 రెసిడెన్షియల్ ప్లాట్లు, ఫ్లాట్లను బహిరంగ వేలం ద్వారా విక్రయించనున్నారు. ఇందుకు సంబంధించిన నోటిఫికేషన్‌ను గత నెల 15న జారీ చేశారు. చింతల్ ప్రాంతంలో 18 ఎంఐజీ, హెచ్ఐజీ ప్లాట్లు, నిజాం పేట బాచుపల్లిలో 4 ఫ్లాట్లును బహిరంగ వేలం వేయనున్నారు. ఇటీవల కేపీహెచ్‌బీ ప్రాంతంలో హౌసింగ్ బోర్డు పలు దఫాలుగా నిర్వహించిన భూముల విక్రయాల్లో ఎకరా భూమి సుమారు రూ.70 కోట్లకు ఈ-వేలం ద్వారా విక్రయించిన సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేపీహెచ్‌బీ కాలనీలో నాలుగు కమర్షియల్ ప్లాట్లను అక్టోబర్ 7, 8 వ తేదీల్లో ఈ-వేలం ప్రక్రియ ద్వారా విక్రయించనున్నారు. ఫేజ్ 1, ఫేజ్2 పరిధిలో ఉన్న 6549 చదరపు గజాలతో పాటు, 2420 చ.గజాలు, 2397 చ.గజాలు, 726చ. గజాల విస్తీర్ణంలోని ప్లాట్లకు మంగళవారం ఈ-వేలం నిర్వహిస్తున్నారు. అలాగే నాంపల్లి ప్రాంతంలోని 1148 చదరపు గజాల కమర్షియల్ ప్లాట్‌ను 8న ఈ-వేలం ద్వారానే విక్రయిస్తున్నామని హౌసింగ్ బోర్డు అధికారులు ఒక ప్రకటనలో తెలిపారు. అక్టోబరు 9, 10 వ తేదీల్లో చింతల్ లోని 10,890 చదరపు గజాల కమర్షియల్ భూమి, మహేశ్వరం మండలంలోని రావిర్యాల ప్రాంతంలోని 13,503 చ.గ.లు, 5,953.20 చ.గ.లు, 3,630 చ.గజాల విస్తీర్ణంలోని భూములను కూడా ఈ-వేలం ద్వారా విక్రయించనున్నారు. వచ్చే పది రోజుల్లో రాష్ట్రంలోని వివిధ జిల్లాల్లోని హౌసింగ్ బోర్డు ప్లాట్ల విక్రయానికి కూడా నోటిఫికేషన్ ఇచ్చారు. వీటిలో సంగారెడ్డి-సదాశివపేటలోని ప్లాట్లు, జోగులాంబ గద్వాల, నిజామాబాద్ తదితర ప్రాంతాలకు చెందిన భూములున్నాయి. ఇందుకు సంబంధించి కొద్దిరోజుల క్రితమే వివిధ రకాల నోటిఫికేషన్లను విడుదల చేసినట్లు హౌసింగ్ బోర్డు అధికారులు తెలిపారు.



# నగరంలో మరోమారు వర్షం

## వచ్చేనాలుగు రోజులు రాష్ట్రంలో వర్షాలు • హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడి

**హైదరాబాద్,అక్టోబర్4:** హైదరాబాద్‌లో పలుప్రాంతాల్లో శనివారం మధ్యాహ్నం నుంచి సాయంత్రం వరకు వర్షం కురిసింది. తెలంగాణలో నాలుగు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం వెల్లడించింది. తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని పేర్కొంది. దక్షిణ ఇంటీరియర్ కర్నాటక నుంచి కొమోరిన్ ప్రాంతం వరకు తమిళనాడు అంతరభాగంగా సగటు సముద్రమట్టానికి 1.5 కిలోమీటర్ల ఎత్తులో ద్రోణి కొనసాగుతుందని తెలిపింది. తమిళనాడు తీరం వెంబడి నైరుతి బంగాళాఖాతంలో సగటు సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల ఎత్తులో ఉపరితల ఆవర్తనం విస్తరించి ఉందని చెప్పింది. ఈ క్రమంలో ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, హైదరాబాద్, రంగారెడ్డి, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి, మహబూబ్‌నగర్, నాగర్ కర్నూల్ జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే సూచనలున్నాయని తెలిపింది.ఆదివారం ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులలతో కూడిన వానలు కురుస్తాయని అంచనా వేసింది. సోమవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, నిజామాబాద్, జగిత్యాల, రాజన్న సిరిసిల్ల, కరీంనగర్, పెద్దపల్లి, భూపాలపల్లి, ములుగు, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హన్మకొండ, జనగాం, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి, రంగారెడ్డి, హైదరాబాద్, మేడ్చల్ మల్కాజ్‌గిరి, వికారాబాద్, సంగారెడ్డి, మెదక్, కామారెడ్డి జిల్లాల్లో అక్కడక్కడ వర్షాలు కురిసే ఛాన్స్ ఉందని చెప్పింది. మంగళవారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, పెద్దపల్లి, ములుగు, భష్తప్రాలపల్లి, కొత్తగూడెం, ఖమ్మం, సూర్యాపేట, మహబూబాబాద్, వరంగల్, హనుమకొండ జిల్లాల్లో అక్కడక్కడ వానలు పడే అవకాశాలున్నాయని వివరించింది. బుధశారం ఆదిలాబాద్, ఆసిఫాబాద్, మంచిర్యాల, నిర్మల్, నిజామాబాద్, రాజన్న సిరిసిల్ల, సిద్దిపేట, సంగారెడ్డి, కామారెడ్డి జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలు ఉన్నాయని వివరించింది. ఈ మేరకు ఆయా జిల్లాలకు వాతావరణశాఖ ఎల్లో అలెర్ట్ జారీ చేసింది.

# స్పీకర్ చాంబర్‌లో ఎమ్మెల్యేల విచారణ

## విచారణకు హాజరైన గూడెం, బండ్ల

## స్పీకర్ ముందు వాదనలు వినిపించిన ఎమ్మెల్యేలు





**హైదరాబాద్,అక్టోబర్ 4:** తెలంగాణ రాష్ట్రంలో సంచలనంగా మారిన ఎమ్మెల్యేల ఫిరాయింపు కేసులో విచారణలు కొనసాగాయి. ఈ నేపథ్యంలో శనివారం చేపట్టిన విచారణ ముగిసింది. విచారణలో భాగంగా పిటిషనర్ల తరఫున అడ్వకేట్లు.. ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డిలను క్రాస్ ఎగ్జామినేషన్ చేశారు. అనంతరం స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ ఎదుట ఎమ్మెల్యేలు తమ వాదనలు వినిపించారు. ఉదయం నుంచి స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ చాంబర్లో విచారణ కొనసాగింది. ఈనెల 1వ తేదీన జగరగాల్సిన విచారణ వాయిదా పడటంతో.. ఈ ఇద్దరు ఎమ్మెల్యేలు శనివారంనాటి విచారణకు హాజరయ్యారు. బీఆర్ఎస్‌లో గెలిచి పార్టీ మారిన ఎమ్మెల్యేలపై అనర్హత వేటు వేయాలంటూ బీఆర్ఎస్ పిటిషన్ వేసిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యలో సుప్రీకోర్టును బీఆర్ఎస్ ఆశ్రయించింది. దీంతో విచారణ చేపట్టిన న్యాయస్థానం స్పీకర్ నిర్ణయం తీసుకోవాలని గడువు విధించింది. ఈ మేరకు పార్టీ మారిన 10 మంది ఎమ్మెల్యేలకు స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ నోటీసులు జారీ చేశారు. అయితే దానం నాగేందర్, కడియం శ్రీహరి మినహా మిగిలిన 8 మంది ఎమ్మెల్యేలు తాము పార్టీ మారలేదంటూ వివరణ ఇచ్చారు. ఫిర్యాదుదారులు వారు పార్టీ మారని వారికి వ్యతిరేకంగా ఆధారాలు సమర్పించారు. దీనిలో భాగంగా పార్టీ ఫిరాయింపుల కేసులో ఎమ్మెల్యేల విచారణ కొనసాగుతోంది. ఈ మేరకు శనివారం ఎమ్మెల్యేలు గూడెం మహిపాల్ రెడ్డి, బండ్ల కృష్ణమోహన్ రెడ్డి విచారణకు హాజరయ్యారు. కాగా, ఎమ్మెల్యేల విచారణలు ముగిసిన అనంతరం స్పీకర్ ఏ నిర్ణయం తీసుకుంటారు అనేది చర్చనీయాంశంగా మారింది.

# కొండాపూర్‌లో హైడ్రా కూల్చివేతలు

## 3600 కోట్ల భూమి స్వాధీనం

## హైకోర్టు తీర్పుతో తాత్కాలిక షెడ్ల తొలగింపు



**హైదరాబాద్, అక్టోబర్ 4:** భాగ్యనగరంలో హైడ్రా అధికారుల కూల్చివేతలు కొనసాగుతున్నాయి. వరుసగా అక్రమ నిర్మాణాలపై హైడ్రా అధికారులు ఉక్కుపాదం మోపుతున్నారు. శనివారం కొండాపూర్‌లో హైడ్రా అధికారులు కూల్చివేతలు చేపట్టారు. కొండాపూర్‌లోని బిక్షపతి నగర్‌లో అక్రమ నిర్మాణాలను కూల్చివేసారు. ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను తొలగిస్తున్నారు హైడ్రా సిబ్బంది. భారీ పోలీస్ బందోబస్తు నడుమ కూల్చివేతలు చేపట్టారు. కూల్చివేతల వద్దకు మీడియాని పోలీసులు అనుమతించండం లేదు. రెండు కిలోమీటర్ల దూరంలోనే మీడియాను, స్థానికులను పోలీసులు అడ్డుకుంటున్నారు. కోర్టు ఆదేశాలతో హైదరాబాద్‌లోని కొండాపూర్‌లో హైడ్రా భారీగా కూల్చివేతలు చేపట్టింది. ఆర్టీఏ కార్యాలయం పక్కన భిక్షపతి నగర్‌లో ఉన్న 36 ఎకరాల ప్రభుత్వ స్థలంలో అక్రమ నిర్మాణాలను హైడ్రా సిబ్బంది తొలగించారు. భారీ పోలీసు బందోబస్తు నడుమ కూల్చివేతలు చేపట్టారు. కూల్చివేతల వద్దకు ఎవరినీ అనుమతించలేదు. రెండు కిలోమీటర్ల దూరంలోనే బారికేడ్లను ఏర్పాటు చేసి స్థానికులను అడ్డుకున్నారు. ఈ భూమిని కొంతమంది కబ్జా చేశారు. ఈ విషయమై హైకోర్టు తీర్పు మేరకు హైడ్రా ఆక్రమణల తొలగింపును చేపట్టింది. తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేసి వ్యాపారం చేసుకుంటున్న వారిని ఖాళీ చేయించింది. చుట్టూ కంచె వేసి ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ బోర్డులు ఏర్పాటు చేసింది. సర్వే నంబర్ 59లోని ఈ భూముల విలువ రూ.3,600 కోట్లు ఉంటుందని అధికారులు తెలిపారు. మరోవైపు 60 ఏళ్లుగా తమ అధీనంలో భూములున్నాయని రైతులు చెబుతున్నారు. హైదరాబాద్ నగరంలోని కొండపూర్ లో ప్రభుత్వ భూమిలో ఆక్రమణలను హైడ్రా అధికారులు తొలగించడం ద్వారా . దాదాపు 3600 కోట్ల రూపాయల విలువ చేసే 36 ఎకరాల ప్రభుత్వ భూమిని కాపాడింది. రంగారెడ్డి జిల్లా శేరిలింగంపల్లి మండలంలోని కొండాపూర్ ఆర్టీఏ కార్యాలయానికి సమీపంలోని సర్వే నంబర్ 59లో 36 ఎకరాల ప్రభుత్వ భూమిని కొంత మంది కబ్జా చేశారని హైడ్రా తెలిపింది. దీనిపై గతంలో రైతులకు అనుకూలంగా రంగారెడ్డి జిల్లా సివిల్ కోర్టు తీర్పు ఇచ్చింది. రంగారెడ్డి జిల్లా కోర్టు తీర్పును హైకోర్టులో తెలంగాణ ప్రభుత్వం సవాల్ చేసింది. దీంతో ఉన్నత న్యాయస్థానం సర్కార్ కి అనుకూలంగా తీర్పు ఇచ్చింది. ఆ 36 ఎకరాల భూమి ప్రభుత్వానిదే అని తేల్చి చెప్పింది. హైకోర్టు తీర్పు మేరకు శనివారం ఉదయం నుంచి కొండాపూర్‌లోని బిక్షపతి నగర్ ప్రభుత్వ భూమిలో ఉన్న ఆక్రమణల తొలగింపును భారీ పోలీస్ బందోబస్తు మధ్య హైడ్రా సిబ్బంది చేపట్టింది. తాత్కాలిక షెడ్డులను ఏర్పాటు చేసి వ్యాపారం చేసుకుంటున్న వారిని ఖాళీ చేయించింది. ఈ భూమిని కొంతమంది కబ్జా చేశారని హైడ్రా అధికారులు తెలిపారు. అయితే, గతంలో రైతులకు అనుకూలంగా తీర్పు ఇచ్చింది రంగారెడ్డి కోర్టు. రంగారెడ్డి కోర్టు తీర్పును తెలంగాణ హైకోర్టులో సవాల్ చేసింది ప్రభుత్వం. ప్రభుత్వానికి అనుకూలంగా తీర్పు ఇచ్చింది హైకోర్టు. 36 ఎకరాల భూమి ప్రభుత్వానిదేనని తేల్చింది హైకోర్టు. హై కోర్టు తీర్పు మేరకు శనివారం ఆక్రమణల తొలగింపును చేపట్టామని హైడ్రా అధికారులు చెప్పుకొచ్చారు. తాత్కాలిక షెడ్డులను ఏర్పాటు చేసి వ్యాపారం చేసుకుంటున్న వారిని ఖాళీ చేయించామని హైడ్రా అధికారులు పేర్కొన్నారు. హైదరాబాద్‌లో గత కొన్నేళ్లుగా అక్రమ నిర్మాణాలు భారీ స్థాయిలో వెలిశాయి. కొంతమంది అక్రమ నిర్మాణాలు చేపడుతున్నారు. యథేచ్ఛగా అక్రమార్కులు నిబంధనలని ఉల్లంఘిస్తున్నారు. అక్రమ నిర్మాణాలతో పలు ప్రాంతాలు వర్షాకాలంలో వరదలకు గురవుతున్నాయి. దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ సమస్యపై హైడ్రా అధికారులకు ఫిర్యాదులు వస్తోండటంతో చర్యలు చేపట్టారు.

# జూబ్లీహిల్స్ కాంగ్రెస్ విజయం ఖాయం

- మంత్రి పొన్నం ప్రభాకర్



**హైదరాబాద్, అక్టోబరు 4:** జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో కాంగ్రెస్ గెలవడం ఖాయమని హైదరాబాద్ ఇన్‌చార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ ఉద్ఘాటించారు. సికింద్రాబాద్ కంటోన్మెంట్ ఎన్నికల మాదిరిగా జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలోనూ అధికార కాంగ్రెస్‌ని గెలిపించాలని కోరారు. సంక్షేమం, అభివృద్ధి జోడెద్దుల మాదిరిగా తమ ప్రభుత్వం పని చేస్తోందని వ్యాఖ్యానించారు. శనివారం జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో మంత్రి పొన్నం ప్రభాకర్ పలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా మంత్రి పొన్నం ప్రభాకర్ మీడియాతో మాట్లాడారు. ఎర్రగడ్డ డివిజన్‌లో రూ. 2.16 లక్షలతో సీసీ రోడ్లకు, కమ్యూనిటీ హాల్‌కి శంకుస్థాపన చేశామని తెలిపారు. రూ. 54 లక్షలతో మురుగు నీటి కాలువల పునరుద్ధరణకు శంకుస్థాపన చేశామని వెల్లడించారు. దీని పక్కన ఉన్న స్థలంలో ఈ ప్రాంత ప్రజలకు ఉపయోగపడే విధంగా పార్క్ ఏర్పాటు చేస్తున్నామని వివరించారు. రేపటి నుంచి పనులు ప్రారంభం అవుతాయని తెలిపారు. వాకింగ్ ట్రాక్, పిల్లల గేమ్స్ ఆడుకోవడానికి, తదితర ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. డ్రింకింగ్ వాటర్, శానిటేషన్ ఇబ్బందులు లేకుండా ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. కొంత మంది పిల్లలను తీసుకొచ్చి సానుభూతితో జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఓట్లు అడగాలని చూస్తున్నారని విమర్శించారు. తమ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధికి మాత్రమే ప్రజలు పట్టం కడతారని ఉద్ఘాటించారు. జూబ్లీహిల్స్‌ని అభివృద్ధి చేసే బాధ్యత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకున్నారని నొక్కిచెప్పారు. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికలో అధికార కాంగ్రెస్ పార్టీకి అవకాశం ఇవ్వాలని కోరారు. ఇక్కడ కూడా డబుల్ బెడ్ రూం ఇళ్లు పంపిణీ చేస్తున్నామని తెలిపారు. తమ ప్రభుత్వంలో ఆర్టీసీలో మహిళలకు ఉచిత బస్సు సౌకర్యం కల్పిస్తున్నామని మంత్రి పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

## పొన్నం కంటే సీనియర్..

### విరుచుకుపడ్డ అంజన్ కుమార్ యాదవ్

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీలో నాయకుల మధ్య విబేధాలు తారాస్థాయికి చేరుకున్నాయి. టికెట్ కోసం ప్రయత్నిస్తున్న సీనియర్ నాయకుడు అంజన్ కుమార్ యాదవ్.. హైదరాబాద్ ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్‌పై సీరియస్ అయ్యారు. పొన్నం ప్రభాకర్ కంటే నేనే సీనియర్ అని ఆయనకు అంజన్ కుమార్ యాదవ్ స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు. జూబ్లీహిల్స్ టికెట్ హైకమాండ్ నిర్ణయిస్తుంది.. పొన్నం ప్రభాకర్ కాదు అని తేల్చిచెప్పారు. కాంగ్రెస్‌లో ఒకే కుటుంబంలో ఎమ్మెల్యేలుగా, ఎంపీలుగా ఎంతో మంది ఉన్నారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి ఆయన భార్య పద్మావతి, కోమటిరెడ్డి బ్రదర్స్, మల్లు భట్టి విక్రమార్క డిప్యూటీ సీఎం, ఆయన అన్న మల్లు రవి ఎంపీ, వివేక్ మంత్రి, ఆయన కొడుకు ఎంపీ, ఆయన అన్న ఎమ్మెల్యే.. ఇలా కాంగ్రెస్ పార్టీలో చాలా మంది ఉన్నారు.. నా కొడుకు ఎంపీ అయితే, నాకు ఎమ్మెల్యే టికెట్ ఎందుకు ఇవ్వరు? అని కాంగ్రెస్ సీనియర్ నేత అంజన్ కుమార్ యాదవ్ నిలదీశారు. ఇక జూబ్లీహిల్స్ నియోజకవర్గం ఉప ఎన్నికల నేపథ్యంలో తనకే టికెట్ వస్తుందని అంజన్ కుమార్ యాదవ్ ముమ్మరంగా ప్రచారం చేసుకుంటున్నారు. జూబ్లీహిల్స్ నియోజకవర్గం వ్యాప్తంగా అంజన్ కుమార్ కటౌట్లను ఏర్పాటు చేశారు. ఆయన అనుచరులు ఇంటింటికి తిరిగి అభ్యర్థి అంజన్ కుమార్ యాదవే అని ప్రచారం చేస్తున్న సంగతి తెలిసిందే.

# మోటర్ స్పోర్ట్స్ కాంపిటేషన్‌ను ప్రారంభించనున్న కేటీఆర్

**హైదరాబాద్/కోయంబత్తూరు, అక్టోబర్3 :** భారత రాష్ట్ర సమితి వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారక రామారావు మరో జాతీయ స్థాయి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరుకానున్నారు. అక్టోబర్ 11న కోయంబత్తూరులోని కుమారగురు ఇన్‌స్టిట్యూషన్స్‌లో జరగనున్న 10వ ఎఫ్‌ఎంఏఈ(ఫ్రటెర్నిటీ ఆఫ్‌మెకానికల్‌అండ్‌ఆటోమోటివ్ ఇంజినీరింగ్)నేషనల్ స్టూడెంట్ మోటార్‌స్పోర్ట్స్ కాంపిటీషన్ 2025 ప్రారంభోత్సవానికి కేటీఆర్ ముఖ్య అతిథిగా హాజరవుతారు. ఫ్రాటర్నిటీ ఆఫ్ మెకానికల్ అండ్ ఆటోమోటివ్ ఇంజనీర్స్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ప్రతిష్టాత్మక పోటీలో దేశవ్యాప్తంగా 101 కాలేజీల నుంచి 70కి పైగా విద్యార్థి బృందాలు, మొత్తం 1300 మందికి పైగా యువ ఇంజనీర్లు పాల్గొననున్నారు. విద్యార్థులు తమ స్వయంగా రూపొందించిన వాహనాలు, వినూత్న ఆవిష్కరణలను ఈ వేదికపై ప్రదర్శిస్తారు. ఈ ప్రాజెక్టులను అంతర్జాతీయ స్థాయిలోని అగ్రగామి ఆటోమోటివ్ కంపెనీలకు చెందిన 25 మంది నిపుణుల జ్యూరీ సభ్యులు మూల్యాంకనం చేయనున్నారు.



### కేటీఆర్ నాయకత్వాన్ని ప్రశంసించిన ఎఫ్‌ఎంఏఈ

కేటీఆర్‌కు పంపిన ఆహ్వానంలో ఎఫ్‌ఎంఏఈ సంస్థ ఆయన నాయకత్వాన్ని, మోటార్‌స్పోర్ట్స్ పట్ల ఆయనకున్న నిబద్ధతను ప్రత్యేకంగాప్రశంసించింది. ముఖ్యంగా హైదరాబాద్‌కు ఫార్ములా–ఈ రేసింగ్‌ను తీసుకురావడం ద్వారా తెలంగాణను గ్లోబల్ మోటార్‌స్పోర్ట్ మ్యాప్‌పై నిలబెట్టడంలో కేటీఆర్ పోషించిన పాత్ర అభినందనీయమని కొనియాడింది. సుస్థిరమైన మొబిలిటీ, అడ్వాన్స్‌డ్ మానుఫ్యాక్చరింగ్ (తయారీ), మరియు ఆవిష్కరణల వ్యవస్థను (ఇన్నోవేషన్ ఎకోసిస్టం) ప్రోత్సహించడంలో ఆయన చూపిన చొరవ దేశవ్యాప్తంగా వేలాది మంది యువ ఇంజనీర్లకు స్ఫూర్తిని ఇచ్చిందని ఎఫ్‌ఎంఏఈ పేర్కొంది. ఈ పోటీ భారత దేశంలోని అత్యున్నత విద్యార్థి–కేంద్రీకృత ఇంజనీరింగ్ ప్లాట్‌ఫామ్‌లలో ఒకటిగా పరిగణించబడుతోంది. ఇది పరిశ్రమ, విద్యా రంగాల మధ్య అంతరాన్ని తగ్గించడంతో పాటు, భవిష్యత్తు ఆటోమోటివ్ టెక్నాలజీలకు భారతదేశాన్ని ఒక కేంద్రంగా నిలబెట్టే లక్ష్యంతో కృషి చేస్తోంది.



## డిప్యూటీ సీఎంను కలిసిన డీజీపీ

**హైదరాబాద్, అక్టోబర్ 4 :** నూతనంగా డీజీపీగా బాధ్యతలు స్వీకరించిన శివధర్‌రెడ్డి శనివారం ప్రజాభవన్‌లో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కను మర్యాదపూర్వకంగా కలిసిశారు. పుష్పగుచ్ఛం అందజేశారు. ఆయన వెంట అడిషనల్‌డీజీపీ ఇంటలిజెన్స్ విజయ్ కుమార్ ఉన్నారు.

## ఆర్టీసీకి దసరా బొనాంజా

### 110 కోట్ల ఆదాయం దక్కినట్లు వెల్లడి

**హైదరాబాద్,అక్టోబర్4 :** బతుకమ్మ, దసరా పండగల సందర్భంగా టీజీఎస్ ఆర్టీసీకి రూ. 110 కోట్ల మేర ఆదాయం సమకూరినట్లు యాజమాన్యం ప్రకటించింది. ఈ సారి 7,754 ప్రత్యేక బస్సులు నడపాలని తొలుత నిర్ణయించినప్పటికీ.. ఆశించిన మేర ప్రయాణికులు లేకపోవడంతో 5,300 వరకు మాత్రమే తిప్పినట్లు అధికారులు వెల్లడించారు. ప్రత్యేక బస్సుల్లో ఈసారి 50 శాతం వరకు అదనపు ఛార్జీలను వసూలు చేశారు. గత ఏడాది ఇదే సీజన్‌లో 6300 ప్రత్యేక బస్సులు నడపగా.. రూ. 114 కోట్ల ఆదాయం వచ్చింది. గత ఏడాదితో పోల్చితే.. ఈసారి సొంతూళ్లకు వెళ్లిన ప్రయాణికుల సంఖ్య తక్కువగా ఉందని, కొందరు ప్రైవేటు వాహనాలనూ ఆశ్రయించినట్లు అధికారులు అంచనా వేస్తున్నారు. తిరుగు ప్రయాణానికి సంబంధించి ఈనెల 5, 6వ తేదీల్లో రద్దీకి అనుగుణంగా బస్సులను నడిపించాలని సంస్థ నిర్ణయించింది.

# రెండు నెలల్లో రీజినల్ రింగ్ రోడ్డు టెండర్ ప్రక్రియ

### రైతులకు ఎట్టి పరిస్థితుల్లో అన్యాయం జరగదు

### భూసేకరణలో నాటి బిఆర్ఎస్ నిర్లక్ష్యంతో ఆలస్యం

### మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి వెల్లడి



**నల్లగొండ,అక్టోబర్4 :** రెండు నెలల్లో రీజినల్ రింగ్ రోడ్డు ఉత్తర భాగం టెండర్ ప్రక్రియ ప్రారంభం కానుందని రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి స్పష్టం చేశారు. డిసెంబర్ లోపు టెండర్లు పూర్తి చేసి జనవరిలో పనులు ప్రారంభించేలా చేస్తామని చెప్పారు. శనివారం మంత్రి చిట్యాలలో మీడియాతో మాట్లాడుతూ.. 2017- 18 లో ప్రధాని మోదీ ఉత్తర భాగం రీజినల్ రింగ్ రోడ్డుకు అంగీకరిస్తే..బిఆర్ఎస్ ప్రభుత్వం భూ సేకరణ చేయకుండా నిర్లక్ష్యం వహించిందని మంత్రి కోమటి రెడ్డి నాటి కేసీఆర్ ప్రభుత్వం తీరుపై మండిపడ్డారు. తాను ఎంపీగా ఉన్నపుడు రైతులకు అన్యాయం జరగకుండా ధర్నాలో పాల్గొని,ప్రజా ప్రభుత్వం వచ్చి మంత్రి అయిన తర్వాత మార్కెట్ రేట్ ఇప్పించి రైతులను ఒప్పించానని అన్నారు. తాను మంత్రిగా అయిన కొత్తలో 6శాతం భూసేకరణ మాత్రమే అయితే రైతులను ఒప్పించి ఇప్పుడు 98శాతం పైగా పూర్తి చేసామని చెప్పారు. 4లేన్ల ట్రిపుల్ ఆర్ 2035 నాటికి ట్రాఫిక్ రద్దీ పెరుగుతుందని, భవిష్యత్ అవసరాల దృష్ట్యా 6లేన్లుగా మార్చుకున్నామని తెలిపారు. రీజినల్ రింగ్ రోడ్డు విషయంలో ఎవరు ఆందోళన చెందాల్సిన అక్కర్లేదనీ,రైతులు ధైర్యంగా ఉండాలని భరోసా కల్పించారు. అలైన్మెంట్ విషయంలో పెద్ద వాళ్ళకు ఒక న్యాయం,పేద వాళ్లకు ఒక న్యాయం ఉండదని అందులో ఎలాంటి అనుమానం అవసరం లేదని తేల్చి చెప్పారు. సంగారెడ్డి నుండి నర్సాపూర్,తూప్రాన్, గజ్వేల్,జగదేవపూర్ వయా భువనగిరి,చౌటుప్పల్ వరకు 161.518కిలో మీటర్ల నార్త్ పార్ట్ ఉండనుందని అన్నారు. భూసేకరణ కోసం 6వేల కోట్లు ఖర్చు అవుతున్నాయని కేంద్రం,రాష్ట్రం చెరిసగం వాటా ఇస్తున్నామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వ వాటా 3వేల కోట్లు హడ్కో రుణం తెచ్చామని అన్నారు. ఇప్పటికే పలు మార్లు కేంద్రమంత్రి నితిన్ గడ్కరీని కలిశామని,ఇటీవల ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,తాను కేంద్ర ప్రభుత్వ అధికారులతో సమావేశం అయ్యామని పనులు వేగం చేసేలా మాట్లాడామని చెప్పారు. బిఆర్ఎస్ రైతులను రెచ్చగొట్టే ప్రయత్నం చేస్తున్నదని,చరిత్రలో రోడ్లను అమ్ముకున్న పాపం బిఆర్ఎస్ ది మాత్రమేనని దుయ్యబట్టారు.




# కొత్త మద్యం దుకాణాలకు టెండర్లు

### నోటిఫికేషన్ విడుదల చేసిన ఎక్సైజ్ శాఖ

**హైదరాబాద్,అక్టోబర్4:** డిసెంబర్ 1 నుండి తెలంగాణలో ప్రారంభం కానున్న నూతన మద్యం దుకాణాల కోసం రాష్ట్ర ఎక్సైజ్ శాఖ తాజాగా నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నూతన దుకాణాలకు సంబంధించిన దరఖాస్తులు సెప్టెంబర్ 26 నుంచి స్వీకరిస్తున్నారు. ఇప్పటికే శనివారం వరకు రాష్ట్ర వ్యాప్తంగా మొత్తం 447 దరఖాస్తులు నమోదు అయ్యాయని ఎక్సైజ్ శాఖ అధికారులు తెలిపారు. సోమవారం నుండి దరఖాస్తుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని సమాచారం ఉంది. మేడ్చల్ యూనిట్ పరిధిలో ఉన్న 118 కొత్త మద్యం దుకాణాల కోసం ఇప్పటివరకు 20 దరఖాస్తులు వచ్చాయని అధికారులు పేర్కొన్నారు. మొత్తం దరఖాస్తుల స్వీకరణ అక్టోబర్ 18 వరకు కొనసాగుతుంది. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 2,620 మద్యం దుకాణాలకు నిర్వహకులను ఎంపిక చేసుకోవడం కోసం అక్టోబర్ 23న లాటరీ పక్రియ నిర్వహించనున్నారు. దరఖాస్తు ఫారంతో పాటు ప్రతి దరఖాస్తుదారు రూ. 3 లక్షల డీడీ లేదా చలాన్ రూపంలో చెల్లించిన రశీదు జతపరచాల్సి ఉంటుంది. ఈ కొత్త దుకాణాల్లో గౌడ కులస్థులకు 15 శాతం, ఎస్సీ కేటగిరీకి 10 శాతం, ఎస్టీ కేటగిరీకి 5 శాతం రిజర్వేషన్లు కేటాయించబడ్డాయి. డీడీలు మరియు చలాన్లను జిల్లా ప్రొహిబిషనర్ / ఎక్సైజ్ అధికారి పేరునే తీయాల్సి ఉంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా దరఖాస్తులు, రిజర్వేషన్ల వివరాలు, దరఖాస్తు గైడ్‌లైన్స్‌ను అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపరచినట్లు ఎక్సైజ్ శాఖ పేర్కొంది.

# స్థానిక ఎన్నికలపై బీజేపీ దృష్టి

### జూబ్లీహిల్స్ అభ్యర్థి కోసం త్రీమెన్ కమిటీ



**హైదరాబాద్, అక్టోబర్ 4:** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల వేడి మొదలైంది. ఎన్నికలకు ముహూర్తం దగ్గర పడుతుండటంతో అన్ని పార్టీలు తమతమ కార్యాచరణను రూపొందించుకుంటున్నాయి. ఈ నేపథ్యంలో స్థానిక ఎన్నికలపై బీజేపీ ఫోకస్ పెట్టింది. ఈనెల 9న ఎన్నికల నోటిఫికేషన్ విడుదలవుతుండగా.. అభ్యర్థుల ఎంపికపై కసరత్తు మొదలుపెట్టింది. ఈనెల 5లోగా ప్రతీ స్థానానికి ముగ్గురు పేర్లను ఇవ్వాలని రాష్ట్ర బీజపీ అధ్యక్షుడు రాంచందర్ రావు.. పార్టీ నాయకులను ఆదేశించారు. జట్పీటీసీ అభ్యర్థుల ఎంపిక బాధ్యత రాష్ట్ర కమిటీకే ఇవ్వనున్నట్లు తెలుస్తోంది. అయితే.. ఎంపీటీసీ అభ్యర్థుల ఎంపిక బాధ్యత జిల్లా పార్టీ కోర్ కమిటీలకు అప్పగించనున్నారు. జూబ్లీహిల్స్ ఉపఎన్నికకు కూడా సమయం దగ్గర పడుతుండటంతో.. అభ్యర్థి ఎంపికపై బీజేపీ కసరత్తు చేస్తోంది. దీని కోసం ముగ్గురు సభ్యులుతో కమిటీని బీజేపీ ఏర్పాటు చేసింది. ఈ మేరకు జూబ్లీహిల్స్‌లో అభిప్రాయ సేకరణ త్వరితగతిన పూర్తి చేయాలని పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు రాంచందర్ రావు కమిటీకి ఆదేశాలు జారీ చేశారు. ఈ కమిటీలో మాజీ ఎమ్మెల్యే ధర్మరావు, మాజీ ఎంపీ రాములు, అడ్వకేట్ కోమల ఆంజనేయులుకు చోటు దక్కింది. ఈనెల 9వ తేదీన స్థానిక ఎన్నికలకు నోటిఫికేషన్ రానున్న నేపథ్యంలో అభ్యర్థుల ఎంపికపై పార్టీలు ఫోకస్ పెట్టాయి. మరోవైపు జిల్లాల్లో పార్టీ అభ్యర్థుల నుంచి వివరాలు సేకరిస్తోంది. గ్రామస్థాయి నుంచి గెలుపు గుర్రాలపై దృష్టి సారించింది.

# ప్రయాణికులకు ఆర్టీసీ షాక్

### సిటీ బస్సుల్లో ఛార్జీల పెంపు • సోమవారం నుంచి అమల్లోకి ఛార్జీలు




**హైదరాబాద్,అక్టోబర్4:** టీజీఎస్‌ఆర్టీసీ ప్రయాణికులకు షాక్ ఇచ్చింది. సిటీ బస్సుల్లో ఛార్జీలు పెంచుతున్నట్లు ప్రకటించింది. హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో నడిచే అన్ని బస్సుల్లో ఛార్జీలు పెంచుతున్నట్లు పేర్కొంది. సిటీ ఆర్డినరీ, మెట్రో ఎక్స్‌ప్రెస్, ఈ–ఆర్డినరీ, ఈ–ఎక్స్ ప్రెస్, మెట్రో డీలక్స్, ఈ–మెట్రో, ఏసీ సర్వీసుల్లో ఛార్జీల పెంచుతున్నట్లు చెప్పింది. మొదటి మూడు స్టేజిలకు రూ. 5, 4వ స్టేజి నుంచి రూ. 10 అదనపు ఛార్జీల వసూలు చేయనున్నట్లు సమాచారం. మెట్రో డీలక్స్, ఈ–మెట్రో ఏసీ సర్వీసుల్లో మొదటి స్టేజీకి రూ. 5, రెండో స్టేజీ నుంచి రూ. 10 అదనపు ఛార్జీలు వసూలు చేయనుంది. అయితే.. పెరిగిన ఛార్జీలు సోమవారం నుంచి అమల్లోకి రానున్నాయి. తాజాగా ఛార్జీల పెంపుపై టీజీఎస్‌ఆర్టీసీ స్పందించింది. ఆర్థిక భారాన్ని మోయలేకపోతున్నామని తేల్చి చెప్పింది. సిటీ బస్సుల్లో మెరుగైన వసతులు కల్పించాలంటే ఛార్జీలు పెంచక తప్పట్లేదు అని వివరించింది. పెరిగిన ఛార్జీలు సోమవారం నుంచి అమల్లోకి రానున్నట్లు ప్రకటించింది. సిటీ బస్సుల్లో పెరిగిన ఛార్జీలపై నగరవాసులు సహకరించాలని టీజీఎస్‌ఆర్టీసీ విజ్ఞప్తి చేసింది. ఈ మేరకు తాజాగా ఓ ప్రకటన విడుదల చేసింది. ఈ ప్రకటనలోని వివరాల ప్రకారం.. టీజీఎస్‌ఆర్టీసీ ఇప్పుడున్న పరిస్థితుల్లో ఈ ఆర్థిక భారాన్ని మోయలేదు. ప్రభుత్వం, ప్రజల సహకారంతో ఈ వ్యవస్థను ముందుకు తీసుకెళ్లాలని కోరుకుంటోంది. ఈ నేపథ్యంలోనే ఎలక్ట్రిక్ బస్సుల మౌలిక సదుపాయాల వ్యయాన్ని సమకూర్చుకునేందుకు సిటీ బస్సుల్లో అదనపు ఛార్జీని విధించేందుకు అనుమతి ఇవ్వాలని రాష్ట్ర ప్రభుత్వానికి టీజీఎస్‌ఆర్టీసీ యాజమాన్యం ప్రతిపాదించింది. ఈ ప్రతిపాదనను సెప్టెంబర్ 23న రాష్ట్ర ప్రభుత్వం ఆమోదించింది. హైదరాబాద్, సికింద్రాబాద్ పరిధిలో నడిచే అన్ని బస్సుల్లో అదనపు ఛార్జీని సంస్థ వసూలు చేయనుంది. హైదరాబాద్ భవిష్యత్ బాగు కోసం వాడకంలోకి తీసుకువస్తోన్న ఎలక్ట్రిక్ బస్సులను ప్రజలు ఆదరించాలని, నగర ప్రజా రవాణా ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చబోతున్న ఈ గ్రీన్ జర్నీలో ప్రతి ఒక్కరు భాగస్వామ్యం కావాలని సంస్థ కోరుతోంది. ఈ పర్యావరణహిత కార్యక్రమానికి సహకరించి.. గతంలో మాదిరిగానే ఆర్టీసీ సేవలను ప్రోత్సహించాలని విజ్ఞప్తి చేస్తోంది. రాబోయే 2800 కొత్త ఎలక్ట్రిక్ బస్సుల కోసం 19 డిపోల్లో ఛార్జింగ్ కోసం హెచ్‌టీ కనెక్షన్లను సంస్థ ఏర్పాటు చేయనుంది. అలాగే, ఎలక్ట్రిక్ బస్సుల ద్వారా హైదరాబాద్ లో ప్రజా రవాణాను మరింతగా విస్తరించేందుకు కొత్తగా 10 డిపోలను ఏర్పాటు చేయాలని నిర్ణయించింది. అలాగే, కొత్తగా 10 ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనుంది. ఈ మౌలిక సదుపాయాలకు రానున్న సంవత్సరంలో రూ. 392 కోట్ల మేర వ్యయమవుతుందని టీజీఎస్‌ఆర్టీసీ అధికారులు అంచనా వేశారు.

05-10-25 Samayam_Layout 1 10/5/2025 5:52 AM Page 4



## సంపాదకీయం



# కరూర్‌లాంటి ఘటనలు ఆపలేమా?

**దేశంలో రాజకీయ పార్టీల కార్యకలాపాలు నానాటికీ శృతి మించుతున్నాయి. ప్రజల ప్రాణాలంటే లెక్క లేకుండా పోయింది. ప్రజలను ఏమార్చడం, సెంటిమెంట్లను రెచ్చగొట్టడం, అధికారం సంపాదించడం అలవాటు చేసుకున్నారు. ఈ క్రమంలో రాజకీయ పార్టీల విన్యాసాలు ప్రజల ప్రాణాల మీదకు తెస్తున్నాయి.**

కరూర్ ఘటనపై మద్రాస్ హైకోర్టు సిట్‌ను వేసింది. దర్యాప్తు జరిపి నిజానిజాలు వెలికి తీసినా అందుకు కారకులైన ఆ పార్టీ వారిమీద ఎలాంటి చర్యలు ఉంటాయన్నది వేరుగా చెప్పాల్సిన అవసరం లేదు. గతంలో ఇలాంటి ఘటనలు చూశాం. ఏపిలో చంద్రబాబు హయాంలో గోదావరి పుష్కరాల సందర్భంగా పదుల సంఖ్యలో చనిపోయారు. జగన్ మొన్నటికి మొన్నర్యాలీలో ఒకరిద్దరు చనిపోయారు. రాజకీయ నేతల హత్యలుగా వీటిని పరిగణించి చర్యలు తీసుకుని ఉంటే కరూర్ ఘటన జరిగివుండేది కాదు. భారీగా బహిరంగ సభలు నిర్వహించడం, ర్యాలీలు చేపట్టడం వల్ల ప్రజల ప్రాణాలు పోతున్నాయి. అయినా ఆయా పార్ఈల నేతల్ల్లో కించిత్తు కూడా పశ్చాత్తాపం లేదు. తమిళనాడు కరూర్‌లో టివికె నాయకుడు, సినీ నటుడు విజయ్ సభలో చోటుచేసుకున్న మహా విషాదం మాటలకందనిది. నిర్వాహకుల భద్రతా లోపాలే తొక్కిసలాటగా మారి 41 మంది ప్రాణాలను బలిగొనడం ఏమాత్రం క్షంతవ్యం కాదు. ఇలాంటి ర్యాలీలు చేపట్టి ఏం ఉద్ధరిస్తారన్నది ప్రజలు కూడా ఆలోచించాలి. వీరంతా మన ఓట్లను కొల్లగొట్టే యంత్రాలని గుర్తించాలి. మనదగ్గర ఓటు ఆయుధం ఉందని గుర్తించి మసలుకోవాలి. నటుడు విజయ్‌ను చూడడానికి వచ్చిన 41మంది చనిపోతే ఆ కుటుంబాలు ఏం కావాలి. తీవ్రంగా గాయపడిన 80 మందిలో ఐదుగురి పరిస్థితి నేటికీ విషమంగానే ఉంది. ప్రాణాలు కోల్పోయిన, గాయపడిన వారంతా అణగారిన వర్గాలు, ఆర్థికంగా వెనుకబడిన కుటుంబాలకు చెందిన వారే. వారిని ఆదుకునేందుకు ఎలాంటి ప్రణాళిక ఉందో చెప్పడం లేదు. వారి కుటుంబాలకు భరోసా ఎవరు ఇస్తారో చెప్పడం లేదు. పోలీసులు ఇలాంటి ర్యాలీలకు అనుమతి ఇచ్చేముందు ఎందుకు ఆలోచించరన్నది కూడా ముఖ్యమే. హీరో విజయ్ వచ్చే ఏడాది జరగనున్న ఎన్నికల కోసం ఈ నెల 13 నుంచి రాష్ట్రవ్యాప్తంగా వీకెండ్ రోడ్ షోలు ప్రారంభించారు. విజయ్ ను చూసేందుకు అత్యధిక సంఖ్యలో సభలకు తరలివస్తున్నారు. వారికి తగిన భద్రత కల్పించడం, వారు ఇళ్లకు క్షేమంగా చేరుకునేలా ఏర్పాట్లు చేయడం నిర్వాహకుల బాధ్యత. అలాంటి బాధ్యతలను గాలికి వదిలేయడంతో తొక్కిసలాట ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. తమ పార్టీపై పోలీసులు ఆంక్షలు విధిస్తున్నారంటూ టివికె పార్టీ చేస్తున్న వాదనలో నిజం లేదు. ఎందుకంటే ఇలాంటి ర్యాలీలు నిర్వహించి ఏం చేస్తారన్నది చెప్పాలి. తగిన భద్రతా ప్రమాణాలు పాటించడం లేదని, ఆస్తుల విధ్వంసం చేస్తున్న వారిపై నిర్వాహకులకు నియంత్రణ ఉండటం లేదంటూ తమిళనాడు ప్రభుత్వం మద్రాసు హైకోర్టులో నాలుగు రోజుల క్రితమే వాదనలు వినిపించాయి. ఆస్తినష్టం జరగకుండా ముందస్తుగా సభల నిర్వాహకుల నుంచి డిపాజిట్లు వసూలు చేయాలంటూ హైకోర్టు ఆదేశించింది. బహిరంగ సభలు, ఊరేగింపులు తదితర సందర్భాల్లో మార్గదర్శకాలపై నివేదిక సమర్పించాలంటూ ధర్మాసనం ఆదేశించినా, సరైన జాగ్రత్తలు తీసుకోలేదనడానికి కరూర్ ఉదంతమే సాక్ష్యం. కరూరులో అభిమానులు రాత్రి 7.30 గంటలకు విజయ్ వచ్చేవరకూ ఎండలో, కనీసం తాగునీళ్లిచ్చే దిక్కులేక, ఆహారం లేక అలమటించాల్సి వచ్చింది. 10 వేల మంది సభకు వస్తారని నిర్వాహకులు అనుమతి తీసుకుని, 30 వేల మందికిపైనే మూడు జిల్లాల నుంచి సమీకరించారు. విజయ్ ను దగ్గర నుంచి చూడాలంటూ కొందరు అభిమానులు చెట్టు ఎక్కగా, ఆ చెట్టు కొమ్మ విరిగిపడటమే తొక్కిసలాటకు కారణమని చెబుతున్నారు. నీరసంగా ఉన్న అభిమానుల కోసం విజరు తన కాన్వాయ్ నుంచి నీళ్ల సీసాలు విసరడం, కొందరు అత్యుత్సాహంతో కాన్వాయ్ వద్దకు తోసుకెళ్లడమూ గందరగోళానికి కారణమైందంటున్నారు. భారీ సంఖ్యలో అభిమానులు చేరుకోవడం, నిర్వాహకులు, స్థానిక అధికారుల మధ్య గందరగోళం, నిర్వహణాలోపమే ఘటనకు ప్రధాన కారణం. వెనువెంటనే సంఘటనా స్థలానికి సిఎం వచ్చి, పరామర్శించడం, ప్రభుత్వ యంత్రాంగాన్ని పరుగులు పెట్టించడం, మృతదేహాలకు వెంటనే పోస్టుమార్టం నిర్వహించి కుటుంబాలకు అందించడం, నష్టపరిహారం ప్రకటించడం ఉపశమనం కలిగించేవే! రాష్ట్రప్రభుత్వం ఏర్పాటుచేసిన జస్టిస్ అరుణా జగదీశన్ నేతృత్వంలోని ఏకసభ్య కమిషన్ ఇప్పటికే క్షేత్రస్థాయిలో పర్యటిస్తోంది. పరిహారం ప్రకటించిన విజయ్ బాధిత కుటుంబాలను పరామర్శించ కుండా వెనుదిరగడమూ చర్చనీయాంశమైంది. దీనిని మద్రాస్ హైకోర్టు కూడా తప్పు పట్టింది. ఇక వారే సిబిఐ విచారణ కోరడం మరీ దారుణం. ఆయన కానీ, వారి పార్టీ నాయకులు గానీ క్షతగాత్రులకు వైద్యమందించిన ఆసుపత్రులకైనా వెళ్లకపోవడం శోచనీయం. రాజకీయ సభలైనా, మతపరమైనవైనా, ఏ కార్యక్రమమైనా? అక్కడికి వచ్చే ప్రజల ప్రాణాలను కాపాడి, క్షేమంగా ఇళ్లకు చేర్చాల్సిన బాధ్యత నిర్వాహకులదే. ఇరుకుగా ఉండే ప్రదేశాలను జనాకర్షణ కలిగిన నేతల భారీ సభల కోసం, రోడ్‌షోల కోసం వినియోగించకుండా, విశాల ప్రదేశాల్లోనే సభలు నిర్వహించేలా చూడటం అవసరం. పదుల సంఖ్యలో అమాయక ప్రజల మరణానికి కారణమైన ఇటువంటి తొక్కిసలాట ఘటనల సందర్భంగా జరిగిన నిర్వహణ వైఫల్యాలు, పాలనా యంత్రాంగం లోపాలు వంటివి సమీక్షించి, తగు చర్యలు తీసుకోవడం ద్వారా ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. మద్రాస్ హైకోర్టు సూచనల మేరకు ఇలాంటి ర్యాలీలపై నిషేధం విధించాలి. అప్పుడే కొంతవరకైనా మేలు కలుగుతుంది. జనాలు కూడా వేలం వెర్రిలాగా ర్యాలీలకు, సభలకు వెళ్లకుండా ఉండడం కూడా మంచిది.

# ఆత్మనిర్భర భారత్‌కు ఐటీఐలు కీలకం

- శ్రమేవ జయతే, శ్రమేవ పూజ్యతే సాకారం
- కౌశల్ దీక్షాంత్ సమరోహ్‌లో ప్రధాని మోడీ
- బీహార్‌లో ప్రారంభించిన సీఎం నితీశ్



**న్యూఢిల్లీ, అక్టోబర్ 4:** ఇండస్ట్రియల్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్‌లు (ఐటీఐ) ఆత్మనిర్భర్ భారత్‌కు కీలకమైన వర్క్‌షాప్‌లు అని ప్రధాని మోదీ ప్రశంసించారు. ఐటీఐలు పారిశ్రామిక విద్యా సంస్థలు మాత్రమే కాదు, ఆత్మనిర్భర్ భారత్‌కు వర్క్‌షాప్‌లు అని ఆయన చెప్పారు. యువత సాధికారతకు మెగా ప్రోగ్రామ్‌గా ఈ ఈవెంట్‌ను ప్రధాని వర్ణించారు. 'శ్రమేవ జయతే, శ్రమేవ పూజ్యతే' అని ఉటంకిస్తూ, స్కిల్డ్ వ్యక్తులను గౌరవించాలని ప్రధాని సూచించారు. ఈ సందర్భంగా రూ. 62,000 కోట్లకు పైగా విలువైన యువత - కేంద్రీకృత కార్యక్రమాలను ప్రధాని శనివారం ఢిల్లీలో ప్రారంభించారు. ఢిల్లీలోని విజ్ఞాన్ భవన్‌లో జరిగిన కౌశల్ దీక్షాంత్ సమరోహ్‌లో ప్రధాని మాట్లాడారు. యువతలో స్కిల్ డెవలప్‌మెంట్, ఉద్యోగ నైపుణ్యాల్ని పెంచేందుకు ప్రధాన మంత్రి సేతు పథకాన్ని రూ. 60,000 కోట్లతో ప్రవేశపెట్టారు. దేశంలో 2014 వరకు 10,000 ఐటీఐలు ఉండగా, గత దశాబ్దంలో 5,000 కొత్తగా ఐటీఐ కళాశాలలు ఏర్పాటు చేశారని, ఈ 11 సంవత్సరాల్లో 1.5 కోట్ల మంది యువకులకు స్థానిక భాషల్లో స్కిల్స్ శిక్షణ ఇచ్చారని ప్రధాని తెలిపారు. అటు, బిహార్‌లోనూ ఆ రాష్ట్ర ముఖ్యమంత్రి నితీష్ కుమార్ యువత సాధికారతను ప్రతిష్టాత్మకంగా నిర్వర్తిస్తున్నారు. నిశ్చయ్ స్వయం సహాయతా భత్తా యోజనాను ఆధునీకరించి, ప్రతి ఏటా 5 లక్షల మంది గ్రాడ్యుయేట్లకు రూ. 1,000 నెలవారీ స్కాలర్ షిప్, రెండు సంవత్సరాలు అందిస్తున్నారు. ఈ క్రమంలో యువతకు ఫ్రీ స్కిల్ ట్రైనింగ్ అందిస్తున్నారు. అంతేకాదు, బిహార్ స్టూడెంట్ క్రెడిట్ కార్డ్ స్కీమ్‌ను రీడిజైన్ చేసి, యువతకు రూ. 4 లక్షల వరకు ఇంటరెస్ట్ ఫ్రీ లోన్‌లు ఇస్తున్నారు. ఇప్పటికే ఈ పథకం ద్వారా 3.92 లక్షల మంది విద్యార్థులు రూ. 7,880 కోట్ల లోన్‌లు పొందారు. గత రెండేళ్లలో బిహార్ ప్రభుత్వం 50 లక్షల మంది యువతకు ఉపాధి కల్పించిందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. యువత సామర్థ్యాన్ని మరింత పెంచడానికి ఎన్డీఏ ప్రభుత్వం పూర్తి నిబద్ధతతో పని చేస్తోందన్నారు. ఆర్జేడీ, కాంగ్రెస్‌ల పాలనతో పోలిస్తే నితీశ్ ప్రభుత్వం బిహార్ విద్యా బ్జడెట్‌ను అనేక రెట్లు పెంచిందన్నారు. అందువల్లే నేడు బిహార్‌లోని మారుమూల గ్రామాల్లో కూడా పాఠశాలలు ఉన్నాయన్నారు. కేంద్ర ప్రభుత్వం రాష్ట్రంలోని 19 జిల్లాలకు కేంద్రీయ విద్యాలయాలను ఆమోదించిందని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం 'స్టూడెంట్ క్రెడిట్ కార్డ్' ద్వారా పిల్లలు ఉన్నత విద్యను అభ్యసించడానికి మద్దతిస్తోందన్నారు. దేశంలోనే బిహార్‌లో అత్యధిక యువ జనాభా ఉందని.. బిహార్ యువత సామర్థ్యం పెరిగినప్పుడు సహజంగానే దేశ బలం కూడా పెరుగుతుందని ప్రధాని మోదీ అన్నారు. కాంగ్రెస్ పాలనలో ఎన్నో ఏళ్లు యువత ఉద్యోగాలు లేక తీవ్ర ఇబ్బందులు పడ్డారని.. దాంతో దేశంలో అభివృద్ధి కుంటుపడిందని మోదీ మండిపడ్డారు. తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక దేశం వేగంగా అభివృద్ధి చెందుతుందన్నారు. ప్రస్తుతం భారత్ మూడో ఆర్థికశక్తిగా రూపుదిద్దు కునేందుకు సిద్ధమవుతోందన్నారు. బిహార్‌లో విద్యార్థుల కోసం పలు అభివృద్ధి పథకాలను ప్రారంభించారు. దిల్లీ విజ్ఞాన్ భవన్‌లో పీఎం-సేతు పథకాన్ని ప్రారంభించారు. ఇది విద్యార్థుల విద్యా, నైపుణ్యాభివృద్ధికి తోడ్పడుతుందన్నారు.

# నక్సల్స్‌తో చర్చల ప్రసక్తే లేదు

- వారు ఆయుధాలు వదిలి లొంగిపోవాల్సిందే
- ప్రభుత్వ పునరావాస ప్యాకేజీ అందుకుంటే మంచిది
- అభివృద్ధిని అడ్డుకోవాలని చూస్తే చూస్తూ ఊరుకోం
- వచ్చే మార్చి నాటికి రెడ్ టెర్రర్‌కు ముగింపు పలుకుతాం
- జగదల్‌పూర్ పర్యటనలో కేంద్రహోంమంత్రి అమిత్ షా



**రాయ్‌పూర్, అక్టోబర్ 4:** నక్సల్స్‌తో కేంద్రం చర్చలు జరిపే ప్రసక్తే లేదని కేంద్ర హోంమంత్రి అమిత్‌షా మరో సారి స్పష్టం చేశారు. వారంతా లొంగిపోవాలని విజ్ఞప్తి చేశారు. ఛత్తీస్‌గఢ్ లోని జగదల్పూర్‌లో శనివారం నాడు జరిగిన ర్యాలీలో కేంద్ర మంత్రి మాట్లాడుతూ.. నక్సల్స్ ఆయుధాలు వీడి లొంగిపోవాలని, కేంద్రం ప్రకటించిన పునరావాస పాలసీని అందిపుచ్చుకోవాలని సూచించారు. బస్తర్ ప్రాంతంలో శాంతికి విఘాతం కలిగించే ఎలాంటి చర్యలకైనా మావోయిస్టులు పాల్పడితే భద్రతా బలగాలు గట్టి జవాబిస్తాయని ఆయన హెచ్చరించారు. వచ్చే ఏడాది మార్చి 31వ తేదీ నాటికి 'రెడ్ టెర్రర్'కు ముగింపు పలికేందుకు కేంద్రం కృతనిశ్చయంతో ఉందని చెప్పారు. మావోయిస్టులతో ఇక ప్రభుత్వం ఎటువంటి చర్చలు జరపదని..ఆయుధాలు వదిలేసి లొంగిపోయేందుకు ముందుకు వస్తే స్వాగతిస్తామన్నారు. ఆ విధంగా లొంగిపోయిన వారందరికీ ప్రభుత్వం నుంచి అందాల్సిన వివిధ ప్రయోజనాలు అందిస్తామని..పునరావాసం కల్పిస్తామని హామీ ఇచ్చారు. బస్తర్ జిల్లాలో జరిగిన ఓ కార్యక్రమంలో మాట్లాడిన హోంమంత్రి 2026 మార్చి 31 నాటికి దేశం మావోయిస్టు రహితంగా మారుతుందని పునరుద్ఘాటించారు. మావోయిస్టులు తమతో చర్చలు జరపాలని ప్రభుత్వాన్ని కోరుతున్నారని.. ఇప్పుడు వారితో మాట్లాడడానికి ఏముందని ప్రశ్నించారు. బస్తర్ అంతటా ఉన్న మావోయిస్టు ప్రభావిత ప్రాంతాలను అభివృద్ధి చేయడానికి ఛత్తీస్‌గఢ్ ప్రభుత్వం, కేంద్ర ప్రభుత్వం సిద్ధంగా ఉన్నాయన్నారు. ఈ ప్రాంతంలో ఆయుధాలతో శాంతికి విఘాతం కలిగించే వారికి భద్రతా దళాలు తగిన సమాధానం ఇస్తాయని మావోయిస్టులను హెచ్చరించారు. గ్రామాల అభివృద్ధిని మావోయిస్టులు అడ్డుకోలేరని అక్కడి ప్రజలకు హామీ ఇచ్చారు. గత పదేళ్లలో మోదీ ప్రభుత్వం ఛత్తీస్‌గఢ్ అభివృద్ధి కోసం రూ.4లక్షల కోట్లకు పైగా నిధులు కేటాయించిందని.. భవిష్యత్తులో మరిన్ని నిధులు మంజూరు చేస్తామని తెలిపారు. కొందరు వ్యక్తులు వాళ్లతో (నక్సల్స్) చర్చలు జరపాలంటూ మాట్లాడుతున్నారు. మళ్లీ చాలా స్పష్టంగా చెబుతున్నా. ఇటు ఛత్తీస్‌గఢ్‌లోనూ, అటు కేంద్రంలోనూ అధికారంలో ఉన్న మా రెండు ప్రభుత్వాలు బస్తర్‌తోపాటు నక్సల్ ప్రభావిత ప్రాంతం మొత్తాన్ని అభివృద్ధి చేసేందుకు కట్టుబడి ఉన్నాం' అని అమిత్‌షా అన్నారు. తాము ఎంతో ఆకర్షణీయమైన లొంగుబాటు పాలసీని తెచ్చామని, నక్సల్స్ ఆయుధాలు వీడి లొంగిపోవాలని కోరారు. అలా కాకుండా బస్తర్ ప్రాంతంలో శాంతికి భగం కలిగిస్తే సాయుధ బలగాలు, సీఆర్‌పీఎఫ్, రాష్ట్ర పోలీసులు తీవ్రంగా ప్రతిఘటిస్తాయని హెచ్చరించారు. బస్తర్ ప్రాంత అభివృద్ధికి ప్రధానమంత్రి నరేంద్ర మోదీ, కేంద్ర ప్రభుత్వం చేస్తున్న కృషిని అమిత్‌షా ప్రశంసించారు. గత పదేళ్లలో ఛత్తీస్‌గఢ్ అభివృద్ధికి రూ.4 లక్షల కోట్లకు పైగా కేంద్రం కేటాయించిందని, రాష్ట్రంలోని గిరిజనుల కోసం పలు పథకాలను బీజేపీ ప్రారంభించిందని చెప్పారు. దేశంలోని 140 కోట్ల మంది ప్రజలు 'స్వదేశీ'కి కట్టుబడితే ప్రపంచంలోనే అతిపెద్ద ఆర్థిక వ్యవస్థగా ఇండియా నిలుస్తుందని, దీనిని ఎవరూ అడ్డుకోలేరని అమిత్‌షా ధీమా వ్యక్తం చేశారు. ప్రధాని మోదీ ఇటీవల జీఎస్‌టీ రేట్లు తగ్గించడం ద్వారా ఎంతో ఉపశమనం కలిగించారని, స్వదేశీ సంస్కృతికి మనమంతా కట్టుబడితే దేశ ఆర్థిక వ్యవస్థ అత్యున్నత శిఖరాలకు చేరుకుంటుందని తెలిపారు.

# బీసీ రిజర్వేషన్లపై సుప్రీంలో సవాల్

- స్థానిక ఎన్నికల్లో 50శాతం మించి రిజర్వేషన్లు
- సుప్రీంలో వంగా గోపాల్ రెడ్డి పిటిషన్
- సోమవారం విచారించనున్న కోర్టు




**న్యూఢిల్లీ, అక్టోబర్ 4:** తెలంగాణలో స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణపై సుప్రీం కోర్టులో పిటిషన్ దాఖలైంది. స్థానిక ఎన్నికలపై తెలంగాణ హైకోర్టు ఇటీవల ఇచ్చిన ఉత్తర్వులను సవాల్ చేస్తూ వంగ గోపాల్‌రెడ్డి సెప్టెంబరు 29న సర్వోన్నత న్యాయస్థానంలో పిటిషన్ దాఖలు చేశారు. జస్టిస్ విక్రమ్‌నాథ్ నేతృత్వంలోని ధర్మాసనం ఈనెల 6న పిటిషన్‌పై విచారణ జరపనుంది. తెలంగాణలో స్థానిక ఎన్నికలకు ఇటీవల నగారా మోగింది. ఎంపీటీసీ, జడ్పీటీసీ, పంచాయతీ ఎన్నికలకు షెడ్యూల్‌ను రాష్ట్ర ఎన్నికల సంఘం ఇప్పటికే ప్రకటించింది. మొత్తం 5 దశల్లో ఎన్నికలు నిర్వహించనున్నారు. తొలి 2దశల్లో ఎంపీటీసీ, జడ్పీటీసీ.. మిగతా మూడు దశల్లో గ్రామ పంచాయతీ ఎన్నికలు నిర్వహిస్తామని రాష్ట్ర ఎన్నికల కమిషన్ తెలిపింది. దీంతో ఇప్పుడు తెలంగాణ రాష్ట్రంలోని బీసీ రిజర్వేషన్ల అంశం రోజుకో మలుపు తీసుకుంటుంది. ఇప్పుడు తాజాగా రిజర్వేషన్ల అంశం సుప్రీకోర్టుకు చేరింది. 42 శాతం బీసీ రిజర్వేషన్లపై సుప్రీంకోర్టులో పిటిషన్ దాఖలు అయ్యింది. తెలంగాణలోని స్థానిక సంస్థల ఎన్నికల్లో 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేయబోతున్నారని వంగ గోపాల్ రెడ్డి పిటిషన్ సుప్రీంకోర్టులో వేశారు. 50 శాతానికి మించి రిజర్వేషన్లు అమలు చేస్తున్నారంటూ.. పిటిషన్‌లో చెప్పుకొచ్చారు. గతంలో సుప్రీంకోర్టు 50 శాతం రిజర్వేషన్ మించరదంటూ ఇచ్చిన తీర్పుకు విరుద్ధంగా.. రాష్ట్ర ప్రభుత్వం చర్యలు ఉన్నాయని ఆరోపించారు. ఈ నేపథ్యంలో గోపాల్ రెడ్డి వేసిన పిటిషన్ సోమవారం విచారణకు రానుంది. జస్టిస్ విక్రమ్ నాథ్ ఆధ్వర్యంలో విచారణ కొనసాగనున్నట్లు సమాచారం. తెలంగాణ స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం బీసీ రిజర్వేషన్లు అమలు చేస్తామని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించింది. ఈ మేరకు గత ప్రభుత్వం తీసుకొచ్చిన రిజర్వేషన్లను ఎత్తివేస్తూ.. రాష్ట్ర ప్రభుత్వం 42శాతం బీసీ రిజర్వేషన్ల బిల్లుకు అసెంబ్లీలో ఆమోదం తెలిపింది. దీనికి అన్ని పార్టీల నేతలు అంగీకారం తెలిపారు. ఆ తర్వాత వీటిని గవర్నర్ ఆమోదం కోసం రాజ్ భవన్‌కు పంపారు. అయితే ఈ బిల్లుకు గవర్నర్ ఇంకా ఆమోదం తెలుపలేదు. రిజర్వేషన్ల బిల్లుపై ఇప్పటి వరకు ఎలాంటి నిర్ణయం తీసుకోలేదని.. తమ వద్దనే పెండింగ్‌లోనే ఉన్నాయని ఇటివల రాజ్‌భవన్ వర్గాలు ప్రకటించిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో బీసీ బిల్లుపై సుప్రీంకోర్టులో పిటిషన్ పడటం రాష్ట్ర ప్రభుత్వానికి షాక్ అని చెప్పవచ్చు. ఈ పిటిషన్‌పై సుప్రీంకోర్టు ఏ తీర్పు ఇస్తోంది అనే దానిపై సర్వాత్ర ఉత్కంఠ నెలకొంది.

# జంట జలాశయాలకు భారీగా వరదనీరు

## మరోమారు గేట్లు ఎత్తి మూసీలోకి..

**హైదరాబాద్, అక్టోబర్ 4:** ఎగువనుంచి వరద రావడంతో జంటజలాశయాలకు మరోమారు భారీగా వరదనీరు వచ్చి చేరుతోంది. దీంతో జలమండలి అధికారులు జంట జలాశయాల నుంచి భారీ మొత్తంలో నీటిని విడుదల చేస్తున్నారు. ఇటీవల వర్షాల కారణంగా వాతావరణ శాఖ మరోసారి ఆరెంజ్ అలర్ట్ జారీ చేసింది. దీంతో అప్రమత్తమైన జలమండలి అధికారులు జంట జలాశయాలను పరిశీలించి, అవసరమైతే ముందస్తుగా నీటిని విడుదల చేయమని ఆదేశాలు స్వీకరించారు. ఎగువ నుండి ఉస్మాన్‌సాగర్‌కు 300క్యూసెక్కుల ఇన్‌ఫ్లో కొనసాగుతున్నప్పటికీ, 3 గేట్లను తెరిచి 2028 క్యూసెక్కుల నీటిని మూసిలోకి వదులుతున్నట్లు అధికారులు తెలిపారు. హిమాయత్‌నగర్ ప్రాంతానికి 400 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా, 2 గేట్లను మూడు ఫీట్లు తెరిచి 2000 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు. జంట జలాశయాల నుంచి కలిపి 5000 క్యూసెక్కుల నీటిని జాగ్రత్తగా విడుదల చేయాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డి నిర్ణయించారు. అధికారులు ఎప్పటికప్పుడు వరద పరిస్థితులను అంచనా వేస్తూ అప్రమత్తంగా ఉండాలని సూచిస్తున్నారు. వర్షాల కారణంగా జలాశయాల్లో నీటి స్థాయి పెరుగుతున్న సమయంలో, ముందస్తు జాగ్రత్తల ద్వారా వరదల దెబ్బలు తగ్గించవచ్చని జలమండలి అధికారులు చెబుతున్నారు.

## పరదాలు కట్టుకుని రాలేదు..

# దర్జాగా ఆటోలో వచ్చాం



మొదటి పేజీ తరువాయి

మంది డ్రైవర్ల ఖాతాల్లోకి రూ.436 కోట్లు జమ చేశారు. సభా ప్రాంగణంలో డ్రైవర్లు అందించిన ఖాకీ చొక్కాలను ధరించి సభలో పాల్గొన్న ముఖ్యమంత్రి ఈ సందర్భంగా మాట్లాడుతూ.. "కూటమి పాలనలో ప్రజల కష్టాలు తీరాయి. సంక్షేమం దరిచేరింది. ఉబర్, ర్యాపిడో వంటి యాప్ లు ఉన్నాయి. వీటి ద్వారా ఆటో డ్రైవర్లు కొంత మేర ఇబ్బంది పడుతున్నారు. వాటిని ప్రభుత్వం కంట్రోల్ చేయలేదు. కానీ రాష్ట్ర ప్రభుత్వం వైపు నుంచి ఆటో డ్రైవర్ల కోసం ఓ యాప్ తెస్తాం. ఆ యాప్ ద్వారా ఆటో డ్రైవర్లకు బుకింగ్ లు వచ్చేలా చూస్తాం. కిరాయి కోసం ఆటో స్టాండుకు వెళ్లి పడిగాపులు పడే అవసరం లేకుండా టెక్నాలజీ ద్వారా సహకారం అందిస్తాం. ఒక కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేసి యాప్ ద్వారా మీకు అవకాశాలు దొరికేలా చేస్తాం. యాప్ ద్వారా వచ్చే ఆదాయాన్ని ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసమే ఖర్చు పెడతాం. అలాగే ఆటో డ్రైవర్ల సంక్షేమ బోర్డు ఏర్పాటు చేసి... ఆటో డ్రైవర్ల భవిష్యత్తును మరింత మంచిగా తీర్చిదిద్దేలా పనిచేస్తాం. ఆటో, మాక్సి క్యాబ్, క్యాబ్ డ్రైవర్లందరికీ కూటమి ప్రభుత్వం అండగా ఉంటుంది. ఆటో డ్రైవర్ల సంక్షేమం కోసమే ఆటో డ్రైవర్ సేవలో కార్యక్రమాన్ని అమలు చేస్తున్నాం. ఎవరికి లంచాలు ఇవ్వకుండా, కార్యాలయాలకు తిరగకుండా అర్హుల అందరి బ్యా%శీ%క్ ఖాతాల్లో డబ్బులు జమ చేశాం. అర్హులు ఏ ఒక్కరికి డబ్బులు జమ కాకపోయినా ప్రభుత్వానికి చెప్పండి... అర్హతను బట్టి ఖాతాలో వేస్తాం" అని సీఎం చెప్పారు "గత పాలకులు రోడ్లను అస్సలు ఏ మాత్రం పట్టించుకోలేదు... ధ్వంసం చేశారు. మేం వచ్చేసరికి రోడ్లన్నీ గుంతలు పడ్డాయి. గత పాలకుల హయాంలో వాహనాల్లో ప్రయాణిస్తే ఒళ్లు హూనం అయ్యేది. ఆటోల రిపేర్లకే ఎక్కువ డబ్బులు ఖర్చు అయ్యేవి. కూటమి ప్రభుత్వం వచ్చాక రోడ్ల రిపేర్లపై పెద్ద ఎత్తున ఫోకస్ పెట్టాం. రాష్ట్రంలో 23 వేల కిలోమీటర్ల మేర మ-రమ్మతులు చేసి గుంతలు లేని రోడ్లను తయారు చేశాం. దీంతో వాహనాలు సాఫీగా సాగుతున్నాయి. రిపేర్లు ఖర్చు తగ్గింది. గతంలో ఆటోలపై పెద్ద ఎత్తున జరిమానాలు విధించేవారు. అనవసరంగా ఉన్న జరిమానాల జీవోలను రద్దు చేస్తాం. చలనా విధానాన్ని సరళీకృతం చేయటంతో పాటు ఆటోలను ఈవీలుగా మారుస్తాం.. దీనికి ప్రభుత్వం సహకరిస్తుంది. ఆటో, మాక్సి, క్యాబ్ డ్రైవర్లు క్రమశిక్షణగా ఉండాలి. ఎక్కడా నిబంధనలు ఉల్లంఘించవద్దు... ఎక్కడికక్కడ సీసీ కెమెరాలు ఉంటాయి. ప్రజలను ఇబ్బంది పెట్టకండి. మీరు సహకరిస్తే పర్యాటక రంగం అభివృద్ధి చెందుతుంది" అని ముఖ్యమంత్రి అన్నారు. "ఆటో డ్రైవర్ల సేవలో పథకం ద్వారా ఆర్థిక సాయం డ్రైవర్ల ఖాతాల్లో పడ్డాయి. డ్రైవర్లకు పండుగ. కూటమి ప్రభుత్వం పేదల ప్రభుత్వం. 15 నెలల్లో ప్రతీ పేదవాడి జీవితంలో మార్పు తెచ్చే దిశగా మెరుగైన పాలన అందిస్తూ వచ్చాం. కూటమి ప్రభుత్వం సూపర్ 6 అమలు చేస్తుంటే... ప్రధాని మోదీ సూపర్ జీఎస్టీ తెచ్చి ఆర్థిక భారం తగ్గించారు. చెప్పిన పని చెప్పినట్లుగా చేసే ఏకైక ప్రభుత్వం కూటమి ప్రభుత్వం. దేశ చరిత్రలో మరే రాష్ట్రంలో లేని సంక్షేమం సూపర్ 6 ద్వారా ఏపీలోనే అమలు చేస్తున్నాం. స్త్రీశక్తి పథకం ద్వారా కూటమి ప్రభుత్వం మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం చేసే స్వేచ్ఛ ఇచ్చింది. ఆటో డ్రైవర్ కుటుంబంతో కలిసి ఇవాళ వేదిక వరకూ వచ్చాను... వారి కుటుంబం కష్ట సుఖాలను తెలుసుకున్నాను. అన్నా క్యాంటీన్లలో రూ.5కే ఆహారం పెడుతున్నాం. మధ్యాహ్నం పిల్లలకు సన్న బియ్యంతో భోజనం పెడుతున్నాం. దసరా జరుపుకున్నాం... ఓజీ సినిమా చూశాం.. ఇప్పుడు ఆటో డ్రైవర్ల సేవలో ఉన్నాం. ఇలా నిత్యం ఏదోక సంక్షేమం, అభివృద్ధి కార్యక్రమం



చేపడుతూనే ఉన్నాం. ఆటోడ్రైవర్ల ఇంట్లో ఆడబిడ్డలు కూడా రాష్ట్రంలో ఎక్కడికి వెళ్లాలన్నా ఉచిత బస్సు ప్రయాణం వాడుకోవచ్చు. స్త్రీ శక్తి పథకం బంపర్ హిట్ అయ్యింది. యూనివర్సల్ హెల్త్ పాలసీ ద్వారా రాష్ట్రంలో అందరికీ ఉచిత ఆరోగ్య బీమా కల్పించాం. 25 లక్షల వరకూ పేదలకు ఉచిత వైద్య సేవలు అందుతాయి. డ్రైవర్ల కోసమే కాదు.. ప్రజలందరికీ మంచి జరిగేలా సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు చేపడుతున్నాం. మంచి చేస్తోన్న కూటమి ప్రభుత్వం గురించి డ్రైవర్లంతా ప్రజలకు వాస్తవాలు వివరించాలి. మంచి చేస్తున్న ప్రభుత్వం గురించి పది మందికి చెప్పండి. ప్రజలంతా ఆనందంగా ఉండటమే కూటమికి కావాల్సింది" అని సీఎం వివరించారు. "దుష్టశక్తులను అంతం చేసినందుకు దసరా, దీపావళి పండుగలు జరుపుకుంటాం. ఈ పండుగలను మనం స్ఫూర్తిగా తీసుకోవాలి. మన సంస్కృతిలో భాగమైన పండుగల్ని ఉత్సాహంతో చేసుకోవాలి. ఆ పండుగల సారాంశాన్ని గ్రహించాలి. రాష్ట్రానికి మళ్లీ దుష్ట శక్తులు రాకుండా జాగ్రత్త పడాలి. ఈ పండుగలు నేర్పించే పాఠాలను అర్థం చేసుకోవాలి. 16 నెలల క్రితం వ్యవస్థలన్నీ నిర్వీర్యం అయ్యాయి. పాలన ఎక్కడికక్కడ ఆగిపోయింది. పేదల ఆకలి తీర్చే అన్నా క్యాంటీన్లను కూడా గత పాలకులు నడవనీయలేదు. 16 నెలల క్రితం వరకూ పరదాలు కట్టుకుని, గోతులు తవ్వారు. ప్రజల్ని భయాందోళనలో ఉంచారు. రాష్ట్రాన్ని విధ్వంసం చేశారు. పేదల సంక్షేమంలోనూ డబ్బులు బొక్కేసిన వాళ్లు రాజకీయానికి పనికిరారు. ఇలాంటి దుష్టశక్తులు రాకుండా, ప్రజలకు చెడు జరగకుండా కాపాడుకోవాలి. మనకు ఇక ఈ వైకుంఠపాళి వద్దు. గుజరాత్ లో 25ఏళ్లుగా ఉన్న సుస్థిర పాలనను స్ఫూర్తిగా తీసుకోవాలి. కేంద్రంలో 15ఏళ్లుగా ఎన్డీఏ ఉన్నందునే ప్రజల కష్టాలు తీరాయి. వైకుంఠపాళీ వల్ల రాష్ట్రానికి ఇబ్బందులే అందుకే అలాంటి వారి పాలన మనకు వద్దు. డబుల్ ఇంజిన్ సర్కారుతోనే కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ అభివృద్ధి. 16 నెలల కాలంలో వ్యవస్థలను గాడిలో పెట్టాం. సంపద సృష్టించి పేదలకు పంచుతూ సుపరిపాలన దిశగా కూటమి ప్రభుత్వం ముందుకు సాగుతోంది. గతంలో మాదిరిగా పరదాలు కట్టుకుని రాలేదు... ఆటోలో దర్జాగా వచ్చాం. 2024లో జరిగిన ఎన్నికలు నా జీవితంలో ఎప్పుడూ చూడలేదు. 94 శాతం స్ట్రైక్ రేట్ వచ్చింది. ప్రభుత్వం అమలు చేస్తున్న కార్యక్రమాలతో ఈ స్ట్రైక్ రేట్ ఇంకా పెరగాలి" అని ముఖ్యమంత్రి చెప్పారు. సీఎం చంద్రబాబు తన నివాసం నుంచి సభా ప్రాంగణం వరకు ఆటోలో ప్రయాణించారు. సుమారు 14 కిలోమీటర్ల దూరం సీఎం ఆటోలో ప్రయాణించారు. ముఖ్యమంత్రితో పాటు.. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రి నారా లోకేష్, బీజేపీ ఏపీ అధ్యక్షుడు మాధవ్ వేర్వేరుగా ఆటోల్లో ప్రయాణించి సభా ప్రాంగణానికి చేరుకున్నారు. ఆటో డ్రైవర్ సేవలో పథకం లబ్దిదారుల కుటుంబ సభ్యులతో కలిసి చంద్రబాబు, పవన్ కళ్యాణ్, లోకేష్, మాధవ్ ఆటోల్లో ప్రయాణించారు. వారి కుటుంబ స్థితిగతులను నేతలు అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాల గురించి చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. రోజుకు 10 నుంచి 12 గంటల పాటు ఆటో నడుపుతూ కుటుంబాన్ని పోషిస్తున్నామని సీఎం అడిగిన ఓ ప్రశ్నకు ఆటో డ్రైవర్ అఫ్సర్ ఖాన్ సమాధానమిచ్చారు. ఆటో ద్వారా ప్రజలను, ప్రయాణికుల్ని గమ్య స్థానాలకు చేరుస్తూ చేస్తున్న సేవ అభినందనీయమని సీఎం బదులిచ్చారు. ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించేందుకు ప్రయత్నిస్తానని సీఎం హామీ ఇచ్చారు. తల్లికి వందనం, దీపం-2.0 వంటి పథకాలు అందాయా.. రేషన్ ద్వారా బియ్యం తీసుకుంటున్నారా అని చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. అలాగే పిల్లలను చక్కగా చదివించుకోవాలని.. పిల్లల్లో నాయకత్వ లక్షణాలు పెంచేలా చూడాలని ఆటో డ్రైవర్ అఫ్సర్ ఖాన్ దంపతులకు సీఎం సూచించారు. ఆటోల్లో వెళ్తున్న చంద్రబాబును, ఇతర నేతలను చూసి ప్రజలు సంతోషంతో కేరింతలు కొట్టారు. ప్రజలకు అభివాదం చేసుకుంటూ నేతలు ముందుకు కదిలారు. ప్రకాశం బ్యారేజీ నుంచి కాళేశ్వరరావు మార్కెట్, ఏలూరు లాకులు, ముత్యాలంపాడు గవర్నమెంటు ప్రెస్ మీదుగా సీఎం సహా ఇతర నేతలు ఆటోల్లో ప్రయాణించారు. ఆటోల్లో సభా ప్రాంగణానికి చేరుకోగానే ప్రయాణానికి సంబంధించిన డబ్బులను ఆటో డ్రైవర్లకు చంద్రబాబు, ఇతర నేతలు అందచేశారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మండిపల్లి రాంప్రసాద్ రెడ్డి, సత్యకుమార్ యాదవ్, ఎంపీ కేశినేని చిన్ని, ఎమ్మెల్యే బోండా ఉమ, రవాణ శాఖ ఉన్నతాధికారులు సహా స్థానిక నేతలు, అధికారులు పాల్గొన్నారు.

# ఉత్తరాంధ్రలో పిడుగులతో వర్షం




మొదటి పేజీ తరువాయి

జారీ చేశారు. గంటకు 50 నుంచి 60 కి.మీ వేగంతో ఈదురు గాలులు వీచే అవకాశముందని, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు నాగావళి నది ఉద్ధృతి వల్ల పార్వతీపురం మన్యం జిల్లా, పాలకొండ డివిజన్, జియ్యమ్మవలస మండలం బాసంగి నిర్వాసిత గ్రామం ముంపునకు గురైంది. దీంతో ఇళ్లు, పాఠశాల తరగతి గదుల్లో నీరు చేరి గ్రామస్థులు నానా అవస్థలు పడుతున్నారు. ఏటా వర్షాకాలంలో ఇదే పరిస్థితియ నెలకొంటోంది అంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీరి సమస్యలు తెలుసుకోడానికి ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే తోయక జగదీశ్వరి, అధికారులు నిర్వాసిత గ్రామాలను పరిశీలించారు. శ్రీకాకుళం జిల్లాలో భారీ వర్షాలకు నాగావళి నది ఉప్పొంగింది. సిగడం మండలంలోని బొడ్డేపల్లి రైల్వే అండర్‌పాస్‌లోకి భారీగా వరద నీరు చేరింది. దీంతో శ్రీకాకుళం-తాడివలస వెళుతున్న ఓ ఆర్టీసీ బస్సు వరద నీటిలో చిక్కుకుంది. బస్సు ఇంజిన్ ఎంతకీ స్టార్ట్ అవకపోవడంతో జేసీబీ సాయంతో బస్సును వరద నీటి నుంచి బయటకు తీశారు. బస్సులోని ప్రయాణికులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. ఏటా వర్షాకాలంలో రైల్వే అండర్‌పాస్ లోకి వరద నీరు చేరుతోందని వాహనదారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. రైల్వే అధికారులు శాశ్వత పరిష్కారం చూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.వరద ప్రవాహం ఊరును చుట్టుముట్టడంతో రాకపోకలు సాగించేందుకు ఆ గ్రామస్థులకు తాడే దిక్కైంది. తీవ్ర వాయుగుండం ప్రభావంతో శ్రీకాకుళం జిల్లా వజ్రపుకొత్తూరు మండలంలో కురిసిన భారీ వర్షాలతో రాకపోకలకు ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. వరద ప్రవాహంతో శివరాంపురం గ్రామం జలదిగ్బంధంలో చిక్కుకుంది. రోడ్డుపై భారీగా వరద నీరు చేరడంతో.. స్థానికులు తాడు సాయంతో వరదలో ఈదుకుంటూ ప్రమాదకరంగా రాకపోకలు సాగిస్తున్నారు. తిరుపతి జిల్లాలో ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షానికి పలుచోట్ల రహదారులు జలమయం అయ్యాయి. మధురానగర్, సత్యనారాయణపురం, అశోక్ నగర్, ఎమ్మార్ పల్లి, వైకుంఠపురం, వెస్ట్ చర్చి, ఎన్టీఆర్ కూడలి, కొర్లగుంట, లీలామహల్ కూడలితో పాటు పలు ప్రాంతాల్లో వర్షపు నీరు రోడ్లపైకి చేరింది. పలుచోట్ల మ్యాన్‌హోల్స్ పొంగడంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. భారీ వర్షానికి కాలువలు పొంగి పొర్లుతున్నాయి. తిరుమలలో శనివారం వేకువజాము నుంచి ఎడతెరిపి లేకుండా వర్షం కురుస్తోంది. దీంతో భక్తులు ఇక్కట్లు పడుతున్నారు. ఉరుములు, మెరుపులతో కూడిన వాన రావటంతో దర్శనానంతరం గదులు, లడ్డూ విక్రయశాలకు వెళ్లేందుకు భక్తులు ఇబ్బందులు పడుతున్నారు. వర్ష ప్రభావంతో తిరుమల కొండపై చలి తీవ్రత పెరిగింది. అన్నమయ్య జిల్లా పీలేరులో శనివారం భారీ వర్షం కురిసింది. దీంతో పట్టణంలోని లోతట్టుప్రాంతాలు జలమయం అయ్యాయి. ఆర్టీసీ బస్టాండ్‌లోకి భారీగా వరద నీరు చేరింది. బస్టాండ్ ఆవరణలో మోకాళ్ల లోతు వరకు వాన నీరు చేరడంతో ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్లాట్‌ఫారాల్లోకి సైతం వాన నీరు చేరింది. దీంతో ప్రయాణికులు కుర్చీల్లో కూర్చోలేకపోతున్నారు. శనివారం ఉదయం పీలేరు పట్టణంలో 8 సెంటీమీటర్ల వర్షపాతం నమోదైంది.

# జగన్ దెబ్బకు దిగొచ్చిన చంద్రబాబు

మొదటి పేజీ తరువాయి

ప్రయాణం ఫ్రీ అన్నారని చెప్పారు. ఎవరైనా అడిగితే నా పేరు చెప్పాడని చంద్రబాబు తెలిపారు. ఎవరైనా ప్రశిస్తే తోలు తీస్తామన్నారని గుర్తు చేశారు. ఏడాదైనా ఫ్రీ బస్సు ఇవ్వకపోవడంతో విమర్శల పాలయ్యారన్నారు. జగన్ మోహన్ రెడ్డి , ప్రజలు, ప్రతిపక్షాల దెబ్బకు చంద్రబాబు ప్రభుత్వం దిగొచ్చిందని చెప్పారు. ఫ్రీ బస్సులో జిల్లాల సరిహద్దులు దాటడానికి వీల్లేదని సాక్షాత్తూ మంత్రులే చెప్పారన్నారు. తీవ్ర వ్యతిరేకత రావడంతో పల్లె వెలుగులో రాష్ట్రమంతా తిరగొచ్చని ప్రకటించారని ప్రకటించారు. బస్సులను తగ్గించేశారని చెప్పారు. చంద్రబాబు దెబ్బకు ఆటోవాళ్లంతా రోడ్డెక్కారని మాజీ మంత్రి పేర్ని నాని అన్నారు. 'ఎన్నికల్లో ఊకదంపుడు ప్రసంగం చేసిన చంద్రబాబు, పవన్ ను నిలదీశారు. 2,90,669 మంది ఆటో డ్రైవర్లకు 436 కోట్లు వేశామని చంద్రబాబు చెబుతున్నారు. భూ ప్రపంచం మీద తనే ఆటో డ్రైవర్లను ఆదుకున్నానని బిల్డప్ ఇచ్చారు. చంద్రబాబు స్పీచ్ దెబ్బకు ఆటో డ్రైవర్లకు చెవుల వెంట రక్తం ఒక్కటే తక్కువ. ఆటో వాళ్ల కోసం యాప్ పెడతా.. కంట్రోల్ రూమ్ పెడతానంటున్నారు. ఆటో, క్యాబ్, మ్యాక్సిక్యాబ్ డ్రైవర్లకు పండగే పండగ అని చంద్రబాబు చెబుతున్నారు. చంద్రబాబు తీరు సినిమాలో బ్రహ్మానందం క్యామెడీ సీన్ లా ఉంది. వాహన మిత్ర పథకం ప్రారంభించింది జగన్ మోహన్ రెడ్డి. పాదయాత్రలో జగన్ మోహన్ రెడ్డి ఆటో డ్రైవర్ల కష్టాలు తెలుసుకున్నారు. మచిలీపట్నంలో ఆటో డ్రైవర్ల సమస్యలు స్వయంగా విన్నారు. తమకు ఏడాదికి పది వేలైనా ఇవ్వమని ఆటో డ్రైవర్లు అడిగారు. సొంతంగా ఆటో కొనుక్కుని నడుపుకుంటున్న వారికి 10 వేలు ఇస్తామని ఏలూరు వేదికగా ప్రకటించారు. జగన్ సీఎం అయిన వెంటనే.. 2 లక్షల 36 వేల మందికి వాహనమిత్ర ఇచ్చారు. ఎన్నికల సంవత్సరం కూడా జగన్ మోహన్ రెడ్డి 2 లక్షల 75 వేల మందికి వాహన మిత్ర ఇచ్చారు. ఇప్పుడు జగన్ కంటే చంద్రబాబు కేవలం 14 వేల మందికి మాత్రమే అదనంగా ఇచ్చారు.' అని పేర్ని నాని వ్యాఖ్యానించారు.

# అభిమానికి మంత్రి లోకేశ్ షాక్

## పెళ్లి పత్రిక రావడంతో సడన్‌గా హాజరు



**విజయవాడ :** తమ పెళ్లికి రావాలని ఓ మహిళా అభిమాని పంపిన ఆహ్వానాన్ని మంత్రి లోకేష్ మన్నించారు .. గతంలో చేపట్టిన యువగళం పాదయాత్రలో భాగంగా 2023 ఆగస్టు 20వ తేదీన యువనేత నారా లోకేష్ విజయవాడలో పాదయాత్ర నిర్వహించారు? విజయవాడ మొగల్రాజపురానికి చెందిన భవానీ అనే యువతి ఆనాటి పాదయాత్రలో ఉత్సాహంగా పాల్గొన్నారు.. యువగళం యాత్ర ద్వారా లోకేష్ అభిమానిగా మారిన భవ్య.. తన పెళ్లికి విచ్చేసి ఆశీర్వదించాలంటూ ఇటీవల మంత్రి నారా లోకేష్ కు ఆహ్వానపత్రిక పంపించారు. శనివారం రాత్రి గన్నవరం ఎయిర్ పోర్టు సమీపంలోని ఓ కళ్యాణ మండపంలో భవ్య వివాహం జరగనుంది. బిజీ షెడ్యూలు ఉన్నప్పటికీ మంత్రి లోకేష్ శనివారం మధ్యాహ్నం మొగల్రాజపురంలోని తన అభిమాని భవ్య ఇంటికి వెళ్లి ఆమెకు ఆశీర్వచనాలు అందజేశారు. అకస్మాత్తుగా అభిమాన నేత లోకేష్ తమ ఇంటికి రావడంతో భవ్యతోపాటు ఆమె తల్లిదండ్రులు నాగుమోతు రాజా, లక్ష్మి ఆనందంతో పొంగిపోయారు. యువనేత లోకేష్ ను చూసి వారి ఉద్వేగానికి గురయ్యారు.

# భారీగా నకిలీ మద్యం తయారీ గుట్టురట్టు

మొదటి పేజీ తరువాయి

వాహనాన్ని సీజ్ చేశారు. సీసాల మీద ఉన్న లేబుళ్లను స్కాన్ చేయడంతో.. అక్రమ మద్యం తయారీ వ్యవహారం వెలుగులోకి వచ్చింది. అధికారులు గత నాలుగు రోజులుగా నిఘా ఉంచి దాడులు నిర్వహించారు. ఈ క్రమంలోనే దాడులు నిర్వహించి.. రూ.1.75 కోట్ల విలువైన నకిలీ మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. కడప ప్రొహిబిషన్, ఎక్సైజ్ అసిస్టెంట్ కమిషనర్ చంద్రశేఖర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం.. విజయవాడకు చెందిన జనార్దన్‌రావు, అతని అనుచరుడు రాజు కలిసి ములకలచెరువు కనుగొండ ఆర్చి ప్రాంతంలో ఓ ఇంటిని అద్దెకు తీసుకుని నకిలీ మద్యం తయారు చేస్తున్నారు. పలు ప్రభుత్వ మద్యం దుకాణాలు సహా.. తంబళ్లపల్లె నియోజకవర్గంలోని ప్రాంతాలకు సరఫరా చేస్తున్నారు. ప్రభుత్వ ధర కంటే తక్కువకే ఇస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. పెద్దతిప్ప సముద్రం మండలంలో ఇటీవల జిల్లా ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఇందులో భాగంగా నకిలీ మద్యం తరలిస్తున్న వాహనాన్ని అడ్డుకున్నారు. 15 వేల నకిలీ మద్యం సీసాలు, 1,050 లీటర్ల స్పిరిట్ క్యాన్లు, 1,500 లీటర్ల లబెండ్(తయారైన నకిలీ మద్యం), 10 వేల ఖాళీ మద్యం బాటిళ్లు, మూతలు, స్టిక్కర్లు, తయారీ పరికరాలు, ఇతర సామగ్రితోపాటు సరఫరాకు వినియోగిస్తున్న వాహనాన్ని సీజ్ చేశారు. తమిళనాడులోని కృష్ణగిరికి చెందిన మరిమారన్, తిరుపత్తూరుకు చెందిన సురేశ్, సూర్య, ఆనందన్, ఒడిశా బ్రహ్మపుర్‌కు చెందిన ఆనంద్ దాస్, మిథున్, విశాఖపట్నానికి చెందిన సయ్యద్ అలీ, వాహన డ్రైవర్ బాలరాజును అదుపులోకి తీసుకున్నారు. నకిలీ మద్యం కలిగి ఉన్న బెల్ట్ షాపు నిర్వాహకుడు, రంగసముద్రానికి చెందిన నాగరాజు, పెద్దతిప్ప సముద్రంలోని మద్యం దుకాణ నిర్వాహకుడు కట్టా సురేంద్రనాయుడును అరెస్టు చేశారు. జనార్దన్‌రావు, రాజు, ములకల చెరువులోని రాక్ స్టార్ మద్యం దుకాణ నిర్వాహకుడు రాజేశ్ తదితరులపైనా కేసు నమోదు చేసినట్లు అధికారులు తెలిపారు.

# మరుగుతున్న గంజి పడి చిన్నారులకు గాయాలు

**విశాఖపట్టణం :** అన్నదాన కార్యక్రమంలో విషాదం చోటుచేసుకుంది. మరుగుతున్న గంజి మీద పడి 16 మంది చిన్నారులతో సహా మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. ఈ సంఘటన విశాఖలోని జాలరిపేట పిల్లా అప్పమ్మయ్య సంఘం వద్ద చోటుచేసుకుంది. ఇందుకు సంబంధించిన పూర్తి వివరాలు ఇలావున్నాయి. శనివారం దుర్గాదేవి మండపం దగ్గర అన్నదాన కార్యక్రమం జరిగింది. ఆ కార్యక్రమానికి పెద్ద ఎత్తున చిన్నారులు, మహిళలు వచ్చారు. ఈ నేపథ్యంలోనే వంట చేస్తున్న ప్రాంతంలో ప్రమాదం చోటుచేసుకుంది. మరుగుతున్న గంజి 16 మంది చిన్నారులు, మహిళలపై పడింది. ఆ నొప్పి తట్టుకోలేక వారంతా విలవిల్లాడారు. గట్టిగా కేకలు పెట్టారు. అక్కడ ఉన్న వారు వెంటనే గాయపడ్డ వారిని విశాఖ కేజీహెచ్‌కు తరలించారు. ఈ ఘటనపై ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ స్పందించారు. కేజీహెచ్ సూపరింటెండెంట్ వాణితో ఫోన్‌లో మాట్లాడారు. ఇక, గాయపడ్డ వారిలో ఆరుగురికి తీవ్ర గాయాలు అయ్యాయి. వారిని ఆస్పత్రిలో అడ్మిట్ చేసుకున్నారు. మిగిలిన వారికి ప్రాథమిక చికిత్స అందించి ఇంటికి పంపించాలని వైద్యులు నిర్ణయించారు. ఎన్టీఆర్ వైద్యసేవా ట్రస్ట్ ఛైర్మన్ సీతంరాజు సుధాకర గాయపడ్డ చిన్నారులను విశాఖ కేజీహెచ్‌కు వెళ్లి పరామర్శించారు.

05-10-25 Samayam_Layout 1 10/5/2025 5:52 AM Page 6






## ధర్నాను జయప్రదం చేయండి

**గజ్వేల్, అక్టోబర్ 4(సమయం న్యూస్):** త్రిపుల్ ఆర్ అలైన్మెంట్ ను శాస్త్రబద్ధంగా సర్వే చేయాలని, 2013 భూ సేకరణ చట్టం అమలు చేయాలని 6న హెచ్ఎండిఏ కార్యాలయం ముందు జరుగు ధర్నాను జయప్రదం చేయాలని సిపిఐఎం సిద్దిపేట జిల్లా కార్యదర్శి సభ్యులు సందబోయిన ఎల్లయ్య పిలుపునిచ్చారు. భారత కమ్యూనిస్టు పార్టీ మార్క్సిస్టు గజ్వేల్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గజ్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఐదు మండలాల నుండి 20 గ్రామాల పరిధిలో త్రిబుల్ ఆర్ రోడ్ వెళుతుందని దీనిని సమగ్రంగా అలైన్మెంట్ చేయాలని డిమాండ్ చేశారు. ఔటర్ రింగ్ రోడ్డు కు 50 కిలోమీటర్ల దూరం ఉండాల్సిన త్రిబుల్ ఆర్ రోడ్డు ను 30 కిలోమీటర్ల కంటే తక్కువ కుదించారని పెద్దల భూముల జోలికి పోకుండా పేద రైతులను రోడ్డు మీద పడేసే విధంగా రింగ్ రోడ్డు అలైన్మెంట్ మార్చడం జరిగిందని అన్నారు. ప్రభుత్వ అధికారులు రైతులకు భూములు పోతున్నాయని నోటీసులు ఇవ్వడం జరుగుతుందని, కానీ నష్టపరిహారం విషయంలో స్పష్టత చేయడం లేదని అన్నారు. రైతులందరికీ భూమికి బదులు భూమి ఇవ్వాలని, 2013 భూ సేకరణ చట్టం ప్రకారం గ్రామాల్లో సభలు నిర్వహించి 80 శాతం మంది ఆమోదం చేస్తేనే భూ సేకరణ నిర్వహించాలని కానీ ఎక్కడ గ్రామసభలు నిర్వహించకుండా రైతులను మోసం చేయడం జరుగుతుందని అన్నారు. గజ్వేల్ రెవెన్యూ డివిజన్ పరిధిలో ఎకరం భూమి విలువ బహిరంగ మార్కెట్లో కోటి నుండి మూడు కోట్ల వరకు ఉందని ప్రభుత్వం భూములు గుంజుకున్నా మార్కెట్ రేటుతో మూడు రేట్లు ఇవ్వాలని డిమాండ్ చేశారు ఆరో తేదీన సిపిఎం పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హెచ్ఎండిఏ కార్యాలయం ముందు ధర్నా నిర్వహించడం జరుగుతుందని త్రిబుల్ ఆర్ పరిధిలో భూములు కోల్పోతున్న రైతులు పాల్గొంటున్నారని, గజ్వేల్ పరిధిలోని జగదేవ్పూర్ మర్కుక్ వర్గల్ గజ్వేల్ రాయపోల్ మండల రైతులందరూ స్వచ్ఛందంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. సమావేశంలో సిపిఎం పార్టీ నాయకులు బండ్ల స్వామి, రంగారెడ్డి పాల్గొన్నారు.

## ఎన్నికల నేపథ్యంలో ప్రజావాణి రద్దు



**వికారాబాద్, అక్టోబర్ 4 (సమయం న్యూస్):** జిల్లాలో స్థానిక సంస్థల ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్న నేపథ్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమం రద్దు చేయడం జరుగుతుందని, జెడ్పిటిసి ఎంపీటీసీ, స్థానిక సంస్థల ఎన్నికలు పూర్తయ్యే వరకు ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం జరగదని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఈ విషయాన్ని జిల్లాలోని ప్రజలంతా గమనించి సహకరించాలని,ఫిర్యాదులు ఇచ్చేందుకు ప్రజలు ఎవ్వరు కూడ రావద్దని తెలిపారు.

## ఎన్నికలు ముగిసే వరకు ప్రజావాణి రద్దు



**మహబూబ్ నగర్, అక్టోబర్ 4 (సమయం న్యూస్):** అక్టోబర్ 6న సోమవారం నిర్వహించనున్న ప్రజావాణి కార్యక్రమం నిర్వహించడం లేదని మహబూబ్ నగర్ కలెక్టర్ విజయేందిర బోయి ఒక ప్రకటన లో తెలిపారు. దరఖాస్తు దారులు ఈ విషయం గమనించి సహకరించాలని ఆమె ఈ ప్రకటన లో పేర్కొన్నారు

## రాబోయేది బడుగులు, బహుజనులదే రాజ్యం

### జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్




**గజ్వేల్, అక్టోబర్ 4 (సమయం న్యూస్):** రాబోయేది బడుగులు, బహుజనులదే రాజ్యమని, అలాగే రాష్ట్రంలో బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీల ఐక్యత ఎంతో అవసరమని రాష్ట్ర జాగృతి ఉపాధ్యక్షులు కొట్టాల యాదగిరి ముదిరాజ్ పేర్కొన్నారు. జాగృతి రాష్ట్ర ఉపాధ్యక్షులుగా నియామకం పొందిన అనంతరం కల్వకుంట్ల కవితను కలిసి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాష్ట్రంలో 60 శాతం ఉన్న బీసీల్లో ఐక్యత లోపించిన కారణంగానే రాజ్యాధికారానికి దూరం అవుతుండగా, వారిని చైతన్యం చేస్తూ సంఘటత పోరాటం చేస్తామని స్పష్టం చేశారు. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలు సత్తా చాటాలని, ఇందుకు జాగృతి సంపూర్ణ సహకారం అందిస్తుందని తెలిపారు. ముఖ్యంగా బీసీలకు 42 శాతం రిజర్వేషన్ దక్కుతుండడాన్ని కొన్ని పార్టీలు జీర్ణించుకోలేకపోతుండగా, అన్ని పార్టీల్లోని బడుగు బలహీన వర్గాలు అధిష్టానాలను ఒప్పించేందుకు కృషి కోరారు. అయితే కామారెడ్డి డిక్లరేషన్ మేరకు కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని, కోర్టులో అడ్డుకోవాలని చూస్తున్న వారికి తగిన రీతిలో జవాబు చెప్పాలని తెలిపారు. తమకు న్యాయస్థానాలపై పూర్తి నమ్మకం ఉందని స్పష్టం చేస్తూ వచ్చే అసెంబ్లీ ఎన్నికల నాటికి జాగృతిని పటిష్టం చేసి సత్తా చాటుతామని అన్నారు. పేద బడుగు బలహీన వర్గాల పక్షాన పోరాటం చేస్తున్న కవితకు అన్ని వర్గాల నుండి సంపూర్ణ మద్దతు వస్తుండగా, రాష్ట్రంలో జాగృతి, కాంగ్రెస్, బిజెపి మినహా ఇతర పార్టీలు అంతర్ధానం అవుతాయని వివరించారు.

# దామోదర్ రెడ్డి పార్థివ దేహానికి డిప్యూటీ సీఎం నివాళి

### కుటుంబ సభ్యులకు పరామర్శ

**హైదరాబాద్, అక్టోబర్ 4 (సమయం న్యూస్):** ఉమ్మడి నల్లగొండ రాజకీయాల్లో తనదేన ముద్ర వేసిన మాజీ మంత్రి రాంరెడ్డి దామోదర్ రెడ్డి పార్థివ దేహానికి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క నివాళి అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాంరెడ్డి దామోదర్ రెడ్డి మరణం అత్యంత బాధాకరమని అన్నారు. నాలుగు దశాబ్దాలపాటు ఉమ్మడి నల్లగొండ రాజకీయాలలో చెరగని ముద్ర వేసుకున్న గొప్ప నాయకుడు దామోదర్ రెడ్డి అన్నారు. అలాంటి గొప్ప నాయకుడు మన మధ్య లేకపోవడం విచారకరమని అన్నారు. ప్రజలకు సేవ చేయడంపట్ల ఆయనకున్న నిబద్ధత, అంకితభావం స్ఫూర్తిగా నిలుస్తుందని చెప్పారు. రాంరెడ్డి దామోదర్ రెడ్డి మరణం వారి కుటుంబానికే కాక కాంగ్రెస్ పార్టీకి సైతం తీరని లోటని అన్నారు. రాంరెడ్డి దామోదర్ రెడ్డిగారి ఆత్మకు శాంతి చేకూరాలని ఉప ముఖ్యమంత్రి బట్టి విక్రమార్క ప్రార్థించారు. మీ వెంట మేమున్నాం.. కాంగ్రెస్ పార్టీ మీకు అండగా ఎప్పటికీ ఉంటుందని రామిరెడ్డి దామోదర్ రెడ్డి గారి తనయుడు సర్వోత్తమ్ రెడ్డికి ధైర్యం చెప్పారు.



దామోదర్ రెడ్డి పార్థివ దేహానికి తుంగతుర్తిలోని ఆయన నివాసంలో నివాళులర్పిస్తున్న శాసనమండలి చైర్మన్ గుత్తా సుఖేందర్ రెడ్డి, దేవరకొండ ఎమ్మెల్యే బాలు నాయక్

# ఆయత్ ఫౌండేషన్‌కు జాతీయ పురస్కారం

**ఖమ్మం, అక్టోబర్ 4 (సమయం న్యూస్):** ఆయత్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఫౌండేషన్ కు జాతీయ పురస్కారం వరించింది. ఈ సందర్భంగా ఫౌండేషన్ వ్యవస్థాపక అధ్యక్షురాలు డాక్టర్ ఆయేషా సుల్తానా ను ఘనంగా సన్మానించారు. శుక్రవారం సాయంత్రం రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మహానగరంలో ముస్లిం ప్రొఫెషనల్స్ అసోసియేషన్ ( ఏ ఎం పి ) ఆధ్వర్యంలో 5వ నేషనల్ అవార్డ్స్ ఫర్ సోషియల్ ఎక్సలెన్స్ ( ఎన్ ఏ ఎస్ ఈ ) పురస్కారాలను మల్లేపల్లి, అన్వర్ ఉలూమ్ కళాశాల ఆడిటోరియంలో వ్యక్తులు సంస్థలకు అందజేశారు.. సామాజిక సేవ, విద్య, మానవతా రంగాల్లో విశేష కృషి చేసిన జాతీయ స్థాయి సంస్థలు, వ్యక్తులను ఈ వేడుకలో సత్కరించారు. రాష్ట్రానికి చెందిన కోతగూడెం పట్టణ కేంద్రంగా పనిచేస్తున్న ఆయత్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఫౌండేషన్ ను ఉత్తమ స్వచ్ఛంద సంస్థగా తెలంగాణ రాష్ట్రం నుండి ఎంపిక చేశారు. ఈ ఫౌండేషన్ వ్యవస్థాపకురాలు, అధ్యక్షురాలు డా. ఆయేషా సుల్తానా నేతృత్వంలో, తక్కువ సమయంలోనే వెనుకబడిన వర్గాలకు విద్యా, మైనారిటీల అభ్యున్నతి, మహిళల ప్రతిభ , సామాజిక సేవలో విశేష ప్రభావం చూపింది. గత ఏడాది కాలంలోనే 7,500 మందికి పైగా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చిన ఈ సంస్థ , పలు కార్యక్రమాలు నిర్వహించింది.... వాటిలో: విద్యా ,కుర్‌ఆన్ బోధనలు ,స్పోకెన్ ఇంగ్లీష్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్, టైమ్ మేనేజ్‌మెంట్ శిక్షణ, యువతకు జీవన పాఠాలు, కెరీర్ గైడెన్స్, పేదలకు వైద్య సహాయం, విద్యా సహాయం, ఆహార పంపిణీవరద బాధితులకు సహాయం, దుప్పట్ల పంపిణీ, జకాత్ పంపిణీ. అదనంగా, మహిళల కోసం ప్రత్యేకంగా రూపొందించిన ఆన్‌లైన్ ఎడ్యుకేషన్ ప్రోగ్రామ్‌లో ఒక్క ఏడాదిలోనే 1,500 మందికి పైగా మహిళలు పాల్గొని కొత్త నైపుణ్యాలు అలవర్చుకున్నారు. ఈ సందర్భంగా, ఆయత్ ఎడ్యుకేషన్ అండ్ వెల్ఫేర్ ఫౌండేషన్ తో పాటు జాతీయ స్థాయిలో




హ్యూమన్ వెల్ఫేర్ ఫౌండేషన్ ( ఢిల్లీ ), జమియత్ ఉలేమా ఏ హింద్ ట్రస్ట్ ( ఢిల్లీ ) , సహాయతా ట్రస్ట్ ( హైదరాబాద్ ), కర్ణాటక మైనారిటీస్ కమిషన్ ( బెంగళూరు ), హుదావిస్ అసోసియేషన్ ( కేరళ ) పయాం-ఇ-ఇన్సానియత్ ఫౌండేషన్ ( లక్నో ), ప్రెస్టీజ్ ఫౌండేషన్ (బెంగళూరు), ఆల్ ఇండియా మెమన్ జమాత్ ఫెడరేషన్ (ముంబాయి), ఇమారత్ షరియత్ ( పాట్నా ), వెస్ట్ బెంగాల్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ( కోల్ కతా ) వంటి 10 ప్రతిష్టాత్మక సంస్థలకు జాతీయ అవార్డులు అందించారు. ఇదే సమయంలో ముగ్గురు విశిష్ట వ్యక్తులకు లైఫ్‌టైమ్ అచీవ్‌మెంట్ అవార్డులు ప్రదానం చేశారు. వారిలో హైదరాబాద్ జకాత్ ట్రస్ట్ పేరుతో ప్రసిద్ధిగాంచిన దివంగత ఘియాసుద్దీన్ బాబుఖాన్ (హైదరాబాద్ బి దాత, సేవకుడు) డాక్టర్ పిఏ ఇనామ్‌దార్ (పుణే-విద్యావేత్త, సంస్థాపకుడు ),మహ్మద్ వజీర్ అన్సారీ,( ఐపీఎస్ రిటైర్డ్) - సామాజిక సేవకుడు, భోపాల్ ) ఉన్నారు. మొత్తంగా 10 జాతీయ అవార్డులు, 5 ప్రత్యేక విభాగాల అవార్డులు, 100 రాష్ట్ర స్థాయి ఎన్జీవోలు, 100 వ్యక్తిగత చేంజ్ మేకర్స్‌ను ఏ ఎం పి ఘనంగా సన్మానించారు . ఈ వేడుకలో భాగంగా ఏఎంపి నేషనల్ టాలెంట్ సెర్చ్ ( ఎన్ టి ఎస్ ) 2025 ను గ్రాండ్ లాంచ్ చేశారు. ఈ ఏడాది 20,000 విద్యాసంస్థల నుండి 2 లక్షలకుపైగా విద్యార్థులు 400 జిల్లాల్లోని 1200 కేంద్రాల్లో పరీక్షలకు హాజరుకానున్నారు. 300 మందికి పైగా ప్రముఖులు, సామాజిక నాయకులు, విద్యావేత్తలు, వ్యాపారవేత్తలు పాల్గొన్న ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా ఆల్ ఇండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ( ఏ ఐ ఎం పి ఎల్ బి ) చైర్మన్ మౌలానా సైఫుల్ల రహమనీ , తెలంగాణ వక్ఫ్ బోర్డు చైర్మన్ అజ్మతుల్లా , రిటైర్డ్ ఐపీఎస్ హౌసాఫ్ సయ్యద్ సాహెబ్ , ప్రొఫెసర్లు బేక్ సాహెబ్ లు పాల్గొన్నారు. ఆయత్ ఫౌండేషన్‌కు లభించిన ఈ గుర్తింపు తెలంగాణాకు గర్వకారణంగా నిలిచింది.

# ఎన్నికల నిర్వహణ కోసం ఏర్పాట్లు

### జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్

**బెల్లంపల్లి, అక్టోబర్ 4 (సమయం న్యూస్):** 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నిర్వహణ కోసం పూర్తి స్థాయిలో ఏర్పాట్లు చేయడం జరుగుతుందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శనివారం బెల్లంపల్లి పట్టణంలో గల తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల బాలుర పాఠశాల, కళాశాల (సెంటర్ ఆఫ్ ఎక్సలెన్సీ)లో, బజార్ ఏరియాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల్లో ఏర్పాట్లను డీసీపీ ఎ భాస్కర్ లతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పంచాయితీ ఎన్నికల నేపథ్యంలో ఎన్నికల ప్రవర్తన నియమావళి తూచతప్పకుండా అమలు చేయాలని ఆదేశించారు. ఎన్నికల నిర్వహణ సజావుగా సాగేలా ఏర్పాట్లు చేయాలని సూచించారు. సాధారణ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని 16 జెడ్పీటీసీ, 129 ఎంపీటీసీ స్థానాలకు రెండు విడతల్లో, 306 సర్పంచ్, 2,680 వార్డు సభ్యుల స్థానాలకు మూడు విడతల్లో ఎన్నికలు నిర్వహించడం జరుగుతుందని పేర్కొన్నారు. ఎన్నికల నిర్వహణ కోసం జిల్లాలో అన్ని ఏర్పాట్లు చేయడం జరిగిందని, మండల స్థాయిలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలు కోసం మండల తహశీల్దార్లను నోడల్ అధికారులుగా నియమించడం జరిగిందని అన్నారు. నామినేషన్ ప్రక్రియ మొదలైనప్పటి నుంచి ఓట్ల లెక్కింపు ప్రక్రియ పూర్తయి ఫలితాలు వెలువడే వరకు ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉంటుందని పేర్కొన్నారు. ప్రతిఒక్కరూ నియమావళికి లోబడి ఉండాలన్నారు. ఎన్నికల నిబంధనలను ఉల్లంఘిస్తే తగు చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# "వేస్ట్ టు వండర్" ప్రదర్శన ప్రారంభం

**ఆదిలాబాద్, అక్టోబర్ 4 (సమయం న్యూస్):** "వేస్ట్ టు వండర్" ప్రదర్శనను జిల్లా కలెక్టర్ రాజర్షిషా శనివారం ప్రారంభించారు. గాంధీ జయంతి సందర్భంగా గాంధీ పార్క్‌లో ఏర్పాటు చేసిన "వేస్ట్ టు వండర్" ప్రదర్శనలో మున్సిపల్ కార్యాలయ సిబ్బంది ట్రైనీ కలెక్టర్ సలోని పర్యవేక్షణలో మున్సిపల్ సిబ్బంది ప్రదర్శించిన సృజనాత్మకత చూపిన సృజనాత్మకత అందరినీ ఆకట్టుకుంది. వాడిపోయిన నీటి బాటిళ్లు, కూల్‌డ్రింక్ బాటిళ్లు, పాడైపోయిన వాహన చక్రాలు తదితర వ్యర్థ వస్తువులను వినూత్న శిల్పాలుగా, ఆకర్షణీయ నమూనాలుగా మార్చి వినూత్నంగా తయారు చేశారు. మున్సిపల్ సిబ్బంది చూపిన అభిరుచి తీరును ప్రశంసించారు. వ్యర్థాలను అద్భుతాలుగా మారుస్తూ పర్యావరణ పరిరక్షణకు దోహదపడే ఇలాంటి ప్రదర్శనలు ప్రతి పట్టణంలో ఏర్పాటు కావాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమం ద్వారా "వృథా అనే మాటకు అర్థమే మారిపోతుంది" అనే సందేశం వినూత్నంగా ప్రజల్లోకి వెళ్ళిందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీవిఎన్ రాజు, ఎస్సీ కార్పోరేషన్ ఈడి, మనోహర్, తదితరులు పాల్గొన్నారు.



# ఏజెన్సీ ప్రాంత ప్రజలకు అందుబాటులో ఉంటాం

**భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్**

**చర్ల, అక్టోబర్ 4 (సమయం న్యూస్):** భద్రాచలం జిల్లాలోని ఏజెన్సీ ప్రాంత ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని భద్రాచలం ఏఎస్పీ విక్రాంత్ కుమార్ సింగ్ భరోసా కల్పించారు. ఎస్పీ రోహిత్ రాజు ఆదేశాల మేరకు సీఆర్పీఎఫ్ కంపెనీ కమాండర్ సెబాస్టియన్, చర్ల సీఐ రాజు వర్మ, ఇతర పోలీస్ అధికారులు, సిబ్బందితో కలిసి చర్ల మండలంలోని ఛత్తీస్‌గఢ్ రాష్ట్ర సరిహద్దు గ్రామాలైన బట్టిగూడెం, బత్తినపల్లి, రామచంద్రాపురం





గ్రామాలను ఆయన సందర్శించారు. ఈ మావోయిస్ట్ ప్రభావిత మూడు గ్రామాల్లోని 120 కుటుంబాలను సందర్శించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో నివసిస్తున్న ఈ మూడు గ్రామాల ప్రజలకు నెస్లే కంపెనీ వారి సహకారంతో నిత్యావసర వస్తువులను అందించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ ఎస్పీ సారథ్యంలో ఏజెన్సీ ప్రజలకు పోలీస్ శాఖ ఎల్లప్పుడూ అందుబాటులో ఉంటుందని, మావోయిస్ట్ ప్రభావిత ప్రాంతాల్లో నివసించే ఆదివాసీలకు విద్య,వైద్యం,రవాణా వంటి కనీస సౌకర్యాలను కల్పించడమే లక్ష్యంగా పనిచేస్తున్నామని అన్నారు.ఇందులో భాగంగానే జిల్లాలో ఏజెన్సీ ప్రాంతాల్లో ఇప్పటివరకు ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలను చేపట్టడం జరిగిందని తెలిపారు.వరద ప్రభావిత ప్రాంతాల్లో నివసించే అదీవాసీ ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు.వర్షాల అనంతరం పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు.డెంగీ,మలేరియా వంటి విషజ్వరాల బారిన పడకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. అభివృద్ధి నిరోధకులైన నిషేధిత మావోయిస్టులకు ఎవ్వరూ సహకరించవద్దని కోరారు. ప్రత్యక్షంగానైనా, పరోక్షంగానైనా మావోయిస్టులకు సహకరిస్తే,అట్టి వారిపై చట్టపరంగా కఠిన చర్యలు తీసుకొనబడతాయని అన్నారు.మారుమూల ఏజెన్సీ ప్రజలకు నిత్యావసర వస్తువులను అందించడానికి ముందుకొచ్చిన నెస్లే కంపెనీ వారికి ఈ సందర్భంగా ప్రత్యేక ధన్యవాదములు తెలిపారు.

# ఎన్నికల విధుల పట్ల అవగాహన ఉండాలి

- **రిటర్నింగ్, సహాయ రిటర్నింగ్ అధికారుల శిక్షణ తరగతుల్లో కలెక్టర్**



**నిజామాబాద్, అక్టోబర్ 4 (సమయం న్యూస్):** ఎన్నికల విధుల పట్ల పరిపూర్ణ అవగాహన కలిగి ఉండాలని, స్థానిక సంస్థల ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో, సమర్థవం తంగా నిర్వహించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సూచిం చారు. ఎంపీటీసీ, జెడ్పీటీసీ ఎన్నికలకు సంబంధించిన రిటర్నింగ్ అధికారులు, సహాయ రిటర్నింగ్ అధికారులకు సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయ సమావేశ మందిరంలో శనివారం శిక్షణ తరగతులు నిర్వహించారు. నామినేషన్ల స్వీకరణ, పరిశీలన, ఉపసంహరణ, అభ్యర్థుల తుది జాబితా ప్రకటన, పోటీలో ఉన్న అభ్యర్థులకు గుర్తుల కేటాయింపు, ఏజెంట్ల నియామకం, పోస్టల్ బ్యాలెట్ తదితర అంశాలపై మాస్టర్ ట్రైనర్లచే అవగాహన కలిపించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎం.పీ.టీ.సీ, జెడ్.పీ.టీ.సీ ఎన్నికల నిర్వహణ కోసం ముందస్తుగానే అన్ని ఏర్పాట్లను పూర్తి చేసుకోవాలని సూచించారు. నియమ, నిబంధనలపై పూర్తి అవగాహనను ఏర్పర్చుకోవాలని, ఎలాంటి వివాదాలు, తప్పిదాలకు తావులేకుండా నిబంధలను తు.చ తప్పకుండా పాటిస్తూ ఎన్నికల విధులను ఎంతో జాగ్రత్తగా, పూర్తి పారదర్శకంగా నిర్వర్తించాలని హితవు పలికారు. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణలో రిటర్నింగ్ అధికారులు క్రియాశీలక పాత్ర పోషించాల్సి ఉంటుందన్నారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ప్రకటనను అనుసరిస్తూ ఆర్.ఓలు నోటిఫికేషన్ జారీ చేసి, ఆ రోజు నుండే ప్రాదేశిక నియోజకవర్గ స్థానాల ఎన్నిక కోసం నామినేషన్లు స్వీకరించాల్సి ఉంటుందని తెలిపారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నామినేషన్ల స్వీకరణ ప్రక్రియకు సంబంధించి నోటిఫికేషన్ లో స్పష్టంగా వివరాలను పొందుపర్చాలని అన్నారు. నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను మార్గదర్శకాలకు అనుగుణంగా నిర్వహించాలని, సమయ పాలనను పక్కాగా పాటించాలన్నారు. నామినేషన్లు దాఖలు చేసేందుకు వచ్చే అభ్యర్థులతో పాటు వారి ప్రతిపాదకులు స్థానికులేనా అన్నది ఓటరు జాబితా ఆధారంగా నిర్ధారణ చేసుకోవాలని సూచించారు. అభ్యర్థి సహా ముగ్గురిని మాత్రమే లోనికి అనుమతించాలని అన్నారు. నామినేషన్ల ఉపసంహరణ కోసం అభ్యర్థులు కాకుండా, వారి తరపున ప్రతిపాదకులు వచ్చిన సమయంలో మరిన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ప్రతి అంశాన్ని క్షుణ్ణంగా పరిశీలించిన తరువాతనే ఉపసంహరణకు అనుమతించాలని కలెక్టర్ సూచించారు. బ్యాలెట్ పేపర్ లో అభ్యర్థుల పేర్లను తెలుగు అక్షర క్రమం ఆధారంగా వరుసగా ముద్రించాల్సి ఉంటుందని అన్నారు. అభ్యర్థులు ఎన్ని సెట్ల నామినేషన్లు సమర్పిస్తే, అన్ని నామినేషన్ల దరఖాస్తులను తప్పనిసరిగా పరిశీలించాలని, వాటిలో ఎన్ని ఆమోదించబడ్డాయి, ఎన్ని తిరస్కరణకు గురయ్యాయి, అందుకు గల కారణాలు ఏమిటీ అనే అంశాలను వెల్లడించాల్సి ఉంటుందని తెలిపారు. నామినేషన్లను నిబంధనలకు అనుగుణంగా సరైన పద్ధతిలో సమర్పించేలా అభ్యర్థులకు సహకారం అందించేందుకు హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఆర్.ఓ, ఏ.ఆర్.ఓల సందేహాలను నివృత్తి చేసేందుకు వీలుగా జెడ్పీ సీ.ఈ.ఓ కార్యాలయంలో కూడా హెల్ప్ డెస్క్ ఏర్పాటు చేయాలని కలెక్టర్ ఆదేశించారు. నోటిఫికేషన్ జారీ చేయడానికి ముందే మాక్ నామినేషన్ ప్రక్రియను నిర్వహించుకోవాలని, దీనివల్ల ఎన్నికల నిర్వహణలో తప్పిదాలకు తావులేకుండా జాగ్రత్త పడవచ్చని హితవు పలికారు. నోటిఫికేషన్ జారీ చేసిన నాటి నుండి ప్రతి రోజు త్వరితగతిన డైలీ రిపోర్టును పంపించాలని, సంబంధిత వెబ్ సైట్లో అభ్యర్థుల నామినేషన్ పత్రాలను స్కాన్ చేసి అప్లోడ్ చేయాలని సూచించారు. నామినేషన్ల స్వీకరణ చివరి సమయంలో, విత్ డ్రా సమయాల్లో వీడియో చిత్రీకరణ చేయిస్తే, అవి తగిన ఆధారాలుగా ఉపయోగపడతాయని తెలిపారు. నామినేషన్ల ప్రక్రియ నిబంధనలకు అనుగుణంగా పక్కాగా జరిగితే, పోలింగ్, కౌంటింగ్ ప్రక్రియలు సజావుగా జరిగేందుకు అవకాశం ఉంటుందన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకుని నోటిఫికేషన్ జారీ, నామినేషన్ల స్వీకరణ, స్క్రూటినీ, ఉపసంహరణ ప్రక్రియలను సమర్థవంతంగా నిర్వహించాలని ఆర్.ఓలు, సహాయ ఆర్.ఓలకు కలెక్టర్ మార్గనిర్దేశం చేశారు. ఎన్నికల నిర్వహణకు సంబంధించి ఎలాంటి సందేహాలు ఉన్నా, ఏమాత్రం సంకోచించకుండా పై అధికారులను సంప్రదించి నివృత్తి చేసుకోవాలని సూచించారు. ఏ దశలోనూ సొంత నిర్ణయాలు తీసుకోకుండా, రాష్ట్ర ఎన్నికల కమిషన్ నిర్దేశించిన మార్గదర్శకాలకు అనుగుణంగా విధులు నిర్వర్తిస్తూ స్థానిక సంస్థల ఎన్నికల ప్రక్రియను సాఫీగా పూర్తి చేయాలని అన్నారు. శిక్షణ అదనపు కలెక్టర్ అంకిత్, జెడ్పీ సీ.ఈ.ఓ సాయాగౌడ్, డిప్యూటీ సీ.ఈ.ఓ సాయన్న, డీ.ఈ.ఓ అశోక్, హౌసింగ్ పీ.డీ పవన్ కుమార్, ఆర్.ఓలు, సహాయ ఆర్.ఓలు పాల్గొన్నారు.

# కాంగ్రెస్ బాకీ కార్డుతో ఇంటింట ప్రచారం

**భూపాలపల్లి (గొర్లవీడు), అక్టోబర్ 4 (సమయం న్యూస్):** బీఆర్ఎస్ పార్టీ కార్యనిర్వాక అధ్యక్షుడు కేటీఆర్ పిలుపుమేరకు శనివారం భూపాలపల్లి నియోజకవర్గంలో గొర్లవీడు గ్రామంలో కాంగ్రెస్ బాకీ కార్డు గురించి రాష్ట్ర కార్పొరేషన్ మాజీ చైర్మన్, రాష్ట్ర పార్టీ సీనియర్ నాయకుడు డాక్టర్ కేతిరెడ్డి వాసుదేవరెడ్డి ఇంటింటా ప్రచారం చేశారు. కాంగ్రెస్ బాకీ కార్డులను పంచుతూ, ప్రజలకు కాంగ్రెస్ ప్రభుత్వం ఎంత బాకీ పడ్డదో తెలియజేస్తూ ముందుకు సాగారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ అసెంబ్లీ ఎన్నికల సమయంలో ఆపదమొక్కులు మొక్కి గ్యారెంటీ కార్డులంటు ప్రజలను మోసం చేసి, బాండ్ పేపర్ల పై సంతకాలు పెట్టిన పేపర్స్ ఇంటింటికి ఇచ్చి 6 గ్యారెంటీలు, 13 అంశాలు 100 రోజులు చేస్తానని చెప్పి ఇవి కాకుండా 420 హామీలు ఇచ్చి ప్రజలను మోసం చేసిన దగా ప్రభుత్వం కాంగ్రెస్. కాంగ్రెస్ పార్టీ అభయా అస్త్రం పేరుతో ప్రజలపై భస్మాసుర అస్త్రం పెట్టింది. కాంగ్రెస్ చేసిన మోసం ప్రజలు స్థానిక సంస్థల ఎన్నికల్లో ఇంటికి వచ్చే కాంగ్రెస్ నాయకులను నిలదీయాలి. బీఆర్ఎస్ పార్టీ బ్రహ్మాస్త్రం కాంగ్రెస్ బాకీ కార్డు.. 100 రోజుల్లో చేస్తానన్న హామీలు నిలుపుకోలేక 700 రోజులైనా ఇచ్చిన హామీను నెరవేర్చడంలో వైఫల్యం చెందింది. ఆరు గ్యారంటీలకు చట్టబద్ధత చేస్తానని నాడు అసెంబ్లీ ఎన్నికల ముందు కాంగ్రెస్ నాయకులు ఊకదంపుడు ప్రసంగాలు చేసి నేడు ముఖం చాటేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం 22 నెలల్లో అన్ని వర్గాలకు బాకీ పడ్డ బకాయిలను వెంటనే చెల్లించి ఓటు అడగాలి లేకపోతే గ్రామాల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులను తరిమికొట్టే పరిస్థితి దాపురించింది. మోసపోతే గూసుపడతాం. మళ్లీ మోసపోకుండా ఉండాలంటే భవిష్యత్తులో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీ నాయకులను బకాయి కార్డు చూపిస్తూ, బకాయిలను ఇచ్చాకనే ఓటు అడగాలని నిలదీయాలని పిలుపునిచ్చారు.






## ఫాస్టాగ్ లేని వాహనదారులకు గుడ్ న్యూస్

న్యూ ఢిల్లీ, అక్టోబర్ 4 (సమయం న్యూస్): జాతీయ రహదారులపై ఫాస్టాగ్ చెల్లింపుల విషయంలో కేంద్రం కొత్త నిబంధనలు ప్రవేశ పెట్టింది.. ఇప్పటి వరకు ఫాస్టాగ్ లేకపోతే వాహనదారులు టోల్ వద్ద రెండింతలు చెల్లించాల్సి ఉండేది. ఇకపై కూడా నగదు చెల్లిస్తే రెండింతలే.. కానీ, యూపీఐ ద్వారా చెల్లిస్తే కేవలం 1.25 రెట్లు మాత్రమే చెల్లిస్తే సరి పోతుంది. ఉదాహరణకు, ఫాస్టాగ్ వాహనదారులు రూ. 100 చెల్లిస్తే, ఫాస్టాగ్ లేని వారు నగదుగా రూ. 200, యూపీఐ ద్వారా అయితే రూ. 125 చెల్లించాలి. నిబంధనలు నవంబర్ 15 నుంచి అమల్లోకి రానున్నాయి..



## దుర్గామాత మండపాలను దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే నన్నపనేని నరేందర్

**వరంగల్, అక్టోబర్ 4 (సమయం న్యూస్):** వరంగల్‌లోని 27, 32, 40 డివిజన్లలో కొలువుదీరిన దుర్గామాత విగ్రహాలను వరంగల్ తూర్పు నియోజకవర్గ మాజీ ఎమ్మెల్యే, మాజీ మేయర్ నన్నపనేని నరేందర్ శనివారం దర్శించుకున్నారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేశారు. ఆయన వెంట పలు డివిజన్ల ముఖ్యనాయకులు, మహిళలు, స్థానికులు తదితరులు ఉన్నారు.

## ఎన్నికల నిర్వహణలో భాగంగా సహాయక కేంద్రం ఏర్పాటు

**జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్**



**మంచిర్యాల, అక్టోబర్ 4 (సమయం న్యూస్):** 2వ సాధారణ పంచాయతీ ఎన్నికల నిర్వహణలో భాగంగా జిల్లాలోని నస్పూర్‌లో గల సమీకృత జిల్లా కార్యాలయాల భవన సముదాయంలో సహాయక కేంద్రం ఏర్పాటు చేయడం జరిగిందని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ కుమార్ దీపక్ ఒక ప్రకటనలో తెలిపారు. ఇందు లో భాగంగా జిల్లాలో మండల ప్రజా పరిషత్, జిల్లా ప్రజా పరిషత్ ఎన్నికల దృష్ట్యా నామినేషన్లు, పరిశీలన, ఉపసంహరణ, అభ్యర్థుల తుది జాబితా, పోలింగ్ కేంద్రాలు, పోలింగ్, పోస్టల్ బ్యాలెట్ ఇతర ఎన్నికలకు సంబంధించి సమాచారం, ఫిర్యాదులు, ఇతర దరఖాస్తుల కోసం హెల్ప్ లైన్ నం.08736- 250501 ఏర్పాటు చేయడం జరిగిందని పేర్కొన్నారు. 24 గంటల పాటు సహాయక కేంద్రం సేవలు అందుబాటులో ఉంటాయని తెలిపారు. ఎన్నికల సందర్భంగా ప్రవర్తన నియమావళి అమలులో ఉందని, నిబంధనల ఉల్లంఘనకు సంబంధించి సహాయక కేంద్రం నంబర్‌లో సమాచారం అందిం చవచ్చని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచడం జరుగుతుందని వివరించారు.

## ఏ క్షణంలోనైనా బీహార్ ఎన్నికల షెడ్యూల్



**న్యూ ఢిల్లీ, అక్టోబర్ 4 (సమయం న్యూస్):** బీహార్ అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా అధికారిక సన్నద్ధత ప్రారంభం అయ్యింది.. ఎన్నికల సన్నద్ధతను పరిశీలించేందుకు రాష్ట్ర పర్యటనకు వెళ్లనున్న కేంద్ర ఎన్నికల సంఘం ప్రధానాధికారి జ్ఞానేశ్ కుమార్ రెండు రోజుల పాటు పాట్నాలో ఉంటారు. అధికారుల పర్యటనలో ఎన్నికల నిర్వహణ, మోనిటరింగ్, సురక్షా ఏర్పాట్లు, ఓటర్లందరికీ సౌకర్యాలు వంటి అంశాలను సమీక్షించే అవకాశముందని అధికారులు తెలిపారు. అలాగే ఏ క్షణంలో నైనా బీహార్ ఎన్నికలకు షెడ్యూల్ విడుదల చేస్తారని సమాచారం.

బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేల సమావేశం

%-% పాల్గొన్న పట్నం నరేందర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి, కొప్పుల మహేశ్ రెడ్డి

వికారాబాద్, అక్టోబర్ 4 (సమయం న్యూస్): బీఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ నివాసంలో శనివారం తాండూరు, కొడంగల్, పరిగి మాజీ ఎమ్మెల్యేలు పైలెట్ రోహిత్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డి, కొప్పుల మహేష్ రెడ్డి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు వికారాబాద్ జిల్లా ప్రస్తుత రాజకీయాలు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపైన సుదీర్ఘంగా చర్చించారు. వికారాబాద్ జడ్పీ స్థానం బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని, అత్యధిక ఎంపీపీ స్థానాలు సొంతం చేసుకుని మరొక్కసారి సత్తా చాటుతామని వారు ధీమా వ్యక్తం చేశారు.

## కుటుంబ వ్యవస్థను కాపాడాల్సిన బాధ్యత మనపై ఉంది : క్రైమ్ ఏసీపీ



**వరంగల్, అక్టోబర్ 4 (సమయం న్యూస్):** కుటుంబ వ్యవస్థను పరిరక్షించాల్సిన బాధ్యత మహిళా పోలీసులపై అధికారులపై వుందని క్రైం ఏసీపీ మహిళా పోలీస్ స్టేషన్ 1 ఇన్స్ స్పెక్టర్ కు సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా క్రైం ఏసీపీ శనివారం రంగం పేట లోని వరంగల్ మహిళా పోలీస్ స్టేషన్ 1 సందర్శించారు. తనిఖీల్లో భాగం స్టేషన్ సంబంధించిన రికార్థులను పరిశీలించడం తో పాటు కేసులకు సంబంధించిన సిడి ఫైల్స్ లను పరిశీలించడంతో పెండింగ్ కేసులు, ప్రస్తుతం దర్యాప్తులో కేసులు, నిందితుల అరెస్ట్ సంబంధించిన వివరాలను స్టేషన్ ఇన్స్ స్పెక్టర్ సూర్యప్రసాద్ అడిగి తెలుసుకున్నారు. అనంతరం శాఖపరమైన సమస్యలపై స్టేషన్ సిబ్బంది ని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడుతూ భార్య భర్తల మధ్య జరిగే గోడవలపై స్టేషన్ కు వచ్చే బాధితులకు సరైన కౌన్సిలింగ్ నిర్వహించి భార్య భర్త మధ్య సఖ్యతను కుదర్చడమే మన లక్ష్యం పనిచేయాలని, అలాగే మహిళా బాధితులకు సరైన రీతిలో న్యాయం కూడా అందించాలని ఏసీపీ తెలియజేసారు.

05-10-25 Samayam_Layout 1 10/5/2025 5:52 AM Page 8



# ఎన్నికలు ముగిసేవరకు ప్రజావాణి రద్దు: కలెక్టర్ ప్రావీణ్య



**సంగారెడ్డి, అక్టోబర్ 4 (సమయం న్యూస్):** జడ్పీటీసీ, ఎంపీటీసీ ,గ్రామ పంచాయతీ ఎన్నికల నేపథ్యంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమాన్ని రద్దు చేస్తున్నట్లు కలెక్టర్ పి. ప్రావీణ్య శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల షెడ్యూల్ ప్రకటించడంతో మోడల్ కోడ్ ఆఫ్ కండక్ట్ అమల్లోకి వచ్చినందున ఈ నిర్ణయం తీసుకున్నట్లు పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియ పూర్తయిన అనంతరం యధావిధిగా ప్రజావాణి కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని తెలియజేశారు. ఇట్టి విషయాన్ని ప్రజలు గమనించి సోమవారం నిర్వహించే ప్రజావాణి కార్యక్రమానికి వచ్చి అసౌకర్యానికి గురికాకూడదని కలెక్టర్ సూచించారు.

# బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేల సమావేశం

## పాల్గొన్న పట్నం నరేందర్ రెడ్డి, పైలెట్ రోహిత్ రెడ్డి, కొప్పుల మహేశ్ రెడ్డి



**వికారాబాద్, అక్టోబర్ 4 (సమయం న్యూస్):** బీఆర్ఎస్ వికారాబాద్ జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ నివాసంలో శనివారం తాండూరు, కొడంగల్, పరిగి మాజీ ఎమ్మెల్యేలు పైలెట్ రోహిత్ రెడ్డి, పట్నం నరేందర్ రెడ్డి, కొప్పుల మహేష్ రెడ్డి సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా వారు వికారాబాద్ జిల్లా ప్రస్తుత రాజకీయాలు, రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలపైన సుదీర్ఘంగా చర్చించారు. వికారాబాద్ జడ్పీ స్థానం బీఆర్ఎస్ కైవసం చేసుకుంటుందని, అత్యధిక ఎంపీపీ స్థానాలు సొంతం చేసుకుని మరొక్కసారి సత్తా చాటుతామని వారు ధీమా వ్యక్తం చేశారు.

# ఎన్నికల ఏర్పాట్లు పక్కాగా ఉండాలి

## జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్



**జనగాం, అక్టోబర్ 4 (సమయం న్యూస్):** జడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్ ఎన్నికల కు సంబంధించిన అన్ని ఏర్పాట్లు పక్కాగా ఉండాలని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల కోసం ఏకాశీల బీఈడీ కాలేజ్, ఏబీవీ, వీబీఐటీ కాలేజీలు, జనగామ మండలం సంబంధించి డిస్ట్రిబ్యూషన్, రిసెప్షన్ కేంద్రం కోసం స్థానిక గౌతమ్ మాడల్ స్కూల్ ను డీసీపీ రాజమహేంద్ర నాయక్, ఏసీపీ పండరి చేతన్, సంబంధిత అధికారులతో కలిసి శనివారం జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఎన్నికల సంఘం నియమాలకు అనుగుణంగా డిస్ట్రిబ్యూషన్, కౌంటింగ్, స్ట్రాంగ్ రూమ్ లు ఉండాలన్నారు. స్ట్రాంగ్ రూమ్, కౌంటింగ్ కేంద్రాల వద్ద చేయాలిసిన ఏర్పాట్లు, వసతులను పరిశీలించి అధికారులకు సూచనలు చేశారు. పోలీస్ బందోబస్తు, రవాణా, పార్కింగ్ సదుపాయాలతో పాటు, భద్రతాపరమైన అంశాలను సంబంధిత అధికారులతో కలెక్టర్ చర్చించారు. ఈ కార్యక్రమం లో జనగామ ఎంపీడీఓ, వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

# ప్రభుత్వ ఆస్పత్రులలో సాధారణ ప్రసవాలు పెరగాలి

## కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్



**సూర్యాపేట, అక్టోబర్ 4 (సమయం న్యూస్):** ప్రభుత్వ ఆస్పత్రుల్లో సాధారణ ప్రసవాలు పెంచేలా చూడాలని, గర్భిణులకు సైతం అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ పేర్కొన్నారు. శనివారం ఆయన అర్వపల్లి ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా తనిఖీ చేశారు. ఆరోగ్య సిబ్బంది సమయపాలన పాటించి ప్రజలకు అందుబాటులో ఉండి వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.పి హెచ్ సి ద్వారా ప్రజలకు అందుతున్న ఆరోగ్య సేవల గురించి డాక్టర్ భూక్య నగేష్ నాయక్ ను అడిగి తెలుసుకున్నారు. తదుపరి రిజిస్టర్స్, రికార్డ్ లను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. కలెక్టర్ వెంట తహసీల్దార్ శ్రీకాంత్, ఆరోగ్య సిబ్బంది ఉన్నారు.

# రైతులకు మద్దతు ధర లభించేలా కార్యాచరణ

## ● అదనపు కలెక్టర్ శ్రీనివాస రెడ్డి





**ఖమ్మం, అక్టోబర్ 4 (సమయం న్యూస్) :** పత్తి, ధాన్యం పండించిన రైతులకు మద్దతు ధర లభించేలా పటిష్ట కార్యాచరణ అమలు చేయాలని అదనపు కలెక్టర్ పి. శ్రీనివాస రెడ్డి అన్నారు.కలెక్టరేట్ సమావేశ మందిరంలో వానాకాలం ధాన్యం కొనుగోలు సన్నద్ధతపై, కపాస్ కిసాన్ యాప్ పై శనివారం సంబంధిత అధికారులకు నిర్వహించిన శిక్షణా కార్యక్రమంలో అదనపు కలెక్టర్ పాల్గొని,మాట్లాడుతూ రాబోయే వానాకాలంలో జిల్లాకు సంబంధించి 2 లక్షల 60 వేల మెట్రిక్ టన్నుల సన్న ధాన్యం, 40 వేల మెట్రిక్ టన్నుల దొడ్డు ధాన్యం మొత్తం 3 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు లక్ష్యం ఉందని అన్నారు. సన్న ధాన్యం కొనుగోలుతో పాటు 3 నుంచి 4 నెలల లోపు మిల్లింగ్ చేయాల్సిన అవసరం ఉందని అన్నారు.తూర్పారా పట్టిన తర్వాత నాణ్యమైన ధాన్యాన్ని మాత్రమే కొనుగోలు చేయాలని అన్నారు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన యంత్రాలను అందుబాటులో పెట్టాలని అదనపు కలెక్టర్ అధికారులను ఆదేశించారు. రైతులు కొనుగోలు కేంద్రాలకు క్రమ పద్ధతిలో వచ్చేలా చూడాలని అన్నారు. ప్రతి క్లస్టర్ పరిధిలో ఉన్న కొనుగోలు కేంద్రాల్లో ధాన్యాన్ని ఏ.ఈ.ఓ. సర్టిఫై చేయాలని అన్నారు. ధాన్యం కోతలు క్రమ పద్ధతిలో జరిగేలా చూడాలని, హార్వెస్టర్ల పనితీరు సరిగా ఉండేలా ఏఈఓలు పర్యవేక్షించాలని అన్నారు. ప్రతి కొనుగోలు కేంద్రం పరిధిలో అవసరమైన గన్ని బ్యాగులు వారికి కేటాయించిన మిల్లుల నుంచి తెచ్చుకోవాల్సి ఉంటుందని అన్నారు. రైతులకు గన్ని బ్యాగులను ముందే ఇచ్చే పద్దతి మారాలని అన్నారు. జిల్లాలో అవసరమైన మేర టార్పాలిన్ కవర్లు అందుబాటులో ఉన్నాయని, ప్రతి సెంటర్ వద్ద గన్ని బ్యాగులు, టార్పాలిన్ కవర్లు, తేమ యంత్రాలు అందుబాటులో పెట్టాలని అన్నారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద మిల్లర్లను ఎట్టి పరిస్థితుల్లో అనుమతించవద్దని అదనపు కలెక్టర్ స్పష్టం చేశారు. పత్తి కొనుగోలు సులభతరం చేసే కపాస్ కిసాన్ యాప్ పై రైతులకు అవగాహన కల్పించాలని అదనపు కలెక్టర్ సూచించారు.మార్కెటింగ్ ప్రాంతీయ డిప్యూటీ డైరెక్టర్ పద్మావతి మాట్లాడుతూ బహిరంగ మార్కెట్ లో పత్తి ధర పడిపోతున్న నేపథ్యంలో కనీస మద్దతు ధర చెల్లించి సిసిఐ ద్వారా కొనుగోలు చేసేందుకు కార్యాచరణ సిద్ధం చేశామని అన్నారు. నాణ్యమైన పత్తి పంట (8 శాతం తేమ) క్వింటాల్ 8110 రూపాయల మద్దతు ధర చెల్లిస్తుందని అన్నారు. తేమ శాతం తగ్గుతూ ఉంటే మద్దతు ధర తగ్గుతుందని దీనిపై వ్యవసాయ అధికారులు అవగాహన కల్పించాలని అన్నారు. పత్తి రైతులు మార్కెట్ కు వచ్చి ఇబ్బందులు పడకుండా ఇంటి వద్ద నుంచి స్లాట్ బుక్ చేసుకునే విధంగా కపాస్ కిసాన్ యాప్ లో సౌకర్యం కల్పించామని అన్నారు. పత్తి కొనుగోలు సంబంధిత సేవలకు రైతులు టోల్ ఫ్రీ నెంబర్ 18005995779, వాట్సాప్ సేవలకు 8897281111 లలో సంప్రదించాలని తెలిపారు. అనంతరం మండలాల వారీగా కొనుగోలు కేంద్రాలలో ఉన్న సమస్యల గురించి తెలుసుకొని వాటి పరిష్కారానికి ఆదనపు కలెక్టర్ పలు సూచనలు చేశారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా పత్తి కొనుగోలు, కపాస్ కిసాన్ యాప్ పై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు వివరించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి డి. పుల్లయ్య, జిల్లా మార్కెటింగ్ అధికారి ఎం.ఏ. అలీమ్, జిల్లా పౌర సరఫరాల సంస్థ డి.ఎం. శ్రీలత, సంబంధిత అధికారులు, ఏడిఏలు, ఏఓలు, ఏఈఓలు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల్లో పురోగతి సాధించాలి

## కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి




**నిజామాబాద్, అక్టోబర్ 4 (సమయం న్యూస్):** నిజామాబాద్ జిల్లా కేంద్రంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను వేగవంతం చేయించాలని కలెక్టర్ టి. వినయ్ కృష్ణారెడ్డి అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన జిల్లా కేంద్రంలోని దుబ్బ ప్రాంతంలో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. పునాది దశ వరకు నిర్మాణ పనులు పూర్తి చేసుకున్న లబ్ధిదారులను కలిసి, వారికి మొదటి విడత బిల్లు మంజూరు అయ్యిందా అని ఆరా తీశారు. ఇంకనూ నిర్మాణ పనులు ప్రారంభించని లబ్ధిదారులతో భేటీ అయ్యి, పనులు ఎందుకు ప్రారంభించలేదని కారణాలు అడిగి తెలుసుకున్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు వేగంగా జరిగేలా చొరవ చూపాలని కలెక్టర్ అధికారులకు సూచించారు. లబ్ధిదారుల ఎంపిక, మంజూరీ ప్రక్రియలలో జాప్యానికి తావు లేకుండా చూడాలన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఇల్లు నిర్మించుకునేందుకు అనేక మంది ఆసక్తి చూపుతున్నప్పటికీ, పట్టణ ప్రాంతాల్లో సైతం ఇందిరమ్మ ఇళ్లను అందించాలనే ప్రభుత్వ సంకల్పం మేరకు మున్సిపాలిటీల పరిధిలో కూడా ఇళ్లను మంజూరు చేయడం జరిగిందని అన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని, మంజూరీలు తెలుపబడిన వారందరూ ఇందిరమ్మ ఇళ్లు కట్టుకునేలా ప్రోత్సహించాలని, అవసరమైతే ఇందిరమ్మ కమిటీ సభ్యుల సహకారం తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ఇల్లు నిర్మించుకునే ఆర్థిక స్థోమత లేని లబ్ధిదారులకు మెప్మా ఆధ్వర్యంలో బ్యాంకు లింకేజీ కింద రుణం అందించేలా చొరవ చూపాలని అన్నారు. ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాల ప్రగతిని నిరంతరం పర్యవేక్షణ జరపాలని సూచించారు. ఇళ్ల నిర్మాణాలకు ఏమైనా ఇబ్బందులు ఉంటే వాటిని పరిష్కరించుకుంటూ ముందుకెళ్లాలని, నిర్ణీత లక్ష్యానికి అనుగుణంగా పూర్తిస్థాయిలో ఇళ్ల నిర్మాణాలు జరిగేలా కృషి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రభుత్వ నిబంధనల మేరకు 400 చదరపు అడుగులకు తక్కువ కాకుండా, 600 చదరపు అడుగులకు మించకుండా ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలు చేపట్టేలా లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని, ప్రభుత్వం తరపున అందిస్తున్న తోడ్పాటు గురించి తెలియజేస్తూ, వారు నిర్మాణాలు చేపట్టేలా అవసరమైన సహకారం అందించాలని అన్నారు. ఆయా దశల ఇళ్ల నిర్మాణాలను అనుగుణంగా లబ్ధిదారుల ఖాతాలలో బిల్లులు జమ అయ్యేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఆదేశించారు. తాను తదుపరి తనిఖీలు జరిపే సమయానికి ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలలో స్పష్టమైన పురోగతి కనిపించేలా అంకిత భావంతో కృషి చేయాలని అన్నారు. అలసత్వానికి తావిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

### అభయహస్తం కాలనీ సందర్శన

కాగా, దుబ్బ ప్రాంతంలోని అభయహస్తం కాలనీని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి శనివారం సందర్శించారు. ప్రభుత్వ అసైన్డ్ భూమిని పరిశీలించిన కలెక్టర్, జాయింట్ సర్వే జరిపి హద్దులను నిర్ధారించాలని రెవెన్యూ, మున్సిపల్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ వెంట నగర పాలక సంస్థ కమిషనర్ దిలీప్ కుమార్, హౌసింగ్ పీ.డీ పవన్ కుమార్, డీ.ఈ నివర్తి, మున్సిపల్ టౌన్ ప్రాజెక్టు అధికారి రమేష్, నార్త్ తహసీల్దార్ విజయ్ కాంత్ తదితరులు ఉన్నారు.

# సగర సంఘం రాష్ట్ర అధ్యక్షునికి అరుదైన గౌరవం






## శేఖర్ సగరకు డాక్టరేట్ అవార్డ్ ను ప్రదానం

**న్యూఢిల్లీ, అక్టోబర్ 4 (సమయం న్యూస్):** విద్యార్థి దశ నుంచి ఏబీవీపీ, ఆర్ఎస్ఎస్‌లో నేర్చుకున్న క్రమశిక్షణ, కార్యదీక్ష, జర్నలిస్ట్ గా 25 సంవత్సరాల ప్రయాణంలో తెలంగాణ మలిదశ ఉద్యమంలో తెలంగాణ జర్నలిస్ట్ ఫోరమ్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా, జార్నలిస్టుల సంక్షేమం కోసం తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ రంగారెడ్డి జిల్లా అధ్యక్షులుగా, తన తల్లిదండ్రుల పేరుమీద నెలకొల్పిన బుచ్చమ్మోళ్ళ వెంకటమ్మ పరమయ్య మెమోరియల్ ట్రస్ట్ చైర్మన్ గా పేద విద్యార్థులకు చేసిన సేవలు, తెలంగాణ సగర కులాన్ని జాగృతం చేయడంలో గత 11 సంవత్సరాలుగా నిర్విరామంగా చేస్తున్న సేవలను గుర్తించి అమెరిక క్యాలీపోర్నియా గ్లోబల్ యూనివర్సిటీ గౌరవ డాక్టరేట్ అవార్డ్ ను ప్రదానం చేసింది. దేశ రాజధాని ఢిల్లీ నోయిడా మయూరి విహార్ లోని హోటల్ హాలిడే ఇన్ లో శనివారం జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రముఖ హాలీవుడ్ హీరో రాహుల్ రాయ్ చేతుల మీదుగా అవార్డును అందజేశారు. ఈ సందర్భంగా తెలంగాణ సగర సంఘం రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ ఉప్పరి శేఖర్ సగర కు సగర సంఘం రాష్ట్ర నాయకులు, జిల్లాల నాయకులు, బీసీ సంఘం నాయకులు శుభాకాంక్షలు, అభినందనలు తెలియజేశారు.

# త్వరలో గోదావరి ఫేజ్- 2, 3 పనులు



**హైదరాబాద్, అక్టోబర్ 4 (సమయం న్యూస్):** హైదరాబాద్ నగరానికి 20 టీఎంసీల అదనపు నీటిని తరలించడానికి, మూసీ పునరుజ్జీవనంకోసం జంట జలాశయాలను గోదావరి నీటితో నింపడానికి రూ. 7,360 కోట్ల వ్యయంతో గోదావరి తాగునీటి సరఫరా పథకం ఫేజ్–2%ఈ%3 ప్రాజెక్టు మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, నీటి శుద్ది కేంద్రాల పనులను త్వరగా ప్రారంభించాలని జలమండలి ఎండీ అశోక్ రెడ్డీ అధికారులను ఆదేశించారు. తేది.04.10.2025, శనివారం ప్రాజెక్టులో భాగంగా నిర్మిస్తున్న ఘన్ పూర్ వద్ద నిర్మించనున్న మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ పనులను సందర్శించారు. ఘన్ పూర్ నుంచి ఉస్మాన్ సాగర్ వరకు ఉన్న 56 కిమీటర్ల మేరకు నిర్మించ తలపెట్టిన రెండు వరుసల పైప్ లైన్ కు పనులకు ఆటంకం కాకుండా తీసుకోవాల్సిన చర్యలను అధికారులతో చర్చించారు. రోడ్ క్రాసింగ్, టన్నెలింగ్ లాంటి సమస్యాత్మక ప్రాంతాల్లో పర్యటించారు. ఈ సందర్భంగా ఎండీ మాట్లాడుతూ ఘన్ పూర్ వద్ద నిర్మించనున్న 80 మిలియన్ లీటర్ల మాస్టర్ బ్యాలెన్సింగ్ రిజర్వాయర్, నీటి శుద్ది కేంద్రాల పనులను పనులను త్వరగా ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. గోదావరి డ్రికింగ్ వాటర్ సప్లై పథకం ఫేజ్–1 కింద.. నగర ప్రజల నీటి అవసరాల కోసం ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి జలమండలి ఇప్పటికే 10 టీఎంసీల నీరు తరలిస్తోంది. తాజాగా పథకంలో రెండు దశల ద్వారా మల్లన్న సాగర్ రిజర్వాయర్ నుంచి మరో 20 టీఎంసీల నీరు వాడుకునే అవకాశం ఉంది. ఈ 20 టీఎంసీల్లో.. 17.5 టీఎంసీలు నగర ప్రజల తాగునీటి అవసరాలకు పోగా, మూసీ ప్రక్షాళనలో భాగంగా.. జంట జలాశయాలను పునరుజ్జీవనం చేసేందుకు మిగిలిన 2.5 టీఎంసీలను ఉపయోగించనున్నారు. ఈ ప్రాజెక్టు వల్ల రెండు లాభాలున్నాయి. ఒకటి హైదరాబాద్ ప్రజల దాహార్తి తీర్చడం, రెండోది.. మూసీ ప్రక్షాళన, జంట జలాశయాల పునరుజ్జీవం చెయ్యడం. ఈ ప్రాజెక్టులో పంప్ హౌజ్ లు, సబ్ స్టేషన్లు, మల్లన్న సాగర్ నుంచి ఘన్ పూర్ వరకు 3000 ఎంఎం డయా భారీ పైపు లైన్ నిర్మించనున్నారు. అంతే కాకుండా ఘన్ పూర్, శామీర్ పేట్ వద్ద 1170 ఎంఎల్డీల సామర్థ్యంతో నీటి శుద్ధి కేంద్రాన్ని (డబ్ల్యూటీపీ) నిర్మించనున్నారు. ఘన్ పూర్ నుంచి ముత్తంగి వరకు పంపింగ్ మెయిన్ నిర్మాణంతో పాటు.. ఇతర పనులు చేపట్టనున్నారు. రెండేళ్లలో ఈ ప్రాజెక్టు నిర్మాణం పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. గోదావరి డ్రింకింగ్ వాటర్ సప్లై స్కీమ్ ఫేజ్ –2,3 ద్వారా 300 ఎంజీడీల నీరు సరఫరా చేస్తారు. ఈ కార్యక్రమంలో ప్రాజెక్టు డైరెక్టర్ టీవీ శ్రీధర్, సీజీఎమ్ మహేష్ కుమార్ లతో పాటు సంబంధిత అధిరకారులు పాల్గొన్నారు.

# భక్తి, త్యాగం మానవతా విలువల పండుగ గ్యార్వీ



## బిఆర్ఎస్ ఎల్పీ విప్ ఎమ్మెల్యే కెపి.వివేకానంద్

**కుత్బుల్లాపుర్, అక్టోబర్ 4(సమయం న్యూస్):** సుభాష్ నగర్ డివిజన్ గంప బస్తీలోని హజ్రత్ సయ్యద్న షేక్ అబ్దుల్ ఖాదర్ జిలానీ రహమతుల్లా అహ్లె, చిల్లా షరీఫ్ దర్గా నందు మైనారిటీ నాయకులు షేక్ ఇస్మాయిల్ ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన గ్యార్వీ ఉత్సవ కార్యక్రమానికి బిఆర్ఎస్ ఎల్పీ విప్, ఎమ్మెల్యే కెపి.వివేకానంద్ ముఖ్యఅతిథిగా హాజరై ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భక్తి, త్యాగం మానవతా విలువల పండుగ గ్యార్మీ పండుగ అని అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ హేమలతా సురేష్ రెడ్డి, మేడ్చల్ జిల్లా ఫిషరీస్ కో–ఆపరేటివ్ చైర్మన్ మన్నె రాజు, డివిజన్ అధ్యక్షులు పోలే శ్రీకాంత్, పుప్పాల భాస్కర్, సీనియర్ నాయకులు గుబ్బల లక్ష్మీనారాయణ, అడప శేషు, సిద్దిక్, సాజిద్, శౌతం రాయ్, నదీమ్, రషీద్, రఫీక్, అంజద్, ఇస్మాయిల్, హఫీజ్ తదితరులు పాల్గొన్నారు.

# స్థానిక ఎన్నికల్లో గెలిచేది బీఆర్ఎస్ పార్టే

## మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి

**కోస్గి మున్సిపాలిటీ(మం), అక్టోబర్4 (సమయం న్యూస్):** నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గం కోస్గి మండల కేంద్రంలో బాలాజీ ఫంక్షన్ హాల్ లో గుండుమాల్, కోస్గి మండలాల స్థానిక సంస్థల ఎన్నికలపై మండల ముఖ్య నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించిన మాజీ ఏమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి మొదటగా నియోజకవర్గ ప్రజలందరికీ దసరా శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ "కాంగ్రెస్ బాకీ కార్డే" మన బ్రహ్మాస్త్రం.బాకీ కార్డును ఇంటింటికి చేర్చాలి..కాంగ్రెస్ కు గుణపాఠం చెప్పాలి అన్నారు మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు,మాజీ ప్రజా ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు



# ఇన్నోవేషన్‌తోనే కంపెనీల మనుగడ

## రాహుల్ గాంధీ



**కొలంబియా, అక్టోబర్ 4 (సమయం న్యూస్):** ఇన్నోవేషన్ తోనే కంపెనీల గెలుపు: రాహుల్ గాంధీ కొలంబియాలో పర్యటిస్తున్న కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ, భారతీయ కంపెనీలు ఆశ్రిత పక్షపాతంతో కాకుండా ఇన్నోవేషన్ ద్వారానే విజయం సాధిస్తున్నాయని అన్నారు. బజాజ్, హీరో, టీవీఎస్ కంపెనీలను ప్రశంసిస్తూ, భారత ఆర్థిక వ్యవస్థ కొన్ని కంపెనీల గుత్తాధిపత్యంలో ఉందని విమర్శించారు. ప్రజాస్వామ్యంపై దాడి అతిపెద్ద ప్రమాదమని, దేశ నిర్మాణంలో లోపాలున్నాయని ఆయన పేర్కొన్నారు. కార్లు, మోటార్ బైకుల డిజైన్లపై ఆయన చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి.

# జూబ్లీహిల్స్ ఉపఎన్నికపై కసరత్తు

## హైదరాబాద్‌లో మీనాక్షి నటరాజన్

**హైదరాబాద్, అక్టోబర్ 4 (సమయం న్యూస్):** ఏఐసీసీ తెలంగాణ ఇన్‌చార్జ్ మీనాక్షి నటరాజన్ ఆదివారం నగరానికి రానున్నారు. స్థానిక ఎన్నికలు, జూబ్లీహిల్స్ ఉపఎన్నికల నేపథ్యంలో పార్టీ వ్యూహరచనపై ఆమె సమీక్ష జరపనున్నారు. జూబ్లీహిల్స్ అభ్యర్థి ఎంపికపై స్పష్టత కోసం ఇప్పటికే మంత్రులకు ప్రతిపాదనలు పంపాలని ఆదేశాలు వెళ్లినట్లు సమాచారం. టీపీసీసీ చీఫ్ మహేష్‌కుమార్ గౌడ్ సమక్షంలో మీనాక్షి, కాంగ్రెస్ సీనియర్ నేతలతో జూమ్ సమావేశంలో పాల్గొని అభిప్రాయాలు సేకరించనున్నారు. ఉపఎన్నికలో గెలుపు సాధించడానికి పార్టీ బలగాలను ఏకీకృతం చేయడం, అభ్యర్థి ఎంపికను చర్చించడం ఈ పర్యటనలో ప్రధాన ఎజెండాగా ఉండనున్నది.





# డీపీఎల్ క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

**పరిగి మున్సిపాలిటీ (మం), అక్టోబర్ 4 (సమయం న్యూస్):** వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని మినీ స్టేడియంలో డిస్ట్రిక్ట్ ప్రీమియర్ లీగ్ క్రికెట్ టోర్నమెంట్(డీపీఎల్ )ను స్థానిక నాయకులు, ప్రజా ప్రతినిధులతో కలిసి పరిగి ఎమ్మెల్యే, డీసీసీ అధ్యక్షుడు డాక్టర్ టీ రామ్మోహన్ రెడ్డి శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. క్రీడాకారులకు అన్ని రకాలుగా అండదండగా ఉంటానని, ఎలాంటి సాయం చేయడానికి అయినా సిద్ధంగా ఉన్నానని, క్రీడలతో మానసిక శారీరక ఆరోగ్యం ఉంటుందని ఎమ్మెల్యే తెలిపారు. ఈ మొదటి క్రికెట్ మ్యాచ్, కల్ కత్తా నైట్ రైడర్స్, సన్ రైజర్ హైదరాబాద్ మధ్య జరిగింది. ఇందులో సన్ రైజర్ పై కల్ కత్తా నైట్ రైడర్స్ గెలుపొందింది.

# ఐయూఎంఎల్ ఆటో యూనియన్ ఖమ్మం నగర అధ్యక్షుడిగా వీరబాబు



**ఖమ్మం, అక్టోబర్ 4 (సమయం న్యూస్):** ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ జిల్లా అధ్యక్షుడు షేక్ బాజీ బాబా శనివారం పార్టీ అనుబంధ కార్మిక విభాగం స్వతంత్ర ట్రేడ్ యూనియన్ ఆటో యూనియన్ ఖమ్మం నగర అధ్యక్షుడిగా పరస బోయిన వీరబాబును నియమించారు. ఈ సందర్భంగా ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ ( ఐయూఎంఎల్ ) జిల్లా అధ్యక్షుడు షేక్ బాజీ బాబా మాట్లాడుతూ, ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అడ్వకేట్ మహమ్మద్ షకిల్ ఆదేశానుసారం ఈ నియామకం చేయటం జరిగిందని, ఆటో యూనియన్ ఖమ్మం నగర అధ్యక్షునిగా ఎన్నికైన పరసబోయిన వీరబాబు కార్మికుల పక్షాన వారి సమస్యల పట్ల నిరంతరం పోరాటం చేయాలని, కార్మికులకు అండగా ఉండాలని, ఖమ్మం పట్టణంలో ఆటో యూనియన్ పెద్ద ఎత్తున బలోపేతం చేయాలని, ఆయన సూచించారు. ఆటో యూనియన్ ఖమ్మం నగర అధ్యక్షునిగా ఎన్నికైన పరసబోయిన వీరబాబు మాట్లాడుతూ, తనకు ఈ అవకాశం కల్పించిన ఇండియన్ యూనియన్ ముస్లిం లీగ్ పార్టీ రాష్ట్ర అధ్యక్షులు అడ్వకేట్ మహమ్మద్ షకిల్ , పార్టీ ఖమ్మం జిల్లా అధ్యక్షుడు షేక్ బాజీ బాబా, జిల్లా ఉపాధ్యక్షుడు అబ్దుల్ రహీం, పార్టీ నగర కార్యదర్శి షేక్ హనీఫ్ షేక్ సర్వర్ పాషా లకు కృతజ్ఞతలు తెలియజేశారు. ఆటో యూనియన్ అభివృద్ధి కోసం కృషి చేస్తానని తోటి కార్మికుల పక్షాన నిలబడి తమకు రావలసిన హక్కుల కోసం పోరాటం చేస్తానని ఆయన అన్నారు.

# అడవి పందుల నుండి పంటలను రక్షించుకుందాం



**పరిగి, అక్టోబర్ 4 (సమయం న్యూస్):** వికారాబాద్ జిల్లా పరిగి పట్టణంలోని ప్రజా భవన్ (ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం)లో పంట పొలాల చుట్టూ విద్యుత్ కంచెలు ఏర్పాటు చేయరాదని శనివారం పరిగి ఎమ్మెల్యే డాక్టర్ టీ రామ్మోహన్ రెడ్డి రైతులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే టీఆర్ఆర్ మాట్లాడుతూ గ్రామాల్లోకి వచ్చి పంట పొలాలను పాడుచేస్తున్న అడవి పందులను చట్ట ప్రకారం అంతం చేద్దామని అన్నారు. పంట పొలాలను రక్షించేందుకు వేసిన విద్యుత్ కంచె రైతులనే బలి తీసుకుంటుందని, పరిగి నియోజకవర్గ వ్యాప్తంగా సుమారు 6 మంది రైతులు పంటలను రక్షించేందుకు ఏర్పాటు చేసిన కంచెకు బలి అయ్యారని తెలియజేశారు. తమ పంటను రక్షించేందుకు విద్యుత్ కంచె ఏర్పాటు చేసి పక్క పొలం రైతులకు కూడా ప్రాణాలను హాని జరుగుతుందని అన్నారు. పొలాలకు కంచెలుగా విద్యుత్ వైర్లు ఏర్పాటు చేసి రైతులను ప్రాణాలకు హాని జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని తెలియజేశారు. రైతుల పంట పొలాలను పాడు చేసే అడవి పందులు ఉన్న వివరాలను లిఖితపూర్వకంగా రాసి దరఖాస్తు చేసుకుంటే చట్టపరంగా ఏర్పాటు చేసిన (హంటర్) షూటర్ ద్వారా అడవి పందులను అంతం చేస్తున్నారని అన్నారు. రైతులు ఈ సదావకాశాన్ని సద్వినియోగం చేసుకొని తమ పంట పొలాలను కాపాడుకోవాలని ఎమ్మెల్యే తెలిపారు. అడవి పందుల బేడుద ఉన్న రైతులు మీ గ్రామం యొక్క స్పెషల్ ఆఫీసర్ లేదా పంచాయతీ కార్యదర్శి ద్వారా క్రింద ఉన్న ఫార్మ్ పై సంతకం చేయించి అటవీ శాఖ అధికారులకు (డి ఎఫ్ వో) దరఖాస్తు చేసుకోవాల్సిందిగా తెలిపారు. ఈ కార్యక్రమంలో బ్లాక్ అధ్యక్షులు పార్థసారథి పంతులు, పరిగి మార్కెట్ కమిటీ చైర్మన్ పరశురాం రెడ్డి, పట్టణ అధ్యక్షులు ఎర్రగడ్డ పల్లి కృష్ణ, పరిగి మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఎండి. అయూబ్, డిసిసి ప్రధాన కార్యదర్శి హనుమంతు ముదిరాజ్, కాంగ్రెస్ పార్టీ నాయకులు దండు అశోక్, అనెం అంజనేయులు, రాజ పుల్లారెడ్డి, తౌరియా నాయక్, అయూబ్, ఆనంద్, నాగవర్ధన్, వెంకటేష్, భాస్కర్ రెడ్డి, శ్రీధర్, రహీం పటేల్, పెంటన్న, కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.




## అందరి సమక్షంలోనే లక్కీడ్రా!

**శివంపేట, అక్టోబర్ 4 (సమయం న్యూస్):** ఎస్ఎల్ఎన్ ప్రాపర్టీ సీఎండీ కిరణ్మై పుట్టినరోజు సందర్భంగా 1100కే, 11 గిఫ్టులు అని ఎస్ఎల్ఎన్ ప్రాపర్టీ చైర్మన్ కిరణ్మై ఎండీ జలగం రాకేష్ అన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మొదటి గిఫ్ట్ 18 లక్షల ప్లాట్, రెండు ,మూడు, గిఫ్టులు 50 ఇంచుల ఎల్ఈడీ టీవీలు. నాలుగు ఐదు ఆరు గిఫ్టులు రిఫ్రిజిరేటర్స్, ఏడు, ఎనిమిది, తొమ్మిది ,పది ,పదకొండు, మిక్సీ గ్రైండర్స్, బహుమతులు ఉంటాయని అన్నారు. అంతేకాకుండా 1100 కట్టిన ప్రతి ఒక్కరికి గిఫ్ట్ ఇవ్వడం జరుగుతుందని, హెచ్ ఎల్ ఎన్ ప్రాపర్టీ చైర్మన్ కిరణ్ మై, ఎండి జలగం రాకేష్ తెలిపారు. అందరి సమక్షంలోనే ఈ లక్కీ డ్రా లు తీయడం జరుగుతుందని అన్నారు. ప్రతి ఒక్కరూ ఈ అవకాశంను సద్వినియోగం చేసుకోవాలని సొంతింటి కలను నెరవేర్చుకోవాలని అన్నారు.

## మాజీ ఎమ్మెల్యేకు శుభాకాంక్షలు



**కొడంగల్, అక్టోబర్ 4 (సమయం న్యూస్):** వికారాబాద్ జిల్లా కొడంగల్ నియోజకవర్గం లోని బొంరాస్ పేట్,కొడంగల్ మండలాల్లో కొడంగల్ మాజీ ఎమ్మెల్యే పట్నం నరేందర్ రెడ్డి పర్యటించారు. దసరా సందర్భంగా బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు మాజీ ఎమ్మెల్యే కు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## విరాళం అందజేత



రాయపోల్ మండలంలోని అనాజిపూర్ గ్రామానికి చెందిన భారతీయ జనతా పార్టీ సిద్దిపేట జిల్లా ఎస్సి మోర్చ ప్రధాన కార్యదర్శి గజ్వేల్ రామచంద్రం గ్రామ యువజన యూత్ ఆధ్వర్యంలో ఏర్పాటుచేసిన దుర్గామాత దేవీ నవరాత్రి ఉత్సవాలకు శనివారం రూ.10111 లు విరాళం అందజేశారు.

## జంతు సంపదను రక్షించుకుందాం



**కోస్గి, అక్టోబర్ 4 (సమయం న్యూస్):** శనివారం ప్రపంచ జంతు సంరక్షణ దినోత్సవాన్ని పురస్కరించుకొని నారాయణపేట జిల్లా కొడంగల్ నియోజకవర్గం కోస్గి మండలం మీర్జాపూర్ ఉన్నత పాఠశాలలో విద్యార్థుల కు పర్యావరణంలో జంతువుల పాత్ర అనే అంశంపై ఎర్త్ క్లబ్ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా జాతీయ హరితదళ సమన్వయకర్త వార్ల మల్లేశం మాట్లాడుతూ ఇప్పటికే ఎన్నో అరుదైన జంతువులు కనుమరుగైపోయాయని జంతుసంపదను పరిరక్షించడం, వృద్ధి చేయడం, వాటి హక్కులను కాపాడటంకోసం అందరూ బాధ్యతాయుతంగా వ్యవహరించాల్సిన అవసరం ఉందన్నారు. అభివృద్ధి పేరిట కొనసాగుతున్న మానవ కార్యకలాపాల వల్ల జంతువుల ఆవాసాలు విధ్వంసం అవుతున్నాయని, అర్థం పర్థం లేకుండా అడవులు నరికి వేయడం, మంచినీటి వనరుల విధ్వంసం చేయడం వల్ల జంతువులు వేగంగా అంతరిచిపోతున్నాయని అన్నారు.భూమిపై మనిషికన్నా ముందే జంతువులు ఉన్నట్లు సైన్స్ చెబుతున్నదని మనిషి మాత్రమే స్వార్థపరుడుగా మారి ఇతర జీవుల మను గడకు అడ్డుపడుతున్నాడని అన్నారు. మూగజీవాల పట్ల ప్రేమ, జాలి, దయ, మానవత్వం కలిగి ఉండాలని విద్యార్థులకు సూచించారు. అంతకుముందు జంతు సంరక్షణ పద్ధతుల పై డాక్యుమెంటరీ తిలకించారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు జనార్దన్ రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# వైభవంగా సద్దుల బతుకమ్మ

### గంగమ్మ ఒడికి గౌరమ్మ..

### ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ హాజరు





**రుద్రంగి, అక్టోబర్ 4 (సమయం న్యూస్):** రాజన్న సిరిసిల్ల జిల్లా రుద్రంగి మండల కేంద్రంలో సద్దుల బతుకమ్మ వేడుకలు శనివారం ఘనంగా జరిగాయి. నిద్రపో గౌరమ్మ నిద్ర నిద్రపోవమ్మా. నిద్రకు నరేండ్లు, నీకు వెయ్యేండ్లు. నినుగన్న తల్లికి నిండు నూరేళ్లు.. వెళ్లి రావమ్మా మళ్లీ రావమ్మా' అంటూ బతుకమ్మ అంటూ మహిళలు వీడ్కోలు పలికారు. మహిళలు రంగురంగుల పూలతో బతుకమ్మలను అందంగా తీర్చిదిద్దారు. నుతన దుస్తులను ధరించి ప్రధాన కూడలి వద్ద బతుకమ్మ ఆట పాటలతో సందడి చేశారు బంగారు బతుకమ్మ య్యాలో.. కలవారి కోడలు ఉయ్యాలో... గౌరమ్మ గౌరమ్మ ఉయ్యాలో, అంటూ ఆడిపాడారు యువతులు, మహిళలు, చిన్నారులు దాండియా, కోలాటాలు ఆడారు. ఆనంతరం గ్రామ శివారుల్లోని బతుకమ్మ కుంట ఎల్లయ్యకుంట చెరువులలో నిమజ్జనం లో నిమజ్జనం చేశారు. మహిళలు ఒకరినొకరు వాయినాలు ఇచ్చిపుచ్చుకున్నారు. ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరుగకుండా ఎస్సై బి. శ్రీనివాస్ ఆధ్వర్యంలో పోలీస్ సిబ్బంది పర్యవేక్షించారు.

### సొంతూరులో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్...

రాష్ట్ర ప్రభుత్వ విప్ ఎమ్మెల్యే అది శ్రీనివాస్ తమ సొంత గ్రామంలో ఘనంగా నిర్వహించిన సద్దుల బతుకమ్మ వేడుకల్లో పాల్గొన్నారు. గ్రామంలో ప్రతీ ఒక్కరిని ఆప్యాయంగా పలకరిస్తూ. చిన్ననాటి జ్ఞాపకాలను గుర్తు చేసుకున్నారు. గ్రామస్తులతో ముచ్చటిస్తూ సద్దుల బతుకమ్మ వేడుకల్లో మహిళలకు ప్రత్యేకమైన శు భాకాంక్షలు తెలిపారు. ఆయన ఈ సందర్భంగా సాంప్రదాయ దుస్తుల్లో పాల్గొని గ్రామంలోని యువకులతో కలసి నృత్యాలు చేశారు. సద్దుల బతుకమ్మ అనేది తెలంగాణ సాంస్కృతిక సంపదను ప్రతిబించించే పండుగ అని, ఈ వేడుకలు గ్రామీణులకు ముఖ్యంగా మహిళలకు సంతోషాన్ని అందించే పండగ అని అన్నారు. బతుకమ్మ పండుగ తెలంగాణలోని ప్రతి కుటుంబంలో ఆనందాన్ని నింపుతుందని, పూల జాతరతో మహిళలు తమ సాంప్రదాయ దుస్తులు ధరించి బతుకమ్మను అలంకరించడం ద్వారా కుటుంబ సమైక్యతను, సాంప్రదాయ విలువలను నిలబెట్టుకుంటారని ఆది శ్రీనివాస్ అభినందించారు.









# మోసపూరిత హామీలతో అధికారంలోకి వొచ్చారు







- స్థానిక ఎన్నికల్లో మన సత్తా చాటాలి
- మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు

**మిర్యాలగూడ, అక్టోబర్ 4 (సమయం న్యూస్):** స్థానిక సంస్థల ఎన్నికల నేపథ్యంలో పట్టణంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శనివారం మిర్యాలగూడ మండల విస్తృతస్థాయి కార్యకర్తల సమావేశాన్ని మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు ఆధ్వర్యంలో బీఆర్ఎస్ పార్టీ మండల పార్టీ నేతలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీ ఎమ్మెల్యే నల్లమోతు భాస్కర్ రావు మాట్లాడుతూ, రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో మన బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులను గెలిపించాలని, విభేదాలను పక్కన పెట్టి సర్పంచ్, ఎంపిటిసి, జడ్పిటిసి, ఎన్నికలలో బీఆర్ఎస్ పార్టీ అభ్యర్థులు ఘన విజయం సాధించేలా, ప్రతి కార్యకర్త కృషి చేయాలనీ తెలిపారు. ఇందుకోసం కార్యకర్తలంతా సమష్టిగా ముందుకెళ్లాల్సిన అవసరముందని అన్నారు. స్థానిక సంస్థల ఎన్నికలను నాయకులు, కార్యకర్తలు ఆషామాషీగా తీసుకోవద్దని, రాత్రిబవంళ్లు కష్టపడి పనిచేస్తేనే మన లక్ష్యాన్ని చేరుకుంటామన్నారు, స్థానిక సంస్థల ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ గెలవాల్సిన అవసరం ఎంతైనా ఉందని, మన పార్టీ గెలువకుండా కార్యకర్తలను ఇబ్బంది పెట్టడానికి కాంగ్రెస్ పార్టీ ఇబ్బందులకు గురిచేసే అవకాశమున్నదని పేర్కొన్నారు. మనమంతా ధైర్యంగా ముందుకెళ్లి సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ, ఎంపీపీ స్థానాలను కైవసం చేసుకోవల్సిన అవసరం ఉందని తెలిపారు. సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో పార్టీ కోసం కష్టపడి పనిచేసే వారిని స్థానిక సంస్థల ఎన్నికల్లో నిలబెట్టాలని సూచించారు. తెలంగాణ రాష్ట్ర ప్రజలు కేసీఆర్ నాయకత్వాన్ని కోరుకుంటున్నారని, కాంగ్రెస్ పార్టీని గెలిపించి తప్పుచేశామని ప్రజలు పశ్చాత్తాప పడుతున్నారని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వంపై అన్ని వర్గాల ప్రజలు అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ ఇచ్చిన ఏ ఒక్క హామీనీ సక్రమంగా అమలు చేయలేదని తెలిపారు. ముఖ్యంగా రైతులు యూరియా కోసం అల్లాడుతున్నారని ఒక్క యూరియా బస్తా కోసం రోజుల తరబడి సహకార సంఘాల ఎదుట నిలబడుతున్నారని పేర్కొన్నారు. పింఛన్లు పెంచలేదని, రుణమాఫీ చేయలేదన్నారు. వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీకి తగిన గుణపాఠం చెప్పడానికి ప్రజలు సిద్ధంగా ఉన్నారని, ఈ అవకాశాన్ని మనం అందిపుచ్చుకోవాలని పేర్కొన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికా రంలోకి వచ్చి రెండు సంవత్సరాలు కావస్తున్నప్పటికీ స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించే ధైర్యం లేదన్నారు. కోర్టు ఆదేశాలతోనే ఎన్నికల నిర్వహణకు ముందు కొచ్చిందని, ఈ ఎన్నికల్లో కూడా ఆ పార్టీకి ప్రజలు తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారని స్పష్టం చేశారు. ముఖ్యంగా స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థి గెలుపు కోసం ప్రతి నాయకుడు, కార్యకర్త కలిసికట్టుగా ముం దుకెళ్లాల్సిన అవసరం ఉందని, పంతాలకు వెళ్లకుండా పార్టీని గెలిపించేందుకు కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే భాస్కర్ రావు అన్నారు. ఈ కార్యక్రమములో తిప్పన విజయ సింహారెడ్డి, అలుగుబెల్లి అమరేందర్ రెడ్డి, చింత రెడ్డి శ్రీనివాస్ రెడ్డి, జొన్నలగడ్డ రంగారెడ్డి, మట్టపల్లి సైదులు, వెంకటరమణ చౌదరి పేలపోలు తిరుపతమ్మ, అమరావతి సైదులు, నరసింహారెడ్డి, బిక్షం, లలిత, రవీందర్, శంకర్ నాయక్, సైదా నాయక్ సైదా నాయక్ సూర్య నాయక్ వెంకట్రాం, మాంజా నాయక్ రమణ ధర్మానాయక్, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్ రెడ్డి, అశోక్ రెడ్డి, పులి జగదీష్, మాజీ ఎంపీటీసీలు మరియు మాజీ డైరెక్టర్లు, మాజీ సర్పంచులు మరియు ఉపసర్పంచులు గ్రామ పార్టీ అధ్యక్షులు, ముఖ్య కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు

# అహ్మదాబాద్ బాద్ షా భారత్

### తొలి టెస్టులో భారత్ ఘన విజయం
### ఇన్నింగ్స్ 140 పరుగుల తేడాతో విజయం
### మూడు రోజుల్లోనే వెస్టిండీస్ చిత్తు

అహ్మదాబాద్ వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన తొలి టెస్టులో భారత్ ఘన విజయం సాధించింది. ఏకంగా 140 పరుగుల తేడాతో గెలుపొందింది. బౌలర్లు సత్తా చాటడంతో రెండో ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ 146 పరుగులకే ఆలౌటైంది. అలిక్ 38, జస్టిన్ 25 పరుగులు చేశారు. భారత బౌలర్లలో జడేజా 4, సిరాజ్ 3, కుల్‌దీప్ యాదవ్ 2 వికెట్లు పడగొట్టారు. వాషింగ్టన్ సుందర్ ఒక వికెట్ తీశాడు. తొలి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ 162 పరుగులకు ఆలౌట్ కాగా భారత్ 448/5 పరుగులకు డిక్లేర్డ్ చేసింది.టీమిండియాకు వ్యతిరేకంగా వెస్టిండీస్ బ్యాటింగ్ రెండు ఇన్నింగ్స్‌లలో పూర్తిగా విఫలమైంది. మొదటి ఇన్నింగ్స్‌లో వెస్టిండీస్ జట్టు కేవలం 162 పరుగులకే ఆలౌట్ అయింది. దీనికి సమాధానంగా టీమిండియా 5 వికెట్ల నష్టానికి 448 పరుగులు చేసి, తమ ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. 286 పరుగుల భారీ లోటుతో రెండో ఇన్నింగ్స్‌ను ప్రారంభించిన వెస్టిండీస్ జట్టు నుండి మంచి ప్రదర్శన ఆశించినప్పటికీ జట్టు మొత్తం పేకమేడలా కూలిపోయింది. మూడవ రోజు రెండో సెషన్‌లోనే వెస్టిండీస్ కేవలం 146 పరుగులకు ఆలౌట్ అయింది. వెస్టిండీస్ తరపున ఎలిక్ అథానాజ్ అత్యధికంగా 38 పరుగులు చేశాడు. జస్టిన్ గ్రేవ్స్ 25 పరుగులు, జైడెన్ సీల్స్ 22 పరుగులు చేశారు. మిగిలిన ఏ బ్యాట్స్‌మెన్ కూడా ఎక్కువసేపు క్రీజులో నిలబడలేకపోయారు. భారత బౌలర్లు ఈ టెస్ట్ మ్యాచ్‌లో వెస్టిండీస్ బ్యాట్స్‌మెన్‌లను స్వేచ్ఛగా ఆడకుండా అడ్డుకున్నారు. రెండు ఇన్నింగ్స్‌లలోనూ అతిథి జట్టు తరపున ఏ బ్యాట్స్‌మెన్ కూడా హాఫ్ సెంచరీ సాధించలేకపోయారు. రవీంద్ర జడేజా అత్యధికంగా 4 వికెట్లు పడగొట్టాడు. మహ్మద్ సిరాజ్ 3 వికెట్లు, కుల్దీప్ యాదవ్ 2 వికెట్లు చరికొట్టారు. భారత బౌలర్లు సంయుక్తంగా అద్భుతమైన ప్రదర్శన కనబరిచి, వెస్టిండీస్‌ను తక్కువ స్కోరులకే పరిమితం చేశారు. దీంతో భారత జట్టు సిరీస్‌లో 1-0 ఆధిక్యంలో నిలిచింది.




ఈ విజయం టీమిండియా బౌలింగ్, బ్యాటింగ్ విభాగాల బలాన్ని మరోసారి నిరూపించింది. అలిక్ అథనాజే (74 బంతుల్లో 3 ఫోర్లతో 38), జస్టిన్ గ్రీవ్స్(52 బంతుల్లో 4 ఫోర్లతో 25) టాప్ స్కోరర్లుగా నిలిచారు. భారత బౌలర్లలో మహమ్మద్ సిరాజ్(3/31) మూడు వికెట్లు తీయగా.. రవీంద్ర జడేజా(4/54) నాలుగు వికెట్లు పడగొట్టాడు. కుల్దీప్ యాదవ్(2/23)కు రెండు వికెట్లు.. వాషింగ్టన్ సుందర్‌కు ఒక వికెట్ దక్కింది. పూర్తిగా ఏకపక్షంగా సాగిన ఈ మ్యాచ్‌లో వెస్టిండీస్ కనీస పోటీ ఇవ్వలేకపోయింది. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన వెస్టిండీస్ తొలి ఇన్నింగ్స్‌లో 44.1 ఓవర్లలో 162 పరుగులకు ఆలౌటైంది. జస్టిన్ గ్రీవ్స్(48 బంతుల్లో 4 ఫోర్లతో 32), షైహోప్(36 బంతుల్లో 3 ఫోర్లతో 26), రోస్టన్ ఛేజ్(43 బంతుల్లో 4 ఫోర్లతో 24) టాప్ స్కోరర్లుగా నిలిచారు. భారత బౌలర్లలో మహమ్మద్ సిరాజ్ నాలుగు వికెట్లు తీయగా.. జస్ప్రీత్ బుమ్రా మూడు వికెట్లు పడగొట్టాడు. కుల్దీప్ యాదవ్ రెండు వికెట్లు తీయగా.. వాషింగ్టన్ సుందర్‌కు ఒక వికెట్ దక్కింది.

భారత్ తొలి ఇన్నింగ్స్‌లో 128 ఓవర్లలో 448/5 పరుగులకు డిక్లెర్ చేసింది. కేఎల్ రాహుల్(197 బంతుల్లో 12 ఫోర్లతో 100), ధ్రువ్ జురెల్(210 బంతుల్లో 15 ఫోర్లు, 3 సిక్స్‌లతో 125, రవీంద్ర జడేజా(176 బంతుల్లో 6 ఫోర్లు, 5 సిక్స్‌లతో 104 నాటౌట్) సెంచరీలతో సత్తా చాటగా.. కెప్టెన్ శుభ్‌మన్ గిల్(100 బంతుల్లో 5 ఫోర్లతో 50) హాఫ్ సెంచరీతో రాణించాడు. వెస్టిండీస్ బౌలర్లలో రోస్టన్ ఛేజ్(2/90) రెండు వికెట్లు తీయగా.. జైడన్ సీల్స్, వారికన్, పిర్ తలో వికెట్ తీసారు.

మరోవైపు దీంతో ఈ మ్యాచ్ అనంతరం డబ్ల్యూటీసీ పాయింట్ల పట్టికలో భారత్ స్థానం  భారత్ తొలుత జూన్?లో ఇంగ్లాండ్ పర్యటనకు వెళ్లింది. అక్కడ ఇంగ్లాండ్?తో టీమ్ఇండియా 5 టెస్టు మ్యాచ్?ల సిరీస్? ఆడింది. ఈ టూర్?లో సమష్టిగా రాణించిన భారత్, 2-2తో సిరీస్?ను సమం చేసుకుంది. ఇందులో రెండిట్లో భారత్ నెగ్గగా, మరో రెండు మ్యాచ్?లలో ఇంగ్లాండ్ విజయం సాధించింది. ఒక టెస్టు డ్రాగా ముగిసింది. ఇక స్వదేశంలో విండీస్?తో టెస్టు సిరీస్?ను ఘనంగా ఆరంభించింది. తొలి మ్యాచ్?లో నెగ్గి 1-0 తో ఆధిక్యంలోకి దూసుకెళ్లింది. ఈ మ్యాచ్ విజయంతో భారత్ ప్రస్తుత డబ్ల్యూటీసీలో మూడో విజయం నమోదు చేసింది. దీంతో భారత్ ప్రస్తుతం 55.56 పాయింట్ పర్సెంటేజీతో మూడో స్థానంలో కొనసాగుతోంది. మూడింట మూడు విజయాలు సాధించిన ఆస్ట్రేలియా 100 శాతం పాయింట్ పర్సెంటేజీతో టాప్?లో ఉండగా, శ్రీలంక 66.66 రెండో ప్లేస్?లో ఉంది. ఇవి కాకుండా న్యూజిలాండ్, పాకిస్థాన్, సౌతాఫ్రికా జట్లు 2025- 27 డబ్ల్యూటీసీ సైకిల్?లో ఇంకా ఒక్క టెస్టు మ్యాచ్ కూడా ఆడలేదు.

## ఆస్ట్రేలియాతో వన్డే సిరీస్‌కు జట్టు ఎంపిక

### తిరిగి జట్టులోకి
### విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ
### కెప్టెన్ గా శుభ్‌మన్ గిల్ కు అవకాశం

రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలను మరోసారి కలిసి చూసే అవకాశం ఉంది. ఈ ఏడాది ఐపీఎల్ తర్వాత వీరిద్దరూ క్రికెట్ మ్యాచ్‌ల్లో అసలు కనిపించలేదు. రిటైర్మెంట్ కారణంగా వీరిద్దరూ ఇతర టీ20, టెస్టు ఫార్మాట్లలో కనిపించడం లేదు. ఈ క్రమంలో వాళ్ల ఫ్యాన్స్ కు హుషారెత్తించే వార్త వచ్చింది. త క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) సెలెక్షన్ కమిటీ స్పష్టం చేసింది. ఆసీస్‌తో జరగనున్న వన్డే సిరీస్, టీ20 మ్యాచ్‌ల కోసం సెలెక్షన్స్ కమిటీ జట్లను ప్రకటించింది. ఈ క్రమంలో బీసీసీఐ కొన్ని కీలక నిర్ణయాలను తీసుకుంది. ఇప్పటి వరకు కెప్టెన్ గా రోహిత్ శర్మను తప్పించి అతని స్థానంలో టెస్టు కెప్టెన్ శుభ్‌మన్ గిల్‌ను నాయకత్వ బాధ్యతలు అప్పగించింది. విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలను మైదానంలో చూడటానికి భారత అభిమానులు ఆసక్తిగా ఉన్నారు. ఐపీఎల్ మధ్యలో టెస్టు, టీ20 ఫార్మాట్ల నుండి ఇద్దరూ రిటైర్మెంట్ ప్రకటించారు. కానీ ఇప్పుడు ఆ నిరీక్షణ ముగిసిన తర్వాత.. భారత క్రికెట్ నియంత్రణ మండలి (బీసీసీఐ) అభిమానులకు మరో దెబ్బ తగిలింది. ఆస్ట్రేలియా



పర్యటనకు భారత జట్టును ప్రకటించేటప్పుడు బీసీసీఐ కొన్ని ముఖ్యమైన నిర్ణయాలతో అందరినీ ఆశ్చర్యపరిచింది. అయితే బీసీసీఐ ప్రకటించిన జట్టులో ఎవరెవరికి చోటు కల్పించారో ఇప్పుడు తెలుసుకుందాం.

**ఆస్ట్రేలియా పర్యటనకు భారత జట్టు**

వన్డే జట్టు: శుభ్‌మన్ గిల్ (కెప్టెన్), రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ, శ్రేయాస్ అయ్యర్ (వైస్ కెప్టెన్), అక్షర్ పటేల్, కేఎల్ రాహుల్ (వికెట్ కీపర్), నితీష్ కుమార్ రెడ్డి, వాషింగ్టన్ సుందర్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, మహ్మద్ సిరాజ్, అర్ష్‌దీప్ సింగ్, ప్రసిద్ధ కృష్ణ, ధ్రువ్ జురెల్ (వికెట్ కీపర్), యశస్వి జైస్వాల్.

టీ20 జట్టు: సూర్యకుమార్ యాదవ్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, శుభ్‌మన్ గిల్ (వైస్ కెప్టెన్), తిలక్ వర్మ, నితీష్ కుమార్ రెడ్డి, శివమ్ దూబే, అక్షర్ పటేల్, జితేష్ శర్మ (వికెట్ కీపర్), వరుణ్ చక్రవర్తి, జస్ప్రీత్ బుమ్రా, అర్ష్‌దీప్ సింగ్, కుల్దీప్ యాదవ్, హర్షిత్ రాణా, సంజూ శాంసన్ (వికెట్ కీపర్), రింకూ సింగ్, వాషింగ్టన్ సుందర్.

## రోహిత్, విరాట్ వన్డే ప్రపంచ కప్ ఆడతారా?

ఆస్ట్రేలియా పర్యటన కోసం భారత్ వన్డే, టీ20 జట్లను ప్రకటించింది. బ్యాటింగ్ దిగ్గజాలు రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలను ఆస్ట్రేలియాతో జరిగే వన్డే సిరీస్‌కు ఎంపిక చేశారు. రోహిత్ శర్మ స్థానంలో శుభ్‌మన్ గిల్ భారత వన్డే జట్టుకు కెప్టెన్‌గా వ్యవహరించనున్నాడు. రోహిత్ శర్మ టెస్ట్ క్రికెట్ నుంచి రిటైర్మెంట్ తీసుకున్న తర్వాత గిల్‌కు సుదీర్ఘ ఫార్మాట్ కెప్టెన్సీని అప్పగించారు. ఇప్పుడు రోహిత్ శర్మ వన్డే జట్టులో ఉన్నప్పటికీ శుభ్‌మన్ గిల్‌కు జట్టు కెప్టెన్సీ బాధ్యతలు కూడా అప్పగించారు. దాంతో రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు 2027 వన్డే ప్రపంచ కప్‌లో ఆడటంపై మరోసారి ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ విషయంపై బీసీసీఐ చీఫ్ సెలెక్టర్ అజిత్ అగార్కర్ ప్రెస్ కాన్ఫరెన్స్‌లో కీలక వ్యాఖ్యలు చేశారు.ఆస్ట్రేలియాతో జరిగే వన్డే, టీ20 సిరీస్‌లకు ఇండియా జట్టును ప్రకటించిన తర్వాత చీఫ్ సెలెక్టర్, భారత మాజీ క్రికెటర్ అజిత్ అగార్కర్‌ను ఓ ప్రశ్న ఎదురైంది. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీలు 2027 వన్డే ప్రపంచ కప్‌లో ఆడతారా అని ప్రెస్ కాన్ఫరెన్స్‌లో అగార్కర్ ను అడిగారు. ఈ ప్రశ్నకు సమాధానంగా అజిత్ అగార్కర్ మాట్లాడుతూ.. 'రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ సైతం ప్రస్తుతం దీని గురించి ఏమీ రివీల్ చేయకూడదు అనుకుంటున్నారు' అని తెలివిగా సమాధానం చెప్పారు. కొన్ని రోజుల కిందట బీసీసీఐ మాత్రం రోహిత్, కోహ్లీ లాంటి ఆటగాళ్లు వన్డే




ప్రపంచ కప్‌లో కీలకం అవుతారని చెప్పింది. అంటే వారు ఆడే అవకాశం ఉందని పరోక్షంగా చెప్పింది. కానీ తాజాగా అగార్కర్ మాటలు చూస్తే.. వచ్చే వన్డే ప్రపంచ కప్ నాటికి రోకో ద్వయం ఫిట్ గా ఉండటం ముఖ్యం, ఫాంలోనూ ఉండాలి. ఆస్ట్రేలియాతో జరగనున్న వన్డే సిరీస్ సైతం వారి కెరీర్ ను డిసైడ్ చేస్తుందని కొన్ని రోజుల కిందట బీసీసీఐ నుంచి సమాచారం వచ్చింది.విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ టీ20 ప్రపంచ కప్ 2024లో భారత్‌ను విజేతగా నిలిపిన తర్వాత పొట్టి ఫార్మాట్ నుంచి రిటైర్మెంట్ ప్రకటించారు. అదే సమయంలో ఆల్ రౌండర్ రవీంద్ర జడేజా సైతం టీ20లకు రిటైర్మెంట్ ఇచ్చాడు. ఇటీవల ఇంగ్లండ్ పర్యటనకు ముందు మే 7న రోహిత్ టెస్ట్ క్రికెట్ కు రిటైర్మెంట్ ప్రకటించాడు. ఐదు రోజుల తర్వాత మే 12న విరాట్ కోహ్లీ కూడా టెస్ట్ ఫార్మాట్‌కు వీడ్కోలు పలికాడు. దాంతో వారు ఆడే ఫార్మాట్ వన్డేలు మాత్రమే. ఆ కారణంతోనే ఇటీవల జరిగిన ఆసియా కప్ టోర్నీలో వీరిద్దరూ ఆడలేకపోయారు.వచ్చే వన్డే వరల్డ్ కప్ విజేతగా భారత్ నిలవడానికి.. జట్టులో యువరక్తాన్ని చేర్చుతున్నారు. అదే సమయంలో రోహిత్, కోహ్లీ లాంటి దిగ్గజాలు జట్టులో ఉంటేనే ప్రయోజనం అని గట్టిగా వినిపిస్తోంది. బీసీసీఐ ఏం చేస్తుంది, వన్డే సిరీస్ లలో వీరు చేసే ప్రదర్శన, ఫిట్ నెస్ పైనే వారి భవిష్యత్ ఆధారపడి ఉంటుందని తెలిసిందే.

## ట్రోఫీ దొంగ నక్వీకి పాక్‌లో సన్మానం



పాకిస్తాన్‌కు తప్పుడు అపోహల్లో జీవించడం, వాటిని నిజమని నమ్మి గొప్పగా జరుపుకోవడంలో ప్రపంచంలో ఎవరూ సాటి రారని ఒక అభిప్రాయం ఉంది. భారతదేశంతో జరిగిన యుద్ధాల్లో ఓడిపోయినా, తమ సైన్యం భారత్‌ను ఓడించిందని ఇప్పటికీ అక్కడి ప్రజలు గట్టిగా నమ్ముతారు. ఇప్పుడు అటువంటి మరో విచిత్రమైన పరిస్థితి పాకిస్తాన్ క్రికెట్ బోర్డు అధ్యక్షుడు మొహసిన్ నఖ్వీ చుట్టూ నెలకొంది. ఆసియా కప్ 2025 సమయంలో ఆయన ప్రదర్శించిన డ్రామా విషయంలో పాకిస్తాన్ ప్రజలు, రాజకీయ వర్గాల్లో విభిన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఆసియా కప్‌లో విజేతగా నిలిచిన టీమ్ ఇండియాకు దక్కాల్సిన ట్రోఫీని దొంగిలించి, తన హొటల్‌కు తీసుకెళ్ళిపోయిన మొహసిన్ నఖ్వీకి ఇప్పుడు పాకిస్తాన్‌లో ఈ చర్యకు గాను సన్మానం చేయబడుతోంది.పాకిస్తాన్ ప్రముఖ వార్తా పోర్టల్ ది నేషన్ ఒక నివేదికలో ఆశ్చర్యకరమైన విషయాన్ని వెల్లడించింది. ఆసియా కప్ 2025లో మొహసిన్ నఖ్వీ తీసుకున్న కఠిన వైఖరికి గాను ఆయనకు మెడల్ అందజేస్తున్నట్లు పేర్కొంది. ఈ నివేదిక ప్రకారం సింధ్, కరాచీ బాస్కెట్‌బాల్ అసోసియేషన్ అధ్యక్షుడు, న్యాయవాది గులాం అబ్బాస్ జమాద్, పీసీబీ, ఆసియా క్రికెట్ కౌన్సిల్ అధ్యక్షుడు నఖ్వీకి షహీద్ జుల్ఫికర్ అలీ భుట్టో ఎక్సలెన్స్ గోల్డ్ మెడల్?ను అందజేస్తామని ప్రకటించారు.ఆసియా కప్ సమయంలో సూత్రబద్ధమైన వైఖరిని అవలంబించడం ద్వారా నఖ్వీ పాకిస్తాన్ గౌరవాన్ని పెంచారని నివేదికలో పేర్కొనడం గమనార్హం. మొహసిన్ నఖ్వీ చేసిన చర్యల వల్ల పాకిస్తాన్ ప్రతిష్ట నిజంగా పెరిగిందా లేదా అనేది ప్రశ్నార్థకం. ఆయన పీసీబీ అధ్యక్షుడిగా ఉన్న సమయంలోనే పాకిస్తాన్ జట్టు మరో టోర్నమెంట్‌లో ఘోరంగా ఓడిపోయింది. ఫైనల్‌తో సహా 3 సార్లు టీమ్ ఇండియా చేతిలో ఓటమి పాలైంది.ఆసియా కప్ ఫైనల్‌లో టీమ్ ఇండియా విజయం సాధించిన తర్వాత, మొహసిన్ నఖ్వీ చేతుల మీదుగా ట్రోఫీని స్వీకరించడానికి భారత జట్టు నిరాకరించింది. అప్పుడు ఏసీసీ అధ్యక్షుడు నఖ్వీ అక్కడ కూడా డ్రామా చేశాడు. తన పట్టుదల కారణంగా ప్రెజెంటేషన్ వేడుక గంటన్నర ఆలస్యంగా ప్రారంభమైంది. అంతేకాదు, టీమ్ ఇండియాకు ఇవ్వాల్సిన ట్రోఫీ, ఆటగాళ్లకు వారి మెడల్స్ కూడా లభించలేదు. టీమిండియాకు ఇవ్వాల్సిన ట్రోఫీని మొహసిన్ నఖ్వీ దొంగల మాదిరిగా తన హొటల్‌కు తీసుకెళ్లి రాత్రంతా అక్కడే ఉంచడం అతి పెద్ద వివాదానికి కారణమైంది. ఆ తర్వాత కూడా నఖ్వీ తన దుశ్చర్యలను ఆపలేదు. ఏసీసీ మీటింగ్‌లో బీసీసీఐ ట్రోఫీని తిరిగి ఇవ్వాలని డిమాండ్ చేసినప్పటికీ, ట్రోఫీని తీసుకోవడానికి భారత కెప్టెన్ సూర్యకుమార్ యాదవ్‌ను దుబాయ్‌లోని ఏసీసీ ఆఫీసుకు పంపాలని, అక్కడ తాను స్వయంగా ట్రోఫీని అందజేస్తానని పట్టుబట్టారు. అయితే బీసీసీఐ కఠిన వైఖరి కారణంగా, మొహసిన్ నఖ్వీ చివరికి ఏసీసీ మీటింగ్‌లో అందరి సభ్యుల ముందు ఫైనల్‌లో జరిగిన డ్రామాకు క్షమాపణ చెప్పాల్సి వచ్చింది.

# ఓటీటీలోకి మిరాయ్



తేజ సజ్జా, మంచు మనోజ్ ప్రధాన పాత్రల్లో కార్తిక్ ఘట్టమనేని తెరకెక్కించిన ఫాంటసీ అడ్వెంచర్ 'మిరాయ్' బ్లాక్ బస్టర్ విజయాన్ని సొంతం చేసుకుంది. ఈ సినిమా తాజాగా ఓటీటీలోకి వచ్చేందుకు సిద్ధమైంది. జియో హాట్‌స్టార్ వేదికగా అక్టోబర్ 10 నుంచి స్ట్రీమింగ్ కానుంది. ఈ విషయాన్ని తెలుపుతూ సంస్థ ఓ పోస్టర్ పంచుకుంది. తెలుగు, తమిళ, కన్నడ, మలయాళ భాషల్లో ఇది అందుబాటులోకి రానున్నట్లు జియో హాట్‌స్టార్ తెలిపింది. కథేంటంటే: సామ్రాట్ అశోక్ కళింగ యుద్ధం గెలిచాక.. జరిగిన విధ్వంసాన్ని తలచుకుని పశ్చాత్తాప్పడతాడు. ఆ వినాశనానికి తనలోని దైవశక్తే ఓ కారణమని భావించి.. ఆ శక్తిని తొమ్మిది గ్రంథాల్లో నిక్షిప్తం చేసి.. వాటి రక్షణ బాధ్యతను తొమ్మిది మంది యోధుల చేతుల్లో పెడతాడు. కొన్ని శతాబ్దాల తర్వాత ఆ గ్రంథాలపై దుష్టశక్తి మహావీర్ లామా (మంచు మనోజ్) కన్ను పడుతుంది. అతను కోరుకున్నట్లుగా అమరత్వాన్ని సాధించి.. ప్రపంచాన్ని శాసించే శక్తిగా ఎదగాలంటే తొమ్మిదో గ్రంథం అవసరమవుతుంది. కానీ, అమరత్వానికి సంబంధించిన ఆ గ్రంథాన్ని సొంతం చేసుకోవడం అంత తేలిక కాదు. ఎందుకంటే దానికి రక్షణగా ఉండేది అంబిక (శ్రియ). మహావీర్ రూపంలో ప్రపంచానికి ఎదురుకానున్న ముప్పును ముందే జ్ఞాన దృష్టితో చూసిన అంబిక.. అతన్ని ఎదుర్కొనేందుకు తనకు పుట్టిన బిడ్డ వేద (తేజ సజ్జా)ను పసికందుగా ఉన్నప్పుడే దూరం చేసుకుంటుంది. మరి ఆ తర్వాత ఏమైంది? అనాథగా వివిధ ప్రాంతాల్లో పెరిగిన వేద తన బాధ్యతను.. తల్లి ఆశయాన్ని ఎలా తెలుసుకుంటాడు? అన్నది తెరపై చూసి తెలుసుకోవాలి.



## పవన్‌తో మరోమారు దిల్‌రాజ్ సినిమా

టాలీవుడ్ లో మరో క్రేజీ కాంబినేషన్ కు రంగం సిద్ధమవుతోంది. పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ తో సక్సెస్ ఫుల్ ప్రొడ్యూసర్ దిల్ రాజు మరోసారి చేతులు కలపబోతున్నారు. వీరిద్దరి కాంబినేషన్లో వచ్చిన 'వకీల్ సాబ్' చిత్రం ఎంతటి ఘన విజయం సాధించిందో అందరికీ తెలిసిందే. ఇప్పుడు అదే ఫార్ములాను రిపీట్ చేస్తూ, మరో ప్రతిష్టాత్మక చిత్రాన్ని నిర్మించడానికి దిల్ రాజు సన్నాహాలు చేస్తున్నారు. విశ్వసనీయ వర్గాల సమాచారం ప్రకారం, నిర్మాత దిల్ రాజు ఇటీవలే పవన్ కళ్యాణ్ డేట్స్ ను ఖరారు చేసుకున్నారు.

'వకీల్ సాబ్' మాదిరిగానే, బలమైన సోషల్ మెసేజ్ తో పాటు, పవన్ కళ్యాణ్ మాస్ ఇమేజ్ కు, ఆయన అభిమానుల అంచనాలకు ఏమాత్రం తగ్గకుండా ఉండేలా ఈ సినిమాను రూపొందించాలని ఆయన భావిస్తున్నారు. కమర్షియల్ అంశాలు పుష్కలంగా ఉంటూనే, కథలో ఒక సందేశం ఉండేలా జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ఈ భారీ ప్రాజెక్ట్ కోసం దిల్ రాజు ప్రస్తుతం సరైన కథ, దర్శకుడి కోసం అన్వేషణలో ఉన్నారు. ప్రస్తుతం పవన్ కళ్యాణ్ 'ఉస్తాద్ భగత్ సింగ్' రిలీజ్ కి రెడీ అవుతోంది. దిల్ రాజు సినిమా త్వరలోనే సెట్స్ పైకి వెళ్లే అవకాశం ఉంది. ఈ వార్త తెలియగానే పవర్ స్టార్ అభిమానుల్లో అంచనాలు రెట్టింపయ్యాయి. 'వకీల్ సాబ్' వంటి మరొక పవర్-ప్యాక్డ్ పెర్ఫార్మెన్స్ ను తమ అభిమాన నటుడి నుంచి ఆశిస్తున్నారు.



# గోపీచంద్ మలినేనితో బాలయ్య సినిమా

వీరసింహారెడ్డి' విజయం తర్వాత కథానాయకుడు నందమూరి బాలకృష్ణ.. దర్శకుడు గోపీచంద్ మలినేని మరోసారి కలిసి పని చేయనున్న సంగతి తెలిసిందే. 'ఎన్‌బీకే 111' వర్కింగ్ టైటిల్‌తో పట్టాలెక్కనున్న ఈ సినిమాని వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీశ్ కిలారు నిర్మిస్తున్నారు. ఈ చిత్రం ఈనెల 24న పూజా కార్యక్రమాలతో ప్రారంభం కానున్నట్లు విజయ దశమి సందర్భంగా ప్రకటించారు. చారిత్రక అంశాలతో ముడిపడిన యాక్షన్ కథతో రూపొందనున్న చిత్రమిది. బాలకృష్ణ ఇందులో మునుపెన్నడూ చూడని శక్తిమంతమైన పాత్రలో.. సరికొత్త లుక్‌తో కనిపించనున్నారు. ప్రస్తుతం ఈ చిత్ర పూర్వ నిర్మాణ పనులు ముగింపు దశలో ఉన్నాయని చిత్ర బృందం తెలిపింది. మరిన్ని వివరాలు త్వరలో వెల్లడించనున్నారు. ఇక ప్రస్తుతం బాలకృష్ణ నటిస్తున్న 'అఖండ 2: తాండవం' సినిమాని డిసెంబరు 5న థియేటర్లలోకి తీసుకొస్తున్నట్లు దసరా సందర్భంగా అధికారికంగా ప్రకటించారు. ఈ మేరకు విడుదల తేదీతో కూడిన కొత్త పోస్టర్‌ను పంచుకున్నారు. ఈ సినిమాకి బోయపాటి శ్రీను దర్శకత్వం వహిస్తుండగా.. రామ్ ఆచంట, గోపి ఆచంట నిర్మిస్తున్నారు.





# పుకార్లకు ఫుల్‌స్టాప్

## నిశ్చితార్థం చేసుకున్న గీతాగోవిందం జంట

కొంతకాలంగా ప్రేమలో ఉన్న విజయ్ దేవరకొండ, రష్మిక త్వరలో వివాహ బంధంలోకి అడుగు పెట్టనున్నారు. ఇరు కుటుంబాలు, కొద్దిమంది సన్నిహితుల సమక్షంలో హైదరాబాద్‌లో వీరి నిశ్చితార్థం శుక్రవారం జరిగినట్లు సమాచారం. ఇరువురి కుటుంబాలు పెళ్లి ఏర్పాట్లలో నిమగమవుతుండగా, ఫిబ్రవరిలో ఈ జంట పెళ్లి పీటలెక్కబోతుందని విశ్వసనీయ సమాచారం. ప్రముఖ సినీ, రాజకీయ, వ్యాపార రంగానికి చెందినవారంతా ఆ వివాహ వేడుకలో పాల్గనే అవకాశం ఉంది. విజయ్ దేవరకొండ, రష్మిక ఇప్పటికే కలిసి నటించిన గీతగోవిందం, డియర్ కామ్రేడ్ సినిమాల ద్వారా రొమాంటిక్ కెమిస్ట్రీతో మిలియన్ల అభిమానులను ఆకట్టుకున్నారు. అప్పట్నుంచి వీరి జంటపై అభిమానుల్లో ఒక ప్రత్యేకమైన అటాచ్‌మెంట్ ఏర్పడింది. ఇప్పుడు వీరి వివాహం అధికారికమవుతుందన్న వార్తతో సోషల్ మీడియాలో అభిమానులు ఆనందంతో మునిగిపోయారు.

## స్టార్ కిడ్స్ ఇబ్బందులు చెబితే నమ్మరు: జాన్వీ

నెపోటిజం, సినీ నేపథ్యం పదాలు ఇండస్ట్రీలో ఎప్పుడూ వినిపిస్తూనే ఉంటాయి. బయటి వ్యక్తులు పరిశ్రమలో గుర్తింపు తెచ్చుకోవడానికి ఎన్నో ఒడుదొడుకులు ఎదు-ర్కోవాలని స్టార్స్ సైతం అంగీకరిస్తుంటారు. తాజాగా ఈ అంశంపై జాన్వీకపూర్ ఓ చర్చలో మాట్లాడారు. బయట వ్యక్తుల కష్టాలు వినడానికి అందరూ ఆసక్తి చూపుతారని కానీ, ఇండస్ట్రీకి చెందినవారు ఇబ్బందులు పడుతున్నామంటే ఎవరూ వినరని తెలిపారు. 'ఇన్‌సైడర్ అవుట్‌సైడర్' చర్చలో పాల్గొన్న జాన్వీకపూర్ నటీనటులను బయట వ్యక్తులు, సినీ పరిశ్రమకు చెందినవారు అని విభజించడం తనకు ఇష్టం లేదన్నారు. బయట నుంచి పరిశ్రమకు వచ్చినవారితో ఇండస్ట్రీ వారి కష్టాలను పోల్చడం అన్యాయమని అన్నారు. స్టార్ కిడ్స్ ఇబ్బందులు చెప్పినా విడ్డూరంగా ఉంటాయి. వాటిని వినడానికి కూడా ఎవరూ ఆసక్తి చూపరు. అయినా ఇండస్ట్రీలో ఉన్న స్టార్ కిడ్స్ ఎవరూ కష్టాలు పడ్డామని చెప్పరు. ఎందుకంటే బయటి వారితో పోల్చితే వారికి లభించిన సౌకర్యాలకు వారెప్పుడూ కృతజ్ఞతతోనే ఉంటారు. అలాకాకుండా 'మేం ఇంత కష్టపడుతున్నాం' అని చెబితే ఎవరూ వినరు. బయటి నుంచి వచ్చిన వ్యక్తులు ఇండస్ట్రీలో గుర్తింపుతెచ్చుకోవాలంటే ఎన్నో పోరాటాలు చేయాలని నేనూ అంగీకరిస్తాను. ఆ పోరాటాలు స్టార్ కిడ్స్‌కు అర్థం కావని జాన్వీ తెలిపారు. శ్రీదేవి కుమార్తెగా వెండితెరకు పరిచయమై.. మంచి పాత్రలతో తనకంటూ ప్రత్యేక గుర్తింపు తెచ్చుకుంటున్నారు జాన్వీకపూర్. ఉత్తరాదితో పాటు దక్షిణాదిలోనూ అవకాశాలు సొంతం చేసుకుంటున్నారు. వరుణ్ ధావన్‌తో కలిసి ఆమె నటించిన 'సన్నీ సంస్కారి కీ తులసి కుమారి' తాజాగా ప్రేక్షకుల ముందుకువచ్చి పాజిటివ్ టాక్‌ను సొంతం చేసుకుంది.

# దూకుడు మీదున్న ధనుష్

ఈ ఏడాది సౌత్ హీరోల నుంచి వరుస సినిమాలు ప్రేక్షకులను అలరిస్తున్నాయి. అదే తరహాలో నేషనల్ అవార్డ్ విన్నింగ్ నటుడు ధనుష్ కూడా హిట్ ఫట్ తో సంబంధం లేకుండా తన సినిమాలతో జెట్ స్పీడ్‌లో దూసుకుపోతున్నాడు. ఇప్పటికే కుబేర, ఇడ్లీ కొట్టు సినిమాలను ఈ ఏడాదిలోనే రిలీజ్ చేసిన ధనుష్, వీటి తర్వాత కూడా వెనక్కి తగ్గకుండా మరిన్ని ప్రాజెక్టులను రెడీ చేస్తున్నాడు. బాలీవుడ్‌లో తన మరో సినిమా తేరే ఇష్క్ మైన్గ ÷నైల్ స్టేజ్‌కి చేరుకుంది. ఈ చిత్రం నవంబర్‌లో ప్రేక్షకుల ముందుకు రానుంది. తమిళ సినిమాలతో పాటు హిందీ సినిమాల్లో కూడా తనకంటూ ఓ ప్రత్యేకమైన మార్కెట్ ఉన్న ధనుష్, ఈ మూవీతో బాలీవుడ్ ఆడియన్స్‌ను మళ్లీ ఆకట్టుకోబోతున్నాడు. ఇక ఈ సినిమా తర్వాత ఎక్కువ గ్యాప్ లేకుండానే తన 54వ సినిమా కూడా థియేటర్లలోకి రానుంది. దర్శకుడు విగ్నేష్ రాజా తెరకెక్కిస్తున్న ఈ ప్రాజెక్ట్ షూటింగ్ ఇటీవలే పూర్తి అయ్యింది. అందువల్లే ఫిబ్రవరి 2026 లో ఈ సినిమా రిలీజ్ చేయాలని మేకర్స్ ఇప్పటికే నిర్ణయించుకున్నారని సమాచారం. ఇలా వరుస సినిమాలను ఎ÷-లాన్ చేస్తూ, రిలీజ్ చేసేందుకు సిద్ధం అవుతున్న ధనుష్ తన కెరీర్ పేస్ ఏ స్థాయిలో ఉందో అర్థమవుతుంది. ఒకేసారి తమిళం, హిందీ సినిమాలు చేస్తూ, విభిన్న జానర్స్‌లో ప్రేక్షకులను అలరించే ప్రయత్నం చేస్తున్న ధనుష్ రాబోయే నెలల్లో ఫ్యాన్స్‌కి నిజంగానే ఫుల్ మాస్ ట్రీట్ ఇవ్వబోతున్నాడు.

Printed, Published by **Mohammed Murthuza.** Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNIVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. **98660 19778, 89789 60131**